Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 16 | సంచిక: 348 | కరీంనగర్ | శుక్రవారం 8 మే 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## కొండా సురేఖ వ్యాఖ్యలు అభ్యంతరకరం

**- ఎండోమెంట్ మంత్రిగా ఇలానేనా వ్యాఖ్యానించేది**

**- మండిపడ్డ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 7 : జై శ్రీ రామ్ అంటే పైనుంచి పైసలు పడతాయా అని మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై గోషా మహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండోమెంట్ మంత్రి అంటే దేవుడికి మినిస్టర్‌లాగా ఉండాలని.. కానీ కొండా సురేఖ ఏ శాఖకు మంత్రి..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. గురువారం హైదరాబాద్ లో రాజాసింగ్ మాట్లాడా రు. రేవంత్‌రెడ్డి గతంలో

11 లో

## బెంగాల్ అసెంబ్లీ రద్దు

**- గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఉత్తర్వులు**

**- రాజీనామాకు మమత ససేమిరా అనడంతో నిర్ణయం**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

కోల్‌కతా, మే 7 : పశ్చిమ బెంగాల్ అసెంబ్లీని ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి గురువారం రద్దు చేశారు. ముఖ్యమంత్రి పదవికి తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీ రాజీనామా చేయకపోవడంతో.. గవర్నర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. బెంగాల్‌లో శనివారం కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. శుక్రవారం బీజేపీ శాసనసభాపక్షం సమావేశంకానుంది. ఈ సమావేశంలో శాసనసభాపక్ష

11 లో

### తమిళనాట

# కొనసాగుతున్న ఉత్కంఠ

**- గవర్నర్‌తో మరోమారు విజయ్ భేటీ**

**- మెజార్టీకి అవసరమైన మద్దతు లేఖలు కోరిన గవర్నర్**

**- టివికె పార్టీకి అధికారం దక్కడంపై తొలగని అనిశ్చితి**



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

చెన్నై, మే 7 : తమిళనాడులో రాజకీయ పరిణామాలు క్షణక్షణానికి మారుతున్నాయి. టీవీకే చీఫ్ విజయ్ గురువారం మరోసారి లోక్‌భవన్‌కు వెళ్లి, గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిశారు. తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడానికి, అసెంబ్లీలో మెజార్టీ నిరూపించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ భేటీపై లోక్‌భవన్ తాజాగా ప్రకటన విడుదల చేసింది. గవర్నర్ ఆర్లేకర్‌తో విజయ్ భేటీ అయ్యారు. మెజార్టీ కనిపించడం లేదని వివరించారు. మెజార్టీతోనే రావాలని గవర్నర్ సూచించారు అని లోక్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. అయితే, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మరే ఇతర పార్టీని ఆహ్వానించబోమని విజయ్‌కు గవర్నర్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. గవర్నర్ ఆహ్వానం మేరకే విజయ్ ఆయన్ను కలిసినట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత రెండు రోజుల వ్యవధిలో రెండుసార్లు వీరి భేటీ జరిగింది. కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన నేపథ్యంలో బుధవారం గవర్నర్‌తో టీవీకే చీఫ్ భేటీ కాగా.. సంఖ్యాబలంపై గవర్నర్ సంతృప్తి వ్యక్తం చేయలేదు. 118 మంది సభ్యులు సమకూరిన అనంతరం రావాలని సూచించినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం ఏర్పాటుచేయడానికి విజయ్‌కు అనుమతి ఇవ్వాలని వీసీకే గవర్నర్‌ను కోరింది. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు

11 లో



### ప్రతి పేద కుటుంబానికి

# సొంత ఇల్లు

**- భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం - గృహ విప్లవం, రెవెన్యూ సంస్కరణలతో నవశకానికి శ్రీకారం - అదనపు ఎమ్మార్వోల నియామకం - ఏ చిన్న పొరపాటు జరిగిన ఉపేక్షించేది లేదు- ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల సమీక్ష - మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,మే 7 : ప్రతి పేదవాడికి సొంత ఇల్లును సమకూర్చడం, భూ యాజమానులకు తమ భూమి పై స్పష్టమైన హక్కులను కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

11 లో



## పదేళ్ల బిఆర్ఎస్ కన్నా రెండేళ్ల కాంగ్రెస్ బెటర్

**- 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల చొప్పన రుణమాఫీ**

**- బిఆర్ఎస్ నేతల విమర్శలు చూసి రైతులు నవ్వుకుంటున్నారు**

**- రైతులు ఆర్గానికి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలి**

**- వరంగల్ రైతు మేళాలలో పాల్గొన్న మంత్రి తుమ్మల**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హనుమకొండ, మే 7 : బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని పనులను సీఎం రేవంత్‌రెడ్డి రెండేళ్లలోనే చేశారని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మొదటి ఏడాదిలోనే రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మంది రైతులకు రూ. 2 లక్షల చొప్పున రుణమాఫీ చేశారని చెప్పారు. రైతులందరూ ఆర్గానిక్ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానిం చారు. రసాయనాల వాడకాన్ని తగ్గించకపోతే వ్యవసాయమే ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు. గురువారం హనుమకొండలో జరిగిన రైతుమేళాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి రైతు మేళాలో తుమ్మల పాల్గొన్నారు. బీఆర్ఎస్ నేతలు వరంగల్ సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిపై చౌవకబారు వ్యాఖ్యలు చేశారని ధ్వజమెత్తారు. రుణమాఫీపై కేటీఆర్ అండ్ కో అసత్యాలు మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. రుణమాఫీపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కి లేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు ఎగ్గొడితే సీఎం రేవంత్‌రెడ్డి

11 లో

### గవర్నర్ తీరుపై

## కాంగ్రెస్ ఆగ్రహం

**- నేడు లోకేభవన్ ముట్టడికి నిర్ణయం**

**- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపు**



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

చెన్నై, మే 7 : తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటు అంశం ఇప్పుడు రాజ్యాంగ సంక్షోభానికి దారితీస్తోంది. అత్యధిక స్థానాలు సాధించిన టివికె అధినేత విజయ్‌ను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించడంలో గవర్నర్ ఆలస్యం చేస్తుండటాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ పోరుబాట పట్టబోతోంది. గవర్నర్ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నేడురాష్ట్రవ్యాప్త

11 లో



### వడ్డీలేని రుణాలు 5 నుంచి

## పది లక్షలకు పెంపు

**- మహిళా సంఘాలకు సీతక్క శుభవార్త - ఈ మొత్తలకు ప్రభుత్వమే వడ్డీల చెల్లింపు - పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 7 : మహిళా స్వయం సహాయక బృందాలకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క గుడ్ న్యూస్ చెప్పారు. ప్రతి ఒక గ్రూపునకు వడ్డీ లేని రుణాలు రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచుతున్నట్లు మంత్రి సీతక్క ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లో మహిళా స్వయం సహాయక బృందాలతో మంత్రి సీతక్క సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ప్రతి మహిళా సంఘం తీసుకునే రూ. 10 లక్షలు బ్యాంకు రుణాలకు వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తోందని హామీ ఇచ్చారు. మహిళా సంఘాల రుణాలకు ఈ ఏడాది వడ్డీల కోసం రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తామని వివరించారు. అప్పటి వరకు అర్హత గల మహిళా సంఘాలకు రూ. 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు కల్పించామన్నారు. ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచుతున్నామని వివరించారు. మహిళలపై భారాన్ని దించేందుకు వడ్డీ లేకుండా రెట్టింపు లోన్లు ఇస్తున్నామన్నారు. బ్యాంకులకు రీ పేమెంట్ బాగా చేస్తున్నారంటూ మహిళా సంఘాలపై ఈ సందర్భంగా మంత్రి సీతక్క ప్రశంసలు కురిపించారు.మహిళా ఉ

11 లో

### అతిపెద్ద పార్టీగా టివికెను ఆహ్వానించాలి

**- గవర్నర్ తాత్సారం చేయడం తగదు**

**- తమిళనాడు లెఫ్ట్ పార్టీల డిమాండ్**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

చెన్నై, మే 7 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. నటుడు, రాజకీయ నాయకుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, ప్రభుత్వం ఏర్పాటు చేసే విషయంలో గవర్నర్ కార్యాలయం తీసుకున్న నిర్ణయం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన స్పష్టమైన మెజారిటీ మద్దతు ప్రస్తుతం టీవీకే వద్ద లేదని గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా అసెంబ్లీలో ప్రభుత్వం ఏర్పాటు

11 లో

## కరీంనగర్‌లో దాడులతో ఉద్రిక్తత

**- గంగుల కమలాకర్ కార్యాలయంపై దాడి - కౌశిక్ రెడ్డి కారు అద్దాలు ధ్వంసం - లాఠీఛార్జ్ చేసి చెదరగొట్టిన పోలీసులు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, మే 7 : కరీంనగర్ పట్టణంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. కేంద్రమంత్రి బండి సంజయ్‌పై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఉద్రిక్తతలకు కారణమయ్యాయి. బీజేపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై కర్రలు, రాడ్లతో దాడి చేశారు. కిటికీల అద్దాలు పగులగొట్టారు. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్ ముగిసిన 10 నిమిషాలకే బీజేపీ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడి కౌశిక్ రెడ్డి వాహనం ధ్వంసం చేశారు. కౌశిక్ రెడ్డిపై సైతం దాడికి యత్నించారు. దీంతో హుజురాబాద్‌లో తీవ్ర ఉద్రిక్తత చోటు

11 లో

## విజయ్‌ను అడ్డుకుంటున్న కేంద్రం

**- ఒక్క సీటున్న బిజెపి రాజకీయం తగదు - గవర్నర్ తీరుతో ప్రజాస్వామ్యం అపహాస్యం - కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ ఆగ్రహం**



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

చెన్నైచెన్నై, మే 7 : తమిళనాడులో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉన్న 'తమిళగ వెట్రి కజగం' అధినేత విజయ్‌కు కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ పూర్తి మద్దతు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మార్పు కోసం ఎంతో ఆశగా ఓటు వేసినప్పటికీ, నటుడిగా రాజకీయాల్లోకి వచ్చిన విజయ్‌ను అడ్డుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.

11 లో

## రేవంత్‌తో బండి సంజయ్ మిలాఖత్

**- కోట్ల ఆస్తులు ఎక్కడివంటూ కౌశిక్ రెడ్డి ప్రశ్న**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, మే 7 : కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. బండి సంజయ్, సీఎం రేవంత్ రెడ్డి మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని ఆరోపించారు. రేవంత్ ఏది మాట్లాడితే.. బండి సంజయ్ అదే మాట్లాడుతున్నారని తెలిపారు. బండి సంజయ్ తిట్టాల్సింది కేటీఆర్‌నా... రేవంత్ రెడ్డినా అని ప్రశ్నించారు. బంగారం షాపులో దొంగతనం జరిగితే ప్రభుత్వానికి బాధ్యత లేదా అని నిలదీశారు. రేవంత్‌ను సంజయ్ ఒక్క మాట కూడా ఎందుకు అనడం లేదని అన్నారు. భార్య పుస్తెలు అమ్మి పోటీ చేసిన బండి సంజయ్‌కు కోట్ల రూపాయలు

11 లో

## డ్రగ్స్ కట్టడి చేయడమే తొలి ప్రాధాన్యం



**- రిపీటెడ్‌గా పట్టుబడితు పిడి యాక్ట్ పెట్టే ఆలోచన**

**- ఈగల్ ఫోర్స్ ద్వారా మంచి ఫలితాలు**

**- సమీక్షలో డిజిపి సివి ఆనంద్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 7 : రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడి చేయడమే తమ తొలి ప్రాధాన్యమని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. రిపీటెడ్‌గా డ్రగ్స్ కేసులో పట్టుబడితే పీడీ

11 లో

## గంగుల కార్యాలయం, కౌశిక్ రెడ్డి కారుపై దాడి

**- బిజెపి కార్యకర్తుల గుండాల్లో దాడులు చేయడమేంటి**

**- మండిపడ్డ కెటిఆర్, హరీష్ రావులు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 7 : కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారుపై బీజేపీ శ్రేణులు దాడి చేయడంపై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం

11 లో



# గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

### - ఎంపీ రఘురాం రెడ్డి
### - మారుమూల ప్రాంతాలకు నిధుల్లో ప్రాధాన్యం
### - మధిర, బోనకల్ మండలాల్లో విస్తృత పర్యటన
### - రూ.52 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం



ప్రజాలక్ష్యం (ప్రతినిధి)

ఖమ్మం, మే 7 : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి పేర్కొన్నారు. గురువారం మధిర, బోనకల్ మండలాల్లో విస్తృతంగా పర్యటించిన ఆయన పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, పూర్తయిన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, తనకు కేటాయించే నిధుల్లో అధిక భాగాన్ని గ్రామాలు, మారుమూల ప్రాంతాలు, ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధికి వినియోగిస్తానని స్పష్టం చేశారు. వెనుకబడిన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమం, సమాన అభివృద్ధి దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని, తాను ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. బోనకల్ మండలంలోని తూటికుంట్లలో రూ.5 లక్షలతో రెండు సీసీ రోడ్లకు, చిరునోములలో రూ.4.50 లక్షలు, పెద్ద బీరవల్లిలో రూ.4 లక్షలు, చిన్నబీరవల్లిలో రూ.4.50 లక్షలు, రాపల్లిలో రూ.4 లక్షలతో నిర్మించనున్న రోడ్లకు శంకుస్థాపన చేశారు. ముష్టికుంటలో రూ.5 లక్షలు, బోనకల్ మండల కేంద్రంలో రూ.5 లక్షలతో పూర్తయిన రోడ్లను ప్రారంభించారు. మధిర మండలంలో వంగవీడులో రూ.5 లక్షలు, నిధనపురంలో రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. సిరిపురంలో రూ.5 లక్షలు, రాయపట్నంలో రూ.5 లక్షలతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. ఒకే రోజులో మొత్తం 12 ప్రాంతాల్లో సుమారు రూ.52 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఐలూరి వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్ కోటా రాంబాబు, మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, జిల్లా నాయకులు పైడిపల్లి కిషోర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, టెలిఫోన్ అడ్వైజర్ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, సత్యనారాయణ రెడ్డి, సర్పంచులు, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల పనులు గడువులోగా పూర్తి చేయాలి

### - జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ - ప్రాజెక్ట్ వారీగా సమస్యలు స్పష్టంగా నివేదికల్లో పొందుపరచాలి
### - కేజీబీవీ పనులు నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని ఆదేశం



ప్రజాలక్ష్యం (ప్రతినిధి)

ఖమ్మం, మే 7 : జిల్లాలో కొనసాగుతున్న విద్య, వైద్య మౌలిక వసతుల నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సంబంధిత శాఖల అధికారులతో కలిసి పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా జిల్లాలో 15 జూనియర్ కళాశాలల మరమ్మతులు, అమ్మ ఆదర్శ పాఠశాల పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఇకపై నిర్వహించే ప్రతి సమీక్ష సమావేశానికి ప్రాజెక్ట్ వారీగా ఎదురవుతున్న సమస్యలను స్పష్టంగా నివేదికల్లో పొందుపరచాలని అధికారులను ఆదేశించారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధి పనుల్లో ఎదురయ్యే సమస్యలను వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. టీజీఎంఎస్ ఐడీసీ ఆధ్వర్యంలో రూ.50 లక్షలకు పైబడిన 11 ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని, తిరుమలాయపాలెంలో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 50 పడకలకు విస్తరించే పనులు, జిల్లాలో కొనసాగుతున్న 100 పడకల ఆసుపత్రుల నిర్మాణాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. టీజీఈడబ్ల్యూఐడీసీ ద్వారా రూ.50 లక్షలకు పైబడిన 24 ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. అన్ని భవిత కేంద్రాల పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని, వైరా జూనియర్ కళాశాల అదనపు తరగతి గదుల టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. కేజీబీవీ పనులను సమయానికి పూర్తి చేసి నిధులను సమర్థంగా వినియోగించాలన్నారు. 14 కేజీబీవీ పనులకు నాబార్డ్ నిధులు మంజూరైనందున వాటిని వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పీఆర్ ఎస్ఈ వై. వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ ఎం. యాకోబు, టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ బుగ్గయ్య, టీజీఎంఎస్ఐడీసీ ఈఈ టి. ఉమామహేష్, ఆర్ అండ్ బి ఈఈ ఎం.ఎ. బషీర్, పీఆర్ ఈఈ యు. మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి ఎత్తిపోతల పథకాల పట్ల నిర్లక్ష్యం ఎందుకు?

### కుల సంఘాల జేఏసీ ప్రశ్న



ప్రజాలక్ష్యం (ప్రతినిధి)

కాటారం, మే 7 : మంథని నియోజకవర్గంలో గోదావరి నదిపై 2008లో శంకుస్థాపన చేసిన ఎత్తిపోతల పథకాలను వెంటనే పూర్తి చేసి ప్రారంభించాలని జిల్లా కుల సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. పథకాల అమలులో జరుగుతున్న ఆలస్యం, నిర్లక్ష్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గురువారం ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో జరిగిన సమావేశంలో జిల్లా కుల సంఘాల జేఏసీని ఏర్పాటు చేసి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ పీక కిరణ్ మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రభుత్వంపై ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పలు కీలక తీర్మానాలు ఆమోదించారు. మల్హర్ మండలంలోని ఏఎంఆర్ ఓసీపీ ప్రభావంతో నష్టపోయిన కాపురం గ్రామానికి పక్కా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని, దేవదుల గోదావరి జలాలతో బోర్లగూడెంలో 2 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ ఏర్పాటు చేసి 14 గ్రామ పంచాయతీలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే మంథని నియోజకవర్గంలో నిధులు కేటాయించిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని కోరారు. పలిమెల, బోర్లగూడెం గ్రామాల్లో 20 పడకల ఆసుపత్రి మంజూరు చేయాలని, ఇంచంపల్లి వద్ద జలవిద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఇటీవల ప్రజా సంఘాల నాయకులపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని తీర్మానించారు. ఈ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని జేఏసీ నాయకులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ సమావేశంలో జేఏసీ కన్వీనర్ అజ్మీరా పూల్‌సింగ్ నాయక్, కో-కన్వీనర్లు రామగిరి రాజు, ఐతు బాపు, సుంకరి మల్లేష్, చకినాల ప్రశాంత్, ఆత్కూరి శ్రీధర్, చంద్రగిరి వినోద్, వావిళ్ల సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు

ప్రజాలక్ష్యం (ప్రతినిధి)



ములుగు, మే 7 : ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన చివరిదశ సుందరీకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. గురువారం ములుగు గట్టమ్మ వద్ద నిర్మిస్తున్న నూతన సమీకృత కలెక్టరేట్ భవన చివరి దశ సుందరీకరణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జాతీయ జెండా,సమావేశపు గది,స్టేట్ బోర్డ్,ఛాంబర్,లిఫ్ట్, టాయిలెట్స్,గార్డెనింగ్ సుందరీకరణ పనులను పరిశీలించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను,కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండేలా నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ భవనం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ ఈ ఈ శ్యామ్ సింగ్, ఏ ఈ,గుత్తేదారులు పాల్గొన్నారు.

# దళిత మహిళపై అసభ్య పాట వైరల్ చేయడం గర్హనీయం

### - కమ్యూనిస్టు ఘన చరిత్రకు మచ్చ తెచ్చే చర్య ఇది - మామిడిపల్లి బాపయ్య
### - వన్ ఇంక్లైన్‌లో ఏమి జరుగుతుందో బయటపెట్టాలి : స్వప్న





ప్రజాలక్ష్యం (ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 07 : తాడిత, పీడిత ప్రజల పక్షాన నిలిచే కమ్యూనిస్టులు ఒక దళిత మహిళను టార్గెట్ చేస్తూ పాట వైరల్ చేయడం సరికాదని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ మెంబర్ ఇరుగురాళ్ల భాగ్యలక్ష్మితో కలిసి ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టులు అంటే తమకు ఎంతో గౌరవమని, దళితుల కోసం , పేదల కోసం, పీడిత తాడిత, అణగారిన వర్గాల కోసం పోరాటాలు చేసిన ఘన చరిత్ర కమ్యూనిస్టులదని, అలాంటి కమ్యూనిస్టులకు మచ్చ తెస్తూ నేడు ఒక దళిత మహిళా కార్మికురాలిపై అసభ్య పదజాలంతో పాట రాసి, దాన్ని సోషల్ మీడియాలో వైరల్ చేయడం గర్హనీయమన్నారు. ఆ పాట మహిళా జాతినే అవమానపరిచే విధంగా ఉందని, మహిళా సాధికారతకు భంగం కలిగించే విధంగా ఉందని విమర్శించారు. ఆ మహిళా కార్మికురాలికి, ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లాగౌడ్ కు మధ్య ఉన్న వైరంతోనే ఆ పాటను రాయించి సోషల్ మీడియాలో వైరల్ చేశారని బాపయ్య ఆరోపిస్తూ.. మడ్డి ఎల్లాగౌడ్ ను పార్టీ, యూనియన్ నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. కాగా ఇదే విషయంపై మహిళా కార్మికురాలు స్వప్న మాట్లాడుతూ ఆ పాట ఏ మహిళపై రాసారో స్పష్టం చేయాలని డిమాండ్ చేసారు. ఆ పాట వైరల్ చేయడం పట్ల స్పందించిన ఓ దళిత నాయకుడిని బుధవారం సీపీఐ నాయకులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వన్ ఇంక్లైన్ లో ఏమి జరుగుతుందో మీకు తెలుసా! అంటూ ప్రశ్నించారని, మరి వన్ ఇంక్లైన్ లో ఏమి జరుగుతుందో తెలుపాలని, పోలీస్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని కోరారు. అలాగే మహిళపై అసభ్యంగా పాట రాయించిన వారిని, ఆ పాటను సోషల్ మీడియాలో వైరల్ చేసిన వారిని గుర్తించి, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో దళిత సంఘం నాయకులు ఆకునూరి బాలంకూస్, గణేష్ మహరాజ్, కవితా సరోజినీ తదితరులు పాల్గొన్నారు.



# డైవర్షన్ పాలిటిక్స్‌తో హామీలు గాలికొదిలిన ప్రభుత్వం

### - కాంగ్రెస్ కు, బీజేపీకి మధ్య లోపాయికారి ఒప్పందమేమిటో!
### - మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 07: కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలిందని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాయకులు నడిపెల్లి మురళీధర్ రావుతో కలిసి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండున్నర ఏళ్ళు గడుస్తున్నా ఇప్పటివరకు రైతులకు, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, హామీలపై ప్రశ్నించిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై కేసులంటూ, కేసీఆర్ పై సీబీఐ విచారణ అంటూ ప్రజల దృష్టిని మరలిస్తోందని అన్నారు. అటు కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గపు పాలనపై బీజేపీ ఎంపీలు కూడా నోరు మెదపడం లేదని, వారి మధ్య ఉన్న లోపాయికార ఒప్పందం ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి పెట్టకుండా పొద్దున లేవడంతోనే కేసీఆర్ జపం చేస్తూ ఉంటున్నారని ఎద్దేవా చేశారు. రెండున్నర సంవత్సరాలుగా కాళేశ్వరంపై విచారణ పేరిట రైతులను, ప్రజలను ఎండపెట్టిందని, ఇప్పుడు కొత్తగా విద్యుత్ పేరిట కేసీఆర్, కేటీఆర్ లపై సీబీఐ విచారణ అంటూ బెదిరింపులు చేస్తూ ప్రజల దృష్టిని డైవర్షన్ చేసే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. రైతుల ధాన్యం ఇంకా కొనుగోలు చేయలేదని, సరిపడా గన్ని సంచులు సరఫరా చేయలేదని విమర్శించారు. ఈ డైవర్షన్ పాలిటిక్స్ ఆపి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ మేకల సమ్మయ్య, నాయకులు నారాయణదాసు మారుతి, కవితా సరోజినీ, బొడ్డుపల్లి శ్రీనివాస్, నీరటి శ్రీనివాస్, గుంపుల లక్ష్మి, గుర్రం పద్మ, తోకల రమేష్, సట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ పట్టుబడిన అటవీ శాఖ అధికారులు...

### - రూ 3.5 లక్షలు లంచం తీసుకుంటూ
### - ఏసీబీకి చిక్కిన భద్రాచలం ఎఫ్‌డిఓ, డిఆర్ఓ

ప్రజాలక్ష్యం (ప్రతినిధి)



భద్రాద్రికొత్తగూడెం, మే 7 : చర్ల మండలం పూసుగుప్ప ప్రాంతంలో రోడ్డు వేస్తుండగా కొన్ని చెట్లు కట్ కావడంతో వాటి గురించి కేసు నమోదు చేయకుండా ఉండేందుకు భద్రాచలం అటవీ శాఖ ఎఫ్‌డిఓ సుజాత రూ.పది లక్షలు డిమాండ్ చేసి, గురువారం రూ 3.5 లక్షలు లంచం తీసుకుంటూ ఉండగా ఏసీబీ డిఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో ఆమెను, చర్ల ఇంచార్జ్ డిఆర్ఓ కృష్ణయ్యను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. చర్ల మండలం పూసుగుప్ప ప్రాంతంలో రోడ్డువేస్తుండగా పొరపాటున చెట్లు దెబ్బతిన్నాయి. ఈ ఎపిసోడ్ లో ఎఫ్‌డిఓ సుజాత రూ.పది లక్షలు డిమాండ్ చేసి భద్రాచలం కార్యాలయంలో గురువారం రూ. 3.5 లక్షలు లంచం తీసుకుంటూ డిఆర్ఓతో పాటు పట్టుబడ్డారు. గతంలో కొత్తగూడెం అటవీ అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి మూడున్నర లక్షలు లంచం తీసుకుంటు పట్టుబడ్డారు. ఈ ఇద్దరినీ అదుపులోకి తీసుకుని, రిమాండ్ చేశారు. అటవీ శాఖలో అవినీతి పేరుకుపోయిందనటానికి ఈ అవినీతి ప్రత్యక్ష నిదర్శనంగా చర్చించుకుంటున్నారు.



# సింగరేణి పరిరక్షణకే టీజీబీకేఎస్ ఆవిర్భావం

### - జూన్‌లో వెయ్యిమందితో ప్రథమ మహాసభ
### - కన్వీనర్ కెంగర్ల మల్లయ్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 07: కార్మికవర్గ ప్రయోజనాల కోసం నిఖార్సుగా నిలబడి కొట్లాడడం కోసమే తెలంగాణ బొగ్గుగని కార్మిక సమాఖ్య ఆవిర్భావం జరిగిందని ఆ యూనియన్ కన్వీనర్ కెంగర్ల మల్లయ్య వెల్లడించారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెంగర్ల మల్లయ్య మాట్లాడుతూ మే 4కు చరిత్రలో ఒక ప్రత్యేకత ఉందని, ఆ రోజే బొగ్గు గనుల తవ్వకాలు ప్రారంభించిన రోజని, అంటే గని కార్మికుని పుట్టిన రోజనీ, ఆ మే 4న మేడారం సమ్మక్క-సారలమ్మ సాక్షిగా తెలంగాణ బొగ్గుగని కార్మిక సమాఖ్య ఆవిర్భావం జరిగిందన్నారు. లాభాల బాటలో ఉన్న సింగరేణి సంస్థ.. నేడు కార్మికులకు జీతాలను ఇవ్వడానికి అప్పుల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. మితిమీరిన రాజకీయ జోక్యం కారణంగా సింగరేణి సంస్థ భవిష్యత్తు అంధకారంగా మారనుందని తెలిపారు. ఇదంతా రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి సంస్థకు 51 వేల కోట్ల రూపాయలు బకాయి పడడం మూలంగానేనని ఆరోపించారు. ఇప్పుడు మన సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత, కార్మికుల హక్కులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత కార్మికవర్గంపై ఉందని అన్నారు. అందుకే సంస్థ పరిరక్షణకు, కార్మికవర్గ శ్రేయస్సుకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సమాఖ్య ఆవిర్భావం జరిగిందని తెలిపారు. ఆవిర్భావం సందర్భంగా జూన్ నెలలో ప్రథమ మహాసభను వెయ్యి మందితో నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఇందుకోసం పలువురు యూనియన్ కో ఆర్డినేటర్లను నియమించుకోవడం జరిగిందని, వారి పేర్లను వెల్లడించారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో టీజీబీకేఎస్ నాయకులు పెంచాల తిరుపతి, మంద సంపత్, బోడ ఐలయ్య, మోహన్ రావు, దేవ శ్రీనివాస్, దొడ్ల సతీష్, మహేష్, మహేందర్, దాసరి శంకర్, విజయ భాస్కర్, మల్లేష్, శంకర్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ పిఎంజె జ్యువెలరీ షాపు దోపిడీ

### - దొంగలు వాడిన బైక్ నంబర్ డూప్లికేట్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, మే 7 : కరీంనగర్ పీఎంజే జ్యూవెలరీ షాపు దోపిడీ కేసులో ట్విస్ట్ బయటపడింది. దోపిడీ కోసం దుండగులు ఉపయోగించిన బైక్‌కు.. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి వాహనం నంబర్ వాడినట్లు విచారణలో బయటపడింది. హైదరాబాద్‌కు చెందిన మొబైల్ షాపు వ్యాపారి ద్విచక్ర వాహనం నంబర్‌ను దుండగులు వాడినట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే సదరు వ్యాపారిని హైదరాబాద్, కరీంనగర్ పోలీసులు విచారించారు. విచారణలో మొబైల్ వ్యాపారి అపాచీ బైక్ నంబర్‌ను దుండుగులు ఉపయోగించిన బైక్‌కు పెట్టుకుని పోలీసుల దృష్టి మళ్లించే ప్రయత్నం చేసినట్లు బయటపడింది. దీంతో ఆ నంబర్ దోపిడీ దొంగలకు ఎలా తెలిసిందనే దానిపై పోలీసులు ఆరా తీశారు. హైదరాబాద్‌కు చెందిన మొబైల్ వ్యాపారి ఇటీవల తన అపాచీ బైక్ అమ్మడానికి క్షఓచీలో పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. దుండగులు క్షఓచీలో బైక్ నంబర్‌ను గుర్తు పెట్టుకుని ఆ నంబర్‌ను ఉపయోగించినట్లు పోలీసుల విచారణలో తేలింది.




# దివ్యాంగులకు అండగా ఉంటాం...




- అర్హులందరికీ త్వరలో ఉపకరణాలు అందిస్తాం
- ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు త్వరలో సైకిల్ పంపిణీ చేస్తాం
- దివ్యాంగులకు సేవలందిస్తున్న జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులకు అభినందనలు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- ఐఓసీఎల్ సీఎస్ఆర్ కింద జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు రూ.83 లక్షల విలువైన 813 ఉపకరణాల పంపిణీ
- హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, మే 07 : దివ్యాంగులకు అండగా ఉంటామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ భరోసా ఇచ్చారు. ఇండియన్ ఆయిల్ కంపెనీ లిమిటెడ్ సీఎస్ఆర్ కింద దివ్యాంగులకు రూ. 83 లక్షల విలువైన 813 ఉపకరణాలు అందించగా, జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సినారే కళామందిరంలో గురువారం నిర్వహించగా, ముఖ్య అతిథులుగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వినికిడి యంత్రాలు, బ్యాటరీ సైకిల్స్, సుగమ్య కేన్, స్మార్ట్ ఫోన్, ఇతర పరికరాలు అందజేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తుందని, దివ్యాంగుల కోసం రూ. 1600 కోట్లు వెచ్చిందని తెలిపారు. దివ్యాంగులకు ఇప్పటికే సహాయ పరికరాలు ఇచ్చామని, భవిష్యత్తులో అర్హులందరికీ ఇస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. ఎంతో మంది దివ్యాంగులు ఆత్మ స్థైర్యం, మనోధైర్యంతో ఎందరో జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని కొనియాడారు. ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. దివ్యాంగులకు అందరూ మద్దతుగా ఉండాలని, వారిలో స్ఫూర్తి నింపాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం ఇస్తున్నామని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలని, డ్రాప్ ఔట్ ఉండవద్దని తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఈ మేరకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ ఏడాది కూడా సైకిల్ లు ఇస్తామని, ఈ ఏడాది 15 వేలు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. దివ్యాంగులు సంక్షేమానికి కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులకు అభినందనలు తెలియజేశారు.

శిబిరంలో పంపిణీ చేసే ఉపకరణాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకొని మరింత ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. సుగమ్య భారత్... స్వశక్త భారత్‌లో భాగంగా దేశ నిర్మాణం, అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందించేందుకు జిల్లాలో ఆరు శిబిరాలు ఏర్పాటు చేశామని, వైద్య పరీక్షలు చేయించి అర్హులను గుర్తించామని తెలిపారు. ఈ ఉపకరణాలతో దివ్యాంగులకు ఎంతో మేలు చేకూరుతుందని వివరించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ లో 10 మంది దివ్యాంగులకు ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో యూ డీ ఐ డీ కేంద్రంలో అన్ని వసతులు కల్పించామని, వైకల్య నిర్ధారణ పరీక్షలు ప్రతి నెలా చేయిస్తున్నామని తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేములవాడలో మహా శివరాత్రి సందర్భంగా భక్తులకు హెల్ప్ డెస్క్, దివ్యాంగులకు వీల్ చైర్లు, సహాయం అందించామని గుర్తు చేశారు. సిరిసిల్లలోని డే కేర్ సెంటర్ లో సేవలను దివ్యాంగులు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారాణి, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ఐఓసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ వినీత్ కౌల్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సీఎస్ ఆర్ హెడ్ హైదరాబాద్ కైలాస్ కాంత్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జడ్పీ సీఈవో వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక వైద్య పరికరాలతో మెరుగైన వైద్య సేవలందించాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష - జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**
**- రూ.39 లక్షల విలువైన నూతన వైద్య పరికరాల ఏర్పాటు పూర్తి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, మే 07 : పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆధునిక వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిం చాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. గురువారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ శ్రీహర్ష ఆకస్మికంగా తనిఖీ చేసి వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి కొత్తగా వచ్చిన సుమారు రూ.39 లక్షల విలువైన వైద్య పరికరాల ఏర్పాటు పూర్తయ్యిందని తెలిపారు. చిన్నపాటి సాంకేతిక ప్రక్రియలు పూర్తి చేసిన అనంతరం ప్రభుత్వ విప్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ సుమారు వెయ్యి మంది ఓపీ రోగులు ఆసుపత్రికి వస్తున్నందున వారికి అవసరమైన అన్ని సేవలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫార్మసీ విభాగాన్ని పరిశీలించి మందుల లభ్యతపై ఆరా తీశారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను



ఆదేశించారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన స్లిట్ ల్యాంప్, 90డి లెన్స్, సి-ఆర్మ్ మిషన్, యూరాలజీ పరికరాలు, స్పిరో మీటర్, ఆడియో మీటర్, ఫైబర్ ఆప్టిక్ లారింగోస్కోప్, డెర్మా చెయిర్, అల్ట్రాసౌండ్ మిషన్, హీటింగ్ ప్యాడ్, చెస్ట్ వైబ్రేటర్, రూట్ కెనాల్ చికిత్సకు అవసరమైన ఎండోమోటర్, మైక్రోమోటర్ హ్యాండ్ పీస్ తదితర ఆధునిక పరికరాల వినియోగంపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.శ్రీధర్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# సీతారామరాజు దేశభక్తి, ధైర్యసాహసాలు, త్యాగనిరతి

**- యువతకు స్ఫూర్తి కావాలి - నేతాజీ సేవా సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ కందుల నాగరాజు**
**- మానుకోటలో ఘనంగా అల్లూరి 102వ వర్ధంతి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 07 : అల్లూరి సీతారామరాజు దేశభక్తి, ధైర్యసాహసాలు, త్యాగనిరతి యువతకు స్ఫూర్తి కావాలని నేతాజీ సేవా సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ కందుల నాగరాజు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, తెలుగు తేజం, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 102వ వర్ధంతిని నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఉదయం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఉషోదయ, మిత్ర, కాఫీ క్లబ్ వాకర్స్ అసోసియేషన్స్ సభ్యులు,ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నేతాజీ సేవా సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ మానుకోటలో సాధుల ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత విలువిద్య శిక్షణలో పాల్గొంటున్న యువతి, యువకులకు అల్లూరి సీతారామరాజు దేశభక్తి, ధైర్యసాహసాలు, త్యాగస్ఫూర్తి గురించి వివరించారు. యువత దేశరక్షణ కోసం సైన్యంలో చేరి సేవ చేయాలని పిలుపు నిచ్చారు. ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల శంభయ్య మాట్లాడుతూ మర్చిపోతున్న స్వాతంత్ర్య సమరయోధులను తిరిగి గుర్తుచేయడం ఎంతో హర్షణీయమన్నారు. డాక్టర్ భూక్య వెంక ట్రామ్ మాట్లాడుతూ పురాణాల ప్రకారం మనం ఎంతగా తలుచుకుంటే ఆ మహనీయులు అంతకాలం స్వర్గంలో ఉంటారని, స్వాతంత్ర్య సమరయోధులను ఎప్పటికీ



స్మరించుకుంటూ ఉండాలన్నారు. ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ వీరన్న మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల ఎనలేని కృషి, ధైర్యసాహసాలు ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. అడ్వకేట్ బోనగిరి రవీంద్ర గుప్తా మాట్లాడుతూ దేశ చరిత్రలో స్వాతంత్ర్య సమరయోధుల స్థానం ఎంతో గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కుదురుపాక వివేక్,చిట్టిమల్ల రఘు,కందగట్ల వెంకటేశ్వర్లు, అక్కెర మోహన్ రావు, ఉపాధ్యాయులు గోపికృష్ణ, శ్రీధర్ రెడ్డి, సాదుల ఉపేందర్, పుట్ట మార్కండేయ, సాదుల సారంగపాణి (ఏసీబీ), సర్వ కృష్ణయ్య, గంగాధర్ గుప్తా, మాస్టర్ అర్జున్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు,ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పుర ప్రముఖులు,యువతి యువ కులు, పెద్ద ఎత్తున నివాళులు అర్పించారు.

# రైతులు లాభదాయకమైన పంటల సాగుపై దృష్టి సారించాలి

**- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి. మే 07 : ప్రస్తుత మారుతున్న వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా రైతులు డిమాండ్ ఉన్న, లాభదాయకమైన పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 4 నుంచి నిర్వహిస్తున్న రైతు వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రం సమీపంలోని పోతిరెడ్డిపల్లి రైతు వేదికలో వ్యవసాయ, విద్యుత్, రెడ్‌కో శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు తమ భూములకు అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకుని సాగు చేస్తే అధిక దిగుబడులతో పాటు మెరుగైన లాభాలు పొందవచ్చన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మార్కెట్ అవసరాలు, కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై రైతులు అవగాహన పెంపొందించుకుని పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయం చేయాలని సూచించారు. వ్యవసాయంలో పంటల సాగుతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తులపై కూడా రైతులు దృష్టి పెట్టాలని చెప్పారు. వ్యవసాయంలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, వాటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా పీఎం కుసుమ్ కాంపోనెంట్ పథకం కింద సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని రైతులు నిరంతర ఆదాయం పొందేలా ముందుకు రావాలని సూచించారు. సహజ వనరులను సమర్థంగా వినియోగించుకునే దిశగా రైతులు అడుగులు వేయాలన్నారు. అదేవిధంగా ఆయిల్ పామ్ సాగు మంచి లాభదాయకమైన పంట అని, భూమి, బోరు సౌకర్యం ఉంటే సరిపోతుందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం 90 శాతం వరకు సబ్సిడీ అందిస్తున్నందున రైతులు ఈ పంట సాగుపై దృష్టి సారించాలని కోరారు.



వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా పలు వ్యవసాయ పనిముట్లను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. వ్యవసాయానికి సంబంధించి రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా కొంతమంది రైతులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. ఏ పంటలు సాగు చేస్తున్నారని, ఎన్ని ఎకరాలు ఉంది, బోరు సౌకర్యం ఉందా అని ఆరా తీశారు. ఐదు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నట్లు రైతు తెలుపగా, లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. జహీరాబాద్, సదాశివపేట, వట్‌పల్లి ప్రాంతాల్లో జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కొందరు రైతులు కోరగా, ఆ దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం రైతులకు సబ్సిడీపై అందజేస్తున్న డ్రోన్లు, కట్టర్లు, స్ప్రేయర్లు తదితర వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల వినియోగంపై వ్యవసాయ శాఖ అధికారులు ప్రదర్శన నిర్వహించారు. విద్యుత్ శాఖ అధికారులు రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం తీసుకుంటున్న చర్యలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల వద్ద పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.



# తెలంగాణ ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధం

**టిజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి మే 07 : తెలంగాణ ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా వుందని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షులు తుల్జారెడ్డి అధ్యక్షతన తెలంగాణ జన సమితి జిల్లా ప్లినరీ సమావేశం, తెలంగాణ తొలి మలి దశల ఉద్యమ కారులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ జిల్లాలోని ఉద్యమ కారుల ప్రధాన సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం తప్పకుండా త్వరలోనే అమలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తుల్జారెడ్డితో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశప్ప, మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు ఉద్యమ కారులు అన్వర్, మందుల వరలక్ష్మి, సంజీవ్, తెజస పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీగా నూతనంగా ఎన్నికై సంగారెడ్డికి వచ్చిన కోదండరాంను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.




# దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయం

**- నిజాయితీ, నిరాడంబరత్వానికి ఆయన జీవితం ఆదర్శం - కాంగ్రెస్ నాయకులు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సూర్యాపేట, మే 7 : మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కాంగ్రెస్ కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డి. అంజద్ అలి పేర్కొన్నారు. దామోదరం సంజీవయ్య వర్ధంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాయితీ, నిరాడంబరత్వం, ఉన్నత విలువలకు దామోదరం సంజీవయ్య ప్రతీకగా నిలిచారని కొనియాడారు. రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రిగా సేవలందించిన ఆయన ప్రజా సంక్షేమం కోసం విశేష కృషి చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని నిరోధించేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసిన నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఆదేశాల మేరకు, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పోతు భాస్కర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది సూచనలతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్ నాయుడు, మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరు వెంకన్న గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు నాగుల వాసు, గుణగంటి హేమ సతీష్, వల్దాసు లక్ష్మీ శ్రీనివాస్, కోడి శిరీష శివ, షేక్ జహీర్, కుంభం రాజేందర్, తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, ఆలేటి మాణిక్యం, బొడ్డు సాయి, పిడమర్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మహిళ హత్య కేసులో నిందితులకు కఠిన శిక్షలు తప్పవు

**- ఎస్పీ నరసింహ - కోదాడ ఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ - వేగవంతమైన దర్యాప్తుకు ఆదేశాలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోదాడ, మే 7 : కోదాడ పట్టణంలో బస్టాండ్ ఎదురుగా జరిగిన మహిళ హత్య ఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ బుధవారం పరిశీలించారు. డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, పట్టణ ఇన్స్పెక్టర్ శివశంకర్, పోలీస్ అధికారులతో కలిసి సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఘటన జరిగిన ప్రాంతంలోని దుకాణదారులను ఆరా తీసిన ఎస్పీ, కేసుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుని రిమాండ్‌కు తరలించాలని అధికారులను ఆదేశించారు. కేసులో వేగవంతమైన దర్యాప్తు నిర్వహించి, సాక్ష్యాధారాలతో నేరాభియోగ పత్రాలు కోర్టులో దాఖలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ వ్యక్తిగత సమస్యలు ఉంటే పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవాలని అన్నారు. క్షణికావేశంతో నేరాలకు పాల్పడితే కఠినమైన జైలు శిక్షలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం చట్టాలు మరింత బలోపేతం అయ్యాయని, సాంకేతిక ఆధారాలతో వేగవంతమైన దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిని పోలీస్ శాఖ ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, కోదాడ పట్టణ ఇన్స్పెక్టర్ శివశంకర్, ఎస్సై సుధీర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిని కలిసిన డీసీపీఓ మహేష్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 7: కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ నూతన ఇంచార్జ్ జిల్లా సంక్షేమ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన వాసుదేవ రెడ్డి ని జిల్లా బాలల సంరక్షణ అధికారి (డీసీపీవో) బూర్ల మహేష్, సీనియర్ అసిస్టెంట్ కౌసల్య తో కలిసి మర్యాదపూర్వకంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో బాలల సంరక్షణ, బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక నిర్మూలన, చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలు, బాలల పునరావాస కార్యక్రమాలు తదితర అంశాలపై శాఖ తీసుకుంటున్న చర్యలను డీసీపీవో మహేష్ కూలంకషంగా వివరించారు. అలాగే జిల్లాలో అమలవుతున్న చైల్డ్ ప్రొటెక్షన్ కార్యక్రమాల పురోగతిని తెలియజేస్తూ, భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా సేవలు అందించేందుకు శాఖ సమన్వయంతో పనిచేస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా శాఖలో పనిచేస్తున్న సిబ్బందిని నూతన జిల్లా సంక్షేమ అధికారికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా వసుదేవ రెడ్డి శాఖ అధికారులు, సిబ్బంది సమిష్టిగా పనిచేసి జిల్లాలో మహిళా, శిశు సంక్షేమ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. బాలల రక్షణ, సంక్షేమం విషయంలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ అనంతరావు, మ్యాట్రిన్ శ్రావ్య, పి.ఓ.ఎన్.ఐ.సి శ్రావణ్ కుమార్, కౌన్సిలర్ చంద్రశేఖర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాలక్ష్యం

సంపాదకీయం

# ధాన్యం కొనుగోళ్లలో దబాయింపులు !

ఏటా దేశంలో ధాన్యం కొనుగోళ్లు అన్నది ఓ పజిల్‌గా మారింది. పెద్ద ఎత్తున ధాన్యం కొంటున్నామని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రకటిస్తుంటాయి. క్షేత్రస్థాయిలో మాత్రం అది కానరావడం లేదు. తెలుగు రాష్ట్రాలనే తీసుకుంటే ధాన్యం కొనండి అని రైతులు లబోదిబోమంటున్నారు. అయినా కొనుగోళ్లు పెద్ద ఎత్తున ఎక్కడా కానరావడం లేదు. దీనికితోడు అకాల వర్షాం రైతుల నెత్తిన పిడుగు పడేసింది. ఇటీవలి అకాల వర్షం నిండా ముంచింది. అన్నదాత రెక్కలకష్టాన్ని నీళ్లపాల్జేసింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలుప్రాంతాల్లో పడిన వర్షం దాటికి, మార్కెట్ యార్డుల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. పలు గ్రామాల్లో తీవ్రమైన గాలులతో అకాల వర్షం కురవడంతో మంథని మార్కెట్ యార్డుతోపాటు ఆయా మండలాల్లోని వ్యవసాయ ధాన్యమంతా మట్టిలో కొట్టుకు పోయింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. పదిహేను రోజుల కిందటే కోతలు కోసి, ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి కొనుగోళ్ల కోసం పడిగాపులు పడుతున్న తరుణంలో కోలుకోలేని దెబ్బతీసింది. కొనుగోళ్లు వేగంగా చేస్తే తమ ధాన్యం తడిసేది కాదని కుప్పల చుట్టూ వర్షం నీటిని చూపిస్తూ రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. తడిసి ముద్దయిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు. తడిసిన ధాన్యాన్ని మంత్‌రులు, అధికారులు పరిశీలించారు. నష్టపో యిన రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్, ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. అసలు ధాన్యమే కొనడం లేదని తెలంగాణలో బిఆర్ఎస్ ఆరోపిస్తోంది. మక్కల కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు పడుతున్నారు. కొన్నిచోట్ల రైతులు కుప్పలమీదే ప్రాణాలు వదిలిన ఘటనలు చూస్తున్నాం. తడిసిన ధాన్యాన్ని కూడా కొంటామని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. బిఆర్ఎస్ విష ప్రచారం చేస్తోందన్నారు. ఎపిలో కూడా ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతు న్నాయని మంత్రి అచ్చన్నా యుడు చెబుతున్నారు. మరి లోపం ఎక్కడో తెలియడం లేదు. కేంద్రం కూడా దేశంలో ఏయే పంటలు పండుతు న్నాయో, వాటిని ప్రజలకు చేర్చడమెలా అన్నది ఆలోచన చేయడం లేదు. పంటులు బాగానే పండుతున్నాయి. గోదాముల్లో ఫుల్లుగా ఉంటున్నాయి. రైతులకు గిట్టుబాటు కావడం లేదు. ప్రజలకు ధరలు అందుబాటులో ఉండడం లేదు. ఈ వ్యత్యాసాన్ని గుర్తించి పరిష్కరించే చిత్తశుద్ధి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల్లో కానరావడం లేదు. పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో గోధుమల సేకరణ ఎక్కువగా జరుగుతుంది. అక్కడి ధరలు ఎంఎస్‌పీకి చేరువగా ఉంటాయి. గోధుమల సేకరణ పరిమితంగా ఉండే రాష్ట్రాల్లో మాత్రం ధరలు పడిపోతుంటాయి. ఈ అసమానత రైతులు సంపాదిం చే దానికి, వినియోగ దారుడు చెల్లించే దానికి మధ్య అంతరాన్ని మరింతగా పెంచుతోంది. మార్కెట్ నియంత్రణ సంస్థలు కానీ, ప్రభుత్వం కానీ ఇదేమీ పట్టనట్లు వ్యవహరిస్తు న్నాయి. వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో ధరల పర్యవేక్షణ విభాగం ఉంటుంది. అయితే అది కేవలం సమా చారాన్ని సేకరిస్తోందా లేక అడ్డూ అదుపూ లేని ధరలను నియంత్రిస్తోందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. గోధుమల ధర తగ్గితే రైతుకు గిట్టుబాటు ధర లభించదు. వినియోగ దారుడికీ ఉపశమనం కలగదు. మరి ప్రయోజనం పొందేది ఎవరు? మధ్యలో ఉన్న కొద్ది మంది దళారులు మాత్రమే. పంజాబ్, హర్యానాల్లో గోధుమలు బాగా పండిస్తారు. గోధు మల ధర తగ్గితే సహజంగానే గోధుమ పిండి ధర కూడా తగ్గుతుంది. తద్వారా ప్రజలకు ఊరట లభిస్తుంది. కానీ మన దేశంలో అలా జరగడం లేదు. దేశవ్యాప్తంగా గోధుమల ధరలు తగ్గినప్పటికీ దాని ప్రభావం ఎక్కడా కన్పించడం లేదు. రైతులు గోధుమలను కనీస మద్దతు ధర కంటే తక్కువకే అమ్ముకోవాల్సి వస్తున్నప్పటికీ మార్కెట్‌లో గోధుమ పిండి, బ్రెడ్ ధరలు మాత్రం దిగిరావడం లేదు. వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ చెబుతున్న దాని ప్రకారం ఇటీవలి కాలంలో గోధుమల ధరలు గణనీయంగా పడిపోయాయి. ఈ నెలలో మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలోని హోల్‌సేల్ మండీల్లో కిలో గోధుమల ధర రూ.23 నుంచి రూ.25 మధ్య నడుస్తోంది. చాలా వరకూ కిలో ధర రూ.25. 85 పలికినప్పటికీ అది ఎంఎస్‌పీ కంటే తక్కువగానే ఉంది. గత సంవత్సరం నరేంద్ర మోడీ ప్రభుత్వం గోధుమల కనీస మద్దతు ధరను క్వింటాలుకు రూ.160 పెంచి రూ.2,585గా నిర్ణయించింది. 2024-25లో ఇది రూ.2,425గా ఉంది. గోధుమల ధర తగ్గినప్పుడు సహజంగానే పిండి ధర కూడా తగ్గాలి. కానీ మన దేశంలో అలా జరగడం లేదు. దేశవ్యా ప్తంగా రిటైల్ మార్కెట్‌లో కిలో గోధుమ పిండి ధర రూ.36 నుంచి రూ.40 మధ్య పలుకుతోంది. బ్రాండెడ్ ఉత్పత్తుల విషయానికి వస్తే కిలో ధర రూ.40 నుంచి రూ.50 మధ్య నడుస్తోంది. అంతకంటే ఎక్కువ వసూలు చేస్తున్న దాఖలాలు కూడా ఉన్నాయి. ఇది రైతుకు నష్టమా లేక వినియోగదారుడికి లాభమా లేక వినియోగదారుడి పేరుతో వేరెవరైనా లాభాలు గడిస్తున్నారా అన్నదే ఇక్కడ ప్రశ్న. గోధుమ పిండి ధర పెరిగిన ప్పుడు మిల్లు యజమానులు, కంపెనీలు ఆ భారాన్ని వినియో గదారుల నెత్తిన వేస్తాయి. కానీ పిండి ధర తగ్గినప్పుడు ధరలను తగ్గించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. లాభాల మార్జిన్‌ను కాపాడుకోవడానికి, వీలైతే దానిని మరింతగా పెంచుకోవడానికి వీలుగా వారు ఇలా వ్యవహరి స్తుంటారు. దేశంలో ప్రతి పంట పరిస్థితి ఇలాగే ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వరి, మక్క రైతులు నాన కష్టాలు పడుతున్నారు. దీనికంతటికి కొనుగోలు విధానాలు, మద్దతు ధరల విధానాలు సక్రమంగా లేకపోవడమే అని గుర్తించాలి. దీనిని సంస్కరిస్తే తప్ప రైతులకు, వినోగదారులకు మనశ్శాంతి ఉండదు.

# ఆపన్నులకు అండగా... రెడ్ క్రాస్ సంస్థ

## మే 8... అంతర్జాతీయ రెడ్‌క్రాస్ దినోత్సవం



రామకిష్టయ్య సంగన భట్ల
9440595494

రెడ్ క్రాస్ సంస్థ ఏర్పాటు వెనక ఒక మానవతా మూర్తి స్ఫూర్తి ఉంది. స్విస్ పౌరుడు జీన్ హెన్రీ డునాంట్ 1859 లో ఒక వ్యాపార పర్యటనలో, ఆధునిక ఇటలీలో సోల్ఫెరినో యుద్ధం పరిస్థితు లకు డునాంట్ సాక్షిగా నిలిచాడు. ఆ యుద్ధంలో 40వేల మంది మరణిం చారు, అధిక సంఖ్యాకులు గాయపడ్డా రు. గాయపడిన వారికి సాయం అంద కుండా, రక్షణ లేకుండా పోయిన హృద య విదారక దృశ్యాలు కళ్ళారా చూశా డు. తన జ్ఞాపకాలు, అనుభవాలను ఎ మెమరీ ఆఫ్ సోల్ఫెరినో పుస్తకంలో రికార్డ్ చేశాడు. ఆ సంఘటన 1863లో ఇంటర్నేషనల్ రెడ్ క్రాస్ కమిటీ (ఐసిఆర్‌సి) ఏర్పాటుకు ప్రేరణనిచ్చింది. యుద్ధాలు లేదా ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకుని వారికి ఆసరాగా నిలవడం కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన సంస్థే "రెడ్‌క్రాస్ సొసైటీ". ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సేవా సంస్థలన్నింటిలో అతి పెద్దది. అది మానవతా ఉద్యమంగా రూపు దిద్దుకుంది. అలా ప్రపంచ వ్యాప్తంగా అనేక రకాల సమస్యలతో బాధ పడుతున్న, పేదలను ఆదుకోవాలనే ఉద్దేశం ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవానికి ప్రేరణగా నిలుస్తున్నది.

అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ వ్యవస్థాపకుడు హెన్రీ డునాంట్ మే 08, 1863లో జన్మించారు. ఆయన గౌరవార్థం ఆయన జయంతి రోజున ఈ ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని జరుపు కుంటున్నారు. హెన్రీ డునాంట్ నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కూడా.

హెన్రీ డునాంట్,1859 జూన్ 24న వ్యాపారం పని మీద లావర్డి నగరానికి వెళ్ళాడు. ఆ సమయంలో ఫ్రాన్స్ ఆస్ట్రియాల మధ్యన జరుగుతున్న యుద్ధం వల్ల గాయపడిన వేలాది స్త్రీ పురుషులు ప్రథమ చికిత్స లేక మరణించడం చూశాక, హృదయ విదారకమైన దృశ్యం అయన మనస్సులో చెరగని ముద్ర వేసింది. తన స్వంత పని మరచిపోయి ఆపదలోనున్న వారందరికీ సహాయం చేశాడు.

యుద్ధం ముగిసాక ఆయన ప్రజలందరికీ ... "యుద్ధాలలో గాయపడిన వారందరికి, తక్కిన వారందరూ సహాయం చేయాలి. ఇది మానవ ధర్మం." అని విజ్ఞప్తి చేశాడు. ఆయన విజ్ఞప్తి ప్రజలందరినీ ఆకట్టుకుంది. 1864లో జెనీవాలో అంతర్జాతీయ సమావేశం జరిగింది. రెడ్ క్రాస్ సంస్థాపనకు 14 దేశాలు తమ అంగీకారాన్ని తెలిపాయి. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత 14 వ అంతర్జాతీయ సదస్సులో అంతర్జాతీయ కమిషన్ శాంతికి ప్రధాన సహకారిగా రెడ్‌క్రాస్‌ను ప్రవేశ పెట్టింది. టోక్యోలో 1934లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ట్రూస్ సూత్రాలను ఆమోదించారు. అనంతరం రెడ్ క్రాస్ ను వివిధ ప్రాంతాలలో కూడా వర్తింప జేశారు.

యుద్ధాలు లేదా ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకుని వారికి ఆసరాగా నిలవడం కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన సంస్థే రెడ్‌క్రాస్ సొసైటీ.

తొలి రోజుల్లో యుద్ధాల్లో గాయపడిన సైనికులకు సేవ చేయడానికి మాత్రమే ఇది పరిమితమై ఉండేది. ఇంచుమించు ప్రపంచంలోని అన్ని దేశాలలోను రెడ్ క్రాస్ శాఖలు, యుద్ధ సమయాలలో, శాంతి కాలం లోను నిర్విరామంగా పనిచేస్తునే ఉంటాయి. జాతి, కుల, మత విచక్షణా భేదం లేకుండా నిస్సహాయులకు ఇది సేవ చేస్తుంది. శాంతి కాలంలో రెడ్ క్రాస్ కార్య కలాపాలు...ప్రథమ చికిత్స, ప్రమాదాలు జరగకుండా చూడడం, త్రాగే నీటిని పరిశుభ్రంగా ఉంచటం, నర్సులకు శిక్షణ నివ్వడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నడపటానికి మంత్రసానులకు శిక్షణ, వైద్య శాలలను స్థాపించడం, రక్త నిధులు సేకరించడం, మొదలైన పనులు చేస్తుంటుంది.

1965 వియన్నాలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో, మానవత, నిష్పాక్షికత, సమ తౌల్యత, స్వతంత్రం, వాలంటరీ సేవ, ఐక్యత, విశ్వజనీయత...ఏడు ప్రాథమిక సూత్రాలు ఆమోదింపబడినవి. ఈ సూత్రాలను ఉద్యమం మొత్తంలో అమలు పరచాలని తీర్మానించ బడింది.1986 లో జరిగిన సదస్సులోనూ మార్పులు చేర్పులు జరిగాయి.

1876 నుండి 1878 వరకూ జరిగిన రష్యా - టర్కీ యుద్ధ సమయంలో ఉస్మానియా సామ్రాజ్యం రెడ్ క్రాస్ కు బదులుగా రెడ్ క్రెసెంట్ ఉపయోగించింది. క్రాస్ గుర్తు క్రైస్తవ మతానికి చెందినదని, దీని ఉపయోగం వలన తమ సైనికుల నైతిక బలం దెబ్బతింటుందని టర్కీ ప్రతిపాదించింది. రష్యా ఈ విషయంలో సంపూర్ణ అంగీకారాన్ని ప్రకటించింది. 1929 జెనీవాలో జరిగిన సదస్సులో 19వ అధికరణ ప్రకారం ఆమోదం పొంది, స్విడ్జర్లాండ్ దేశపు జాతీయ జెండాలోని ఎర్రని బ్యాక్‌గ్రౌండ్‌లో తెల్లని క్రాస్ ను తారుమారు చేసి తెల్లని బ్యాగ్‌డ్రాప్‌లో ఎర్రని క్రాస్‌ను లోగోగా ఏర్పరిచారు. అనేక దేశాలలో రానురాను దీని ఉపయోగం సాధారణ మయినది.

రెడ్ క్రాస్ ప్రైవేట్ సంస్థ కింద 1863 లో స్థాపించిన, అలాగే 1919 లో స్థాపింపబడిన, అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ (ఐసిఆర్‌సి), అంతర్జాతీయ రెడ్‌క్రాస్, రెడ్‌క్రెసెంట్ సంఘాల సమాఖ్య (ఐఎఫ్ఆర్‌సి), స్విట్జర్లాండ్ లోని జెనీవా నగరంలో ప్రధాన కేంద్రంగా అనుబంధ సంస్థలు పనిచేస్తున్నాయి.

హెన్రీ ద్యూనాండ్‌కు 1901లో తొలి నోబెల్ శాంతి బహుమతి




లభించింది. రెడ్‌క్రాస్ సంస్థ 1917, 44, 63 సంవత్సరాలలో మూడు సార్లు నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకుంది.

అంతర్జాతీయ రెడ్‌క్రాస్, రెడ్‌క్రెసెంట్ ఉద్యమం ఒక అంతర్జాతీయ మానవతావాద ఉద్యమం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సేవాసంస్థలన్నింటిలో రెడ్ క్రాస్ సొసైటీ అతి పెద్దది. ఈ సంస్థలో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 9.7 కోట్ల మంది సభ్యులు (కార్యకర్తలు) ఉన్నారు. మానవతా వాదాన్ని, మానవుల జీవితాలను, ఆరోగ్యాన్ని కాపాడడానికి అనునిత్యం శ్రమిస్తూ వుంటారు. జాతి, మత, కుల, వర్గ, వర్ణ, వయో భేదాలు లేకుండా సత్సంకల్పంతో పనిచేస్తూ వుంటారు. అత్యవసర పరిస్థితుల నుండి వారి ప్రాణాలను రక్షించడానికి రెడ్ క్రాస్ సంస్థలు ఎంతో కృషి చేస్తాయి. మానవతా దృష్టితో ప్రారంభమైన ఈ రెడ్‌క్రాస్ ఉద్యమంలో నేడు ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొం టున్నాయి. భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ 1920 లో స్థాపించబడి, ఢిల్లీ ప్రధానకేంద్రంగా విశేష సేవలు అందిస్తూ, ప్రజాదరణ పొందుతున్నది. ఇండియన్ రెడ్‌క్రాస్ దేశ వ్యాప్తంగా 700 కి పైగా శాఖల నెట్‌వర్క్‌ను కలిగి ఉన్న స్వచ్ఛంద మానవతా సంస్థ.

**- వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.**

# కేరళకు చేరుకున్న కాంగ్రెస్ పరిశీలకులు

## ముఖ్యమంత్రి అభ్యర్థిపై తర్జనభర్జనలు

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

తిరువనంతపురం, మే 7 : కేరళంలో ముఖ్యమంత్రి అభ్యర్థిపై అనిశ్చితి కొనసాగుతోంది. ఫలితాలు వెలువడి మూడు రోజులు గడిచినప్పటికీ.. సిఎం అభ్యర్థి ఎవరన్న అంశంపై స్పష్టత వెలువడలేదు. 140 మంది సభ్యులున్న కేరళం అసెంబ్లీలో యుడిఎఫ్ 102 స్థానాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈ కూటమిలో కాంగ్రెస్ 63 స్థానాలను గెలుచుకోగా, దాని మిత్రపక్షమైన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) 22 స్థానాల్లో విజయం సాధించింది. కేరళం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో తన మొదటి శాసనసభ పక్ష సమావేశాన్ని తిరువనంతపురంలో గురువారం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి అభ్యర్థిపై చర్చలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వి.డి. సతీసన్, కె. సురేష్, దీప్‌దాస్ మున్షీ సహా పలువురు సీనియర్ నేతలు కాంగ్రెస్ పార్టీ పరిశీలకులైన ముకుల్ వాస్నిక్, అజయ్ మాకెన్‌లను కలిసేందుకు తిరువనంతపురం లోని తాజ్ హోటల్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపి కె.సురేష్ మీడియాతో మాట్లాడారు. ఈ చర్చలు కాంగ్రెస్ హైకమాండ్ పక్రియలో ఒక భాగమని అన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం కాంగ్రెస్‌కు మెజారిటీ వచ్చినా, రాకపోయినా సిఎల్ పి నేతను ఎంపికే చేసేందుకు కాంగ్రెస్ హైకమాండ్ పరిశీలకులను పంపుతుందని అన్నారు. ఇదే పక్రియ కేరళలోనూ చేపట్టనున్నారని అన్నారు. హైకమాండ్ ఇద్దరు అత్యంత సీనియర్ నాయకులను, వర్కింగ్ కమిటీ సభ్యులను పరిశీలకులుగా నియమించిందని అ న్నారు. గతంలో కేరళ బాధ్యతలు చేపట్టిన, రాష్ట్ర రాజకీయాలపై అవగాహన ఉన్న సీనియర్ నేత ముకుల్ వాస్నిక్, ప్రస్తుతం ఏఐసీసీ కోశాధికారిగా ఉన్న అజయ్ మాకెన్లను పరిశీలకులుగా నియమించిందని అన్నారు. వారు ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి, ఎమ్మెల్యేలు, ఇతర సీనియర్ నేతలతో చర్చలు జరపనున్నారని అన్నారు. చర్చల అనంతరం హైకమాండ్‌కు ఒక నివేదికను పంపనున్నాని చెప్పారు. ఆ నివేదిక ఆధారంగా, హైకమాండ్ సీనియర్ నాయకులతో చర్చించిన తర్వాత, ముఖ్యమంత్రి అభ్యర్థిపై తగిన నిర్ణయం తీసుకుంటారని అన్నారు.

# గోధుమ ధరల పతనం - పిండి ధరలు మాత్రం పైపైకి

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, మే 7 : గోధమ ధరల పతనం రైతులను ఆందోళన కలిగిస్తోంది. మద్దతు ధరలు ఉన్నా, ఉత్పత్తి పెరిగిన కారణంగా ధరలు పడిపోతున్నాయి. దీంతో పలు రాష్ట్రాల్లో గోధులమలు పండించే రైతులు ఆందోళన చెందుతున్నారు. గోధుమల ధరలు ఎందుకు తగ్గుతున్నాయనే ప్రశ్నకు ఓ వ్యాపారి సమాధాన మిస్తూ ఉత్పత్తి పెరుగుతుందన్న అంచనాలు, సరుకు పెద్ద ఎత్తున రావడం, ప్రభుత్వం వద్ద 2.2 కోట్ల టన్నుల నిల్వలు ఉండడం కారణమని చెప్పారు. 'మండీలలో గోధుమ పిండిని తక్కువ ధరకు అమ్ముతున్నారు. అదే మాల్స్‌లో దాని ఖరీదు ఎక్కువగా ఉంటోంది. ఇది కఠోర వాస్తవం. రైతు నష్టపోతుంటే అది వినియోగదారుడికి ఆదాగా మారడం లేదు. మధ్యవర్తులు, బ్రాండెడ్ కంపెనీలు లాభపడుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ప్రముఖ బ్రాండెడ్ సంస్థలు గోధుమ పిండి మార్కెట్‌ను తమ చెప్పుచేతల్లో పెట్టుకుంటున్నాయి. బ్రాండ్ విలువ, ప్యాకేజింగ్, పంపిణీ వ్యవస్థ వంటి అంశాలు ధరను ప్రభావితం చేస్తున్నాయి. అసంఘటిత రంగంలో పిండి మిల్లులు విద్యుత్ ఛార్జీలు, కార్మికులు, రవాణా వంటి స్థిర ఖర్చులను భరించాల్సి వస్తోంది. గోధుమల ధర పెరిగినప్పుడు ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంటుంది. నిల్వలపై పరిమితులు నిర్ణయిస్తుంది. ఎగుమతులపై ఆంక్షలు విధిస్తుంది. బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తుంది. ధర ఎంఎస్‌పీ కంటే తక్కువగా ఉన్నప్పుడు సేకరణను పెంచి రైతుల ప్రయోజనాలను కాపాడాలని ప్రయత్నిస్తుంది. అయితే ఈ మద్దతు అనేది రాష్ట్రాలన్నింటిలో ఒకేలా ఉండదు. ఫలితంగా అన్నదాతలు తమ పంటను తక్కువ ధరకే తెగనమ్ముకోవాల్సి వస్తోంది. ధరలు తగ్గినా వినియోగదారునికి కలిగే ప్రయోజనం స్వల్పమే. సేకరణ బలహీనంగా ఉన్నప్పుడు రైతులు అయిన కాడికి తమ పంటను విక్రయించుకోవాల్సి వస్తోంది. అదే సమయంలో రొట్టెల తయారీకి ఉపయోగించే గోధుమ పిండి కోసం వినియోగదారులు గరిష్ట ధరలు చెల్లిస్తూనే ఉన్నారు.

# 12న అసోంలో ప్రభుత్వ ఏర్పాటు

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

గౌహతి, మే 7 : అస్సాంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎ ఘన విజయం సాధించింది. దీంతో అక్కడ వరుసగా మూడోసారి ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి రానుంది. మే 12న బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కొలువుదీరనుందని అస్సాం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి కోటా వెల్లడించారు. ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీతోపాటు, పలువురు కేంద్ర మంత్రులు, బిజెపి పాలిత ముఖ్యమంత్రలు, డిప్యూటీ సిఎంలు హాజరుకానున్నారు. గౌహతిలోని ఖానాపారాలోని వెటర్నరీ ఫీల్డ్ అంటే ప్రతిష్టాత్మక వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుందని ఆయన తెలిపారు. కాగా, సిఎంగా మూడోసారి హిమంతబిశ్వ శర్మ ప్రయాణస్వీకారం చేయనున్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు కేంద్రం నుంచి పరిశీలకుడిగా జెపి నడ్డాను బిజెపి అధిష్టానం నియమించింది. ఇప్పటికే హిమంతబిశ్వశర్మ తన సిఎం పదవికి రాజీనామా చేశారు.

# నిధులు లేని కార్పోరేషన్లకు చైర్మన్ల నియామకం

## - బలోపేతం చేయకుండా నిర్వీర్యం చేయడం తగదు: వేముల

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




నిజామాబాద్ మే 7 : సీఎం రేవంత్‌రెడ్డి కి కార్పొరేషన్ పదవులు ఇవ్వడం పై ఉన్న శ్రద్ధ నిధులు విడుదల చేయడంపై లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు, విధులు లేకుండా కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన ఘనత రేవంత్‌రెడ్డికే దకుతుందని విమర్శించారు. మాల, మాదిగ, సంతు సేవాలాల్, కుమ్రంభీం, ఏకలవ్య, మైనార్టీ కార్పొరేషన్లకు ఒక రూపాయి కేటాయించకుండా నిర్లక్ష్యం ప్రదర్శించడం, వారి పట్ల చూపుతున్న వివక్షకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముదిరాజ్, యాదవ, మున్నూరు కాపు, కుమ్మరి, విశ్వబ్రాహ్మణ, మేదర, వాల్మీకి, బోయ తదితర కార్పొరేషన్లకు కేటాయించిన నిధుల్లో ఒక రూపాయి కూడా ఖర్చు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు.కార్పొరేషన్లను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చి ఏం సాధిస్తారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సంక్షేమం కంటే అనుచరులను సంతృపిపరచడంపైనే ఎక్కువ దృష్టి పెట్టారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం 17 కార్పొరేషన్లకు చైర్‌పర్సన్లు ప్రకటించడం పట్ల తీవ్రంగా స్పందించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న 33 కార్పొరేషన్లకు నిధులు కేటాయించడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు మరికొందరికి కార్పొరేషన్ పదవులు ఇవ్వడం హాస్యాస్పదమని ఆక్షేపించారు. నిధులు విడుదల చేయకపోవడంతో, మొదటి దఫాలో నియమితులైన చైర్మన్లు ప్రజలకు ఒక రూపాయి కూడా సాయం చేయకుండా వారి పదవీకాలాన్ని ముగించారని గుర్తు చేశారు. 33 కార్పొరేషన్లకుగాను 21 కార్పొరేషన్లకు ఒక రూపాయి కూడా ఇవ్వకుండా వాటి అసలు ఉద్దేశాన్ని నీరుగార్చారని మండిపడ్డారు. ఇదే విషయాన్ని అసెంబ్లీ లో నిలదీస్తే సరైన సమాధానం లేదని పేర్కొన్నారు. కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించి చేతులు దులుపుకోవడం మానేసి, ఆయా కులాల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

# మున్నేరు పాలేరు లింక్ కెనాల్ రద్దు చేయాలి

## కొనసాగుతున్న ఆన్ లైన్ సర్వే
## సర్వేలో ఉత్సాహంగా పాల్గొంటున్న వివిధ వర్గాల ప్రజలు - ప్రముఖులు, వారి అభిప్రాయాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గార్ల, మే 07 : మున్నేరు పాలేరు లింకు కెనాల్ రద్దు కోసం నిర్వహిస్తున్న స్ట్రా పోల్ ఇంటర్నేషనల్ ఆన్ లైన్ సర్వేలో వివిధ వర్గాల ప్రజలు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సర్వేలో పాల్గొన్న వారు తమ అభిప్రాయాలను కామెంట్ల రూపంలో వెల్లడించారు. వారి అభిప్రాయాలను యధాతథంగా ప్రజాలక్ష్యం దిన పత్రిక ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడాని ప్రయత్నిస్తున్నట్లు తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రముఖ న్యాయవాది ఆన్లైన్ సర్వే నిర్వాహకులు విశ్వ జంపాల తెలిపారు. ఈ సర్వే ఏప్రిల్ 14న ప్రారంభమై, మే 15వ తారీఖున ముగుస్తుందని విశ్వ తెలిపారు.

ప్రియమైన మున్నేరు పరీవాహక ప్రాంత ప్రజలారా, గిరిజన బిడ్డలారా...! దశాబ్దాలుగా మన సాగునీటి కలలను సాకారం చేయాల్సిన పాలకులు, నేడు మన నోటి కాడి కూడును లాగేస్తూ, 'మున్నేరు పాలేరు లింక్ కెనాల్' (జీవో నంబర్ 98 తేది.17.05.2026) పేరుతో మున్నేరు నీళ్ళను పాలేరుకు తరలించడానికి ప్రయత్నిస్తూ మున్నేరు జల దోపిడీకి తెరలేపారు. మన భూములను నాశనం చేస్తూ, మన నీటిని తరలిస్తూ, రాజ్యాంగం కల్పించిన పెసా చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారు. లింక్ కెనాల్ రద్దు చేయాలి-మున్నేరు రిజర్వాయర్ నిర్మించాలి! మున్నేరు పరీవాహక ప్రాంతంలోని 60 వేల ఎకరాలకు సాగు నీరు, ప్రజలకు త్రాగు నీరు అందించాలి. ప్రజాభిప్రాయం లేని లింకు కెనాల్ నేటి పాలకుల స్వార్థానికి సాక్ష్యం! ఈ అన్యాయాన్ని ఎదిరిద్దాం.. మన హక్కులను కాపాడుకుందాం! మున్నేరు తీరాన జన హోరు జాతరై మున్నేరు పోరు కేరటమై గర్జించండీ నయవంచక పాలకులను ఎదిరించి మున్నేరును కాపాడుకుందాం! కదలండీ, కదిలించండి. నేటి పాలకుల స్వార్థానికి పుట్టిన "మున్నేరు పాలేరు లింక్ కెనాల్" రద్దు చేయాలని తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఆన్ లైన్ సర్వే నిర్వహిస్తున్నాం. మున్నేరు పరివాహక ప్రాంత ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, రైతులు, రైతు కూలీలు, విద్యావంతులు, మేధావులు, వ్యాపారస్తులు, వివిధ రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు అందరూ ఈ సర్వేలో పాల్గొని ఈ సర్వే లింక్ క్లిక్ చేసి మీ పేరు నమోదు చేసుకొని "అవును" అని పేర్కొంటూ మున్నేరు పాలేరు లింక్ కెనాల్ రద్దు చేయాలని మీ అభిప్రాయాన్ని నమోదు చేసి మున్నేరు పోరాట బిడ్డలకు అండగా నిలవాలని విజ్ఞప్తి.

**- విశ్వ జంపాల, న్యాయవాది, రాష్ట్ర ఉపాధ్యక్షులు, తెలంగాణ విద్యావంతుల వేదిక**

మున్నేరు నీటిని తరలించ వద్దు... ఈ ప్రాంతాన్ని ఎడారిగా మార్చి ఏజెన్సీ రైతన్నల పొట్ట కొట్టొద్దు. మున్నేరు పాలేరు లింకు కెనాల్ అసంబద్ధ ఉత్తర్వులు 98 తక్షణమే రద్దు చేయాలి... మున్నేరు ప్రాజెక్టు నిర్మించాలి.. అన్నదాతలకు సాగునీరు. ప్రజలకు తాగునీరు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలి. **- వజ్రం నాగేశ్వర రావు, గార్ల**

ముందుగా, గార్ల మండల రైతాంగానికి ప్రజలకు, సాగునీరు తాగునీరు, గ్యారెంటీ జీఓ తయారు చేసి మిగతా ఎగస్ట్రా నీరు మిగతా పంటలు పండే రైతాంగానికి ఇచ్చుకోండి.

**-ఈశ్వరలింగం, సామాజిక వర్కర్, గార్ల**

మున్నేరులో నిర్దిష్ట నీటి లెక్కలు గార్ల మండల ప్రజలకు వివరించి దానిలో గార్ల మండల ప్రాంతానికి నీటి వినియోగం ఏర్పాట్లు చేసిన తర్వాతికి మిగులు జలాలని తరలించవచ్చు. మున్నేరులో నికర జలాలు ఐదు టీఎంసీలకు మించి ఉండదని గతంలో లెక్కలు ఉన్నాయి. కానీ నీటి సామర్థ్యం ఎక్కువగా చూపించి 50 టీఎంసీల నీటి తరలింపు చేయటంలో ఉన్న మర్మమేమిటో గార్ల మండల ప్రజలకు వివరించగలరు. జీవో నెంబర్ 98 ని తక్షణమే రద్దు చేయవలెను.

**-శీలంశెట్టి రమేష్**

గార్ల మండలంలో ఉన్న అన్ని చెరువులను పూర్తిగా పునరుద్ధరించి, స్థిరమైన నీటి వనరులుగా అభివృద్ధి చేయాలి. ముందుగా స్థానిక చెరువులు, భూగర్భ జలాలు నింపకుండా బయటి ప్రాంతాలకు నీటిని మళ్లించడం పూర్తిగా అన్యాయం. ప్రతి చెరువుకు సరైన ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వ్యవస్థ ఏర్పాటు చేసి, రైతులకు నిరంతర సాగు నీరు అందించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. "ముందు మన చెరువులు నింపండి - తర్వాతే ఇతర ప్రాంతాలకు నీరు తరలించండి"

**-రాజేష్ గూగులోత్**

మున్నేరు లింకు కెనాల్ కాలువను గార్ల మండల ప్రజలకు ఉపయోగపడేలా చేసిన తరువాతనే పాలేరు కు తీసుకుపోవాలి. **- లక్ష్మిశెట్టి శ్రీనాథ్**

గార్ల మండలం మొత్తం 2 పంటలకు ప్రతి ఒక్క ఎకరానికి మరియు తగునీటిని అన్ని ఆవాసాలకి గురుత్వాకర్షణ (గ్రావిటీ) ద్వారా ఇచ్చి మిగులు జలాలు ఎక్కడికైనా తీసుకెళ్ళండి. జిత్తు అగర్వాల్ నీటి దోపిడి విధానం అరికడదాం. గార్ల, బయ్యారం, ఇల్లందు గోలుసు కట్టు చెరువులను కాపాడండి. **- జి.రఘుజీ**

గార్ల మండలంలో మున్నేరు సీతారామ లింక్ కెనాల్ కాలువ మన మండల ప్రజలకు దీనివలన 98 జీవో మన ప్రాంతానికి ఎడారిగా మార్చే జీవో తప్ప మన మన ప్రాంతానికి ఒక ఎకరానికి నీళు ఇవ్వని జీవో మనకెందుకు మన ప్రాంతానికి సస్యశ్యామలంగా నీళ్లందించే జీవో మనకు కావాలి దీనివలన భూమి పోయే రైతుల కంటే భూమి పోని రైతులు చాలా నష్టపోతారు ఇప్పటికే పీసా గ్రామ సభలలో ప్రజల సంతకాల సేకరణ లేకుండానే నాలుగు రెవిన్యూ పంచాయతీలు పీసా గ్రామ సభలు జరిపినట్టుగా పై అధికారులకు తీర్మాన ఇవ్వడం జరిగినది అధికారులు కావాలని వారే సంతకాలు పెట్టి గ్రామసభలు నడిచినవి అని పై అధికారులకు తెలియజేసినారు ప్రజలనే తప్పుడు సమాచారంతోనే జీవో 98 ని అమలు చేయాలని చేసే జీవోని రద్దు చేయాలని నేను సిపిఎం పార్టీ తరఫున గార్ల మండల ప్రజల తరఫున రైతుల తరఫున నేను డిమాండ్ చేస్తున్నాను జీవో నెంబర్ 98 ని రద్దు చేయాలి. - కందునూరి శ్రీనివాస రావు, సిపిఎం, గార్ల మున్నేరు పాలేరు లింకు కెనాల్ 98 జీవోని వెంటనే రద్దు చేయాలి. ఈ ప్రాంత రైతులను ఆదుకువాలి

**- యాకూబ్ పాషా, బి. శ్యామ్, ఇరుగు వెంకటేష్.**

గార్ల మండల రైతులకు ఉపయోగపడని కాలువని రద్దుచేసి చిన్న సన్నా కార రైతుల భూముల నుండి అన్యాయంగా, అక్రమంగా ఈ మున్నేరు కాలువ ద్వారా గార్ల మండలం నుండి పాలేరు చెరువుకు నీళ్లను అక్రమంగా తీసుకెళ్తున్నారు. 98 జీఓ రద్దుచేసి, ఈ కాలువ తొవ్వకుండా ఆపి సన్నకారు రైతుల భూములను కాపాడాలని ఈ ప్రభుత్వాన్ని, అధికారుల్ని వేడుకుంటున్నాను.

**- బానోత్ రమేష్.**

మున్నేరు పాలేరు లింక్ కెనాల్ ను వెంటనే రద్దు చేయాలి, ఏజెన్సీ మండలాలకు జరుగుతున్న అన్యాన్ని ఖండించాలి, సీతారాం ప్రాజెక్ట్ లో తీరనీ అన్యాయం చేశారు, మున్నేరు పాలేరు లింక్ కెనాల్ ద్వారా ఎడారి ప్రాంతం చేయాలని చూస్తున్నారు, ప్రత్యేక తెలంగాణ ఏర్పడింది, నీరు, నిధులు, నియామకాలు, ఉమ్మడి ఆంధ్రాలో అన్యాయం జరిగిందో అదే అన్యాయం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏజెన్సీ ప్రాంతాలకు ఇప్పుడు జరుగుతుంది, ఈ నీటి దోపిడిని అరికట్టాలి, మున్నేరు పాలేరు లింకు కెనాల్ రద్దు చేయాలి. **- లింగయ్య, కొంపెల్లి.**

మున్నేరు పాలేరు లింక్ కెనాల్ ను రద్దు పరచాలి ఎందుకనగా మున్నేరు పరిహక ప్రాంతం ఎడారిగా మారే అవకాశం ఉంటుంది. ఏజెన్సీ గిరిజన హక్కులను ఉల్లంఘిస్తూ పీచా చట్టాన్ని ఉల్లంఘిస్తూ షెడ్యూల్ ఏరియా అయిన గార్ల మండలంలో ఈ కాలువను తవ్వడం రాజ్యాంగ విరుద్ధం. గార్ల మండల గిరిజన రైతులను మోసం చేస్తూ అన్యాయానికి గురి చేస్తే గిరిజన బిడ్డలు తిరగబడక తప్పదు. మున్నేరు ప్రాజెక్టు నిర్మించి మున్నేరు పరివాహక మండలాలైన గార్ల బయ్యారం డోర్నకల్ కొరవి కారేపల్లి కామేపల్లి ఖమ్మం అర్బన్ రూరల్ మండలాలకు సాగు తాగునీరు గ్రావిటీ ద్వారా అందించాలి ఆ తర్వాత మిగులు జలాలు ఏమైనా ఉంటే ఎక్కడికైనా తీసుకోవచ్చు.

**- లావుడియా సిద్దు నాయక్.**

మున్నేరు పాలేరు లింక్ కెనాల్‌కు తక్షణమే కెన్సెల్ లీడ్ చేయాలి. మున్నేరు నీటిని ముందుగా






మున్నేరు రైతులకు అందజేయడం మా డిమాండ్. **- కందునూరి వెంకటేశ్వర్లు.**

మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మానుకోట జిల్లా గార్ల మండలంలోని రైతుల.. కోరిక మేరకు నిర్ణయాలు తీసుకోవాలి.. మున్నేరు లింకు కెనాల్ రద్దు చేయాలి... ఇక్కడి ప్రజలకు త్రాగునీరు, సాగునీరు చాలా అవసరం... మండలంలోని అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయం సేకరించాలి, ప్రజా ప్రతినిధులు, పెద్దలు, విద్యావంతులు, మహిళా సంఘాలు,రైతులు వారితో ప్రభుత్వం ఒక మీటింగ్ ఏర్పాటు చేయాలి.. ఇక్కడ అవసరాలను గుర్తించాలి. **- వేముల రవీందర్.**

ముందుగా గార్ల మండలనికి ఏమి చేస్తారో చెప్పండి. ఆ తదుపరి మీ ఇష్టం, ఈద్ ఏజెన్సీ మండలం. **-కె.సత్యం**

మున్నేరు కాలువ వలన గార్ల రైతన్ననికి మరియు గార్ల ప్రజలకు తీరని నష్టం జరుగుతుంది కాబట్టి మున్నేరు పాలేరు లింకు కెనాల్ తక్షణమే రద్దు చేయాలి.

**- కాముని శ్రీనివాస్**

సీతారామ ప్రాజెక్ట్-ముల్కలపల్లి రిజర్వాయర్ : ఒక ప్రాంతీయ వివక్షా పూరిత వ్యూహం. ప్రజా నిరసనల వల్ల అటకెక్కిన పాత ప్రాజెక్టులను కొత్త పేర్లతో, సరికొత్త ప్రతిపాదనలతో తెరపైకి తీసుకురావడం రాజకీయ చాణక్యమే తప్ప ప్రజా ప్రయోజనం కాదని ప్రస్తుత పరిణామాలు రుజువు చేస్తున్నాయి. సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా ముల్కలపల్లి వద్ద నిర్మించ తలపెట్టిన రిజర్వాయర్ అంశం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తోంది. పేరు మారింది... తీరు మారలేదు... గతంలో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో వీరభద్ర ప్రాజెక్టును ప్రభుత్వం రద్దు చేసింది. అయితే, ఇప్పుడు అదే లక్ష్యాన్ని మున్నేరు లింక్ కెనాల్ డైవర్షన్ పేరుతో సాధించాలని చూడటం గమనార్హం. 20 టీఎంసీల నీటిని తరలించి సీతారామలో కలపడం వెనుక ఉమ్మడి జిల్లాలోని కొన్ని ప్రాంతాలకే మేలు చేయాలనే కుట్ర దాగి ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మహబూబాబాద్‌కు మొండి చేయి...?! పాలేరుకు నీటి పండుగలిఈ కొత్త ప్రతిపాదనల వల్ల భౌగోళికంగా రిజర్వాయర్ నిర్మితమయ్యే మహబూబాబాద్ జిల్లాకు, ముఖ్యంగా నీటి ఎద్దడి ఎదుర్కొనే డోర్నకల్ నియోజక వర్గానికి ఆశించిన మేర సాగునీరు అందడం లేదు. కేవలం తాగునీటికే పరిమితం: ఈ ప్రాజెక్టు వల్ల మహబూబాబాద్ జిల్లాకు కేవలం డ్రింకింగ్ వాటర్ మాత్రమే దక్కుతుంది. మున్నేరు పరివాహక ప్రాంతంలో సేకరించిన నీటిని పాలేరు రిజర్వా యర్‌కు తరలించి, అక్కడ మూడో పంటకు నీరందించేందుకు మంత్రులు ప్రణాళి కలు సిద్ధం చేయడం విచారకరం. మెట్ట ప్రాంతాలు చుక్క నీటి కోసం అల్లాడుతుంటే, ఇప్పటికే సస్యశ్యామలంగా ఉన్న చోట మూడో పంట కోసం ఆరాటపడటం ప్రాం తీయ అసమానతలకు నిదర్శనం. ముల్కలపల్లి రిజర్వాయర్-ప్రయోజనం ఎవరికి ముల్కలపల్లి వద్ద నిర్మించే రిజర్వాయర్ వల్ల సుమారు 2,500 నుండి 3,000 ఎకరాల భూసేకరణ జరగనుంది. స్థానిక రైతులు భూములు కోల్పోతుంటే, ఆ నీటి ఫలాలు మాత్రం ఎక్కడో ఉన్న ఖమ్మం, సూర్యపేట జిల్లాలకు వెళ్లడం 'నోరున్న వాడిదే రాజ్యం' అన్నట్లుగా ఉంది. రాజకీయ పలుకుబడి ఉన్న మంత్రులు తమ జిల్లాల ప్రయోజనాల కోసమే ఈ అలైన్‌మెంట్లను మార్చారనే ఆరోపణలకు బలం చేకూరుతోంది. పర్యావరణ మరియు ఆర్థికభారం సుమారు 7,000 నుండి 8,000 కోట్ల భారీ వ్యయంతో నిర్మించే ఈ ప్రాజెక్టులో అత్యధిక భాగం భూసేకరణకే ఖర్చు వుతుంది. 190 కి.మీ. మేర ఉన్న ప్రధాన కాలువలో ఎక్కడా రిజర్వాయర్ ప్రతి పాదించకుండా, కేవలం కొన్ని ప్రాంతాల ప్రయోజనం కోసమే చివర్లో రిజర్వా యర్ నిర్మించడం వెనుక సాంకేతిక కారణాల కంటే రాజకీయ కారణాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. సమన్యాయం ఎక్కడ...? అభివృద్ధి అనేది అందరికీ సమానంగా అందాలి. ఒక ప్రాంతం భూములను బలి ఇచ్చి, మరో ప్రాంతంలో మూడో పంట పండించుకోవడం ప్రజాస్వామ్య విలువలకే విరుద్ధం. ప్రభుత్వం ఇప్పటికైనా పునరా లోచించి, కేవలం రాజకీయ ప్రాబల్యం ఉన్న జిల్లాలకే కాకుండా, డోర్నకల్, మహ బూబాబాద్ వంటి వెనుకబడిన ప్రాంతాల సాగునీటి అవసరాలను తీర్చేలా ప్రాజెక్టు రీ-డిజైనింగ్ చేయాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో జిల్లాలో ప్రాంతీయ ఉద్య మాలకు ఆజ్యం పోసే అవకాశం ఉంది. **- యాదగిరి దొంతు, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**

మున్నేరు లింకు కెనాల్ కాలువను గార్ల మండల ప్రజలకు ఉపయోగపడేలా చేసిన తరువాతనే పాలేరు కు తీసుకుపోవాలి. **- యాదగిరి యదపల్లి**

ముందుగా గార్ల మండలానికి సాగునీరు తాగునీరు ఇచ్చిన పిదప మిగతా నీరు తీసుకు వెళ్ళవచ్చు ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే ఎంపీ ఎంపీ చొరవ తీసుకొని ఈ సమస్యను పరిష్కరించేటట్లు కృషి చేయాలని గార్ల మండల ప్రజానీకానికి జీవో 98 ద్వారా నష్టం జరగకుండా చూడవలసిన బాధ్యత మొదటగా స్థానిక ఎమ్మెల్యే ఎంపీలకు ఉంటుందని కోరుకుంటున్నాను. ముందుగా గార్ల మండల మున్నేరు నీళ్లు కాబట్టి మన నీళ్లు మన నిధులు అనే దాంట్లో గార్ల మండలానికి సాగు నీరు తాగునీరు రైతాంగానికి ప్రజలకు కల్పించి, గ్యారెంటీ హామీ ఇచ్చిన పిదప మరియు భూమి సుమారు 500 ఎకరాల వరకు పోగొట్టుకునే రైతులకు ముందుగానే వాయిదాలు కాకుండా సుమారు 25 లక్షల వరకు కూడా నష్టపరిహారం ఇచ్చి ఆ తదుపరి వేరే సాగునీరు తాగు మీరు లేని ప్రాంతాలకు అవకాశం కల్పించండి. ఇది ఏజెన్సీ యొక్క ప్రాంతం కాబట్టి ప్రాంతం కాబట్టి బడుగు బలహీన వర్గాలే అధికంగా ఉంటారు కాబట్టి ఆ విధంగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి డిమాండ్. **- కవిత**

మున్నేరు కాలువ గార్ల చెరువు లోకి వచ్చేవిందంగా డిజన్ మార్పు చేయాలి మండల ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది. **- బుడిగ వెంకటేశ్వర్లు**

గార్ల డోర్నకల్ 2 మండలాలను ఎడారిగా మార్చే మున్నేరు పాలేరు లింక్ కెనాల్' జీవో నంబర్ 98 ను రద్దు చేయాలి- మున్నేరు రిజర్వాయర్ నిర్మించాలి! సాగు నీరు, ప్రజలకు త్రాగు నీరు అందించాలి. **- ఎదునూరి కుమార స్వామి**

జీఓ నం.98ను వెంటనే రద్దు చేయాలని కోరుచున్నాము. - తాళ్ళూరి పూర్ణ, దేవ్ సింగ్ జర్పుల మున్నేరు ప్రాంత ప్రజలు తమ తలాపన ఉన్న నీటిని వాడుకోవడం అనేది ఆ ప్రాంత ప్రజల జన్మ హక్కు కాబట్టి మున్నేరు పరివాహక ప్రాంతంలోని ప్రజలకు సాగునీరు లేదు గోదావరి నీళ్లు సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మా పంట భూముల్లో నుంచి పోతున్నప్పటికీ మా చెరువులకు గాని మా కుంటలకు గాని నీళ్లు ఇచ్చినటువంటి పరిస్థితి లేదు కాబట్టి మున్నేరు పరివాహక ప్రాంత ప్రజలకు మున్నేరు నీరు తప్ప మరో అవకాశం లేదు కాబట్టి మున్నేరు నీటిని మున్నేరు పరివాహక ప్రాంత ప్రజల అవసరాలకి ఉపయోగించాలని విజ్ఞప్తి చేస్తున్నాం మున్నేరు నీటిని పాలేరులో కలిపి తద్వారా మూడవ పంటకు నీళ్లు ఇవ్వాలనే ఆలోచనతో జీవో నెంబర్ 98 ని తీయడం జరిగింది దీనిని వెంటనే రద్దు చేయాలని కోరుతున్నాం. **- మేకల సుగుణారావు**

మున్నేరు మున్నేరు పాలేరు లింకు కెనాల్ జీవో నెంబర్ 98 ను రద్దు చేయాలి మున్నేరు పాలేరు లింక్ కెనాల్ కాలువ నిర్మాణాన్ని ప్రభుత్వం విరమించుకోవాలి మున్నేరు ప్రాజెక్టు ద్వారా గార్ల మండలానికి తాగునిరించి అప్పుడు మాత్రమే మిగులు జలాలు ఉం టే ఇతర ప్రాంతాలకు తీసుకుపోవాలి. **- కామేష్**

ఒకవేళ లింకు కాలువను తీసుకువెళ్లాలి అనుకుంటే మున్నేరు వాగుని బయ్యారం రిజర్వాయర్ చేసి బయ్యారం గార్ల డోర్నకల్ ఈ మూడు మండలాలకు అవుతాయి ఈ మూడు మండలాలకు కూడా రైతులు బాగుపడతారు బయ్యారం రిజర్వాయర్ చేస్తే గార్ల బయ్యారం డోర్నకల్ మండలాలకు చాలా ఉపయోగముంది రిజర్వాయర్లు అత్యధికంగా వచ్చే వాగుని వాటర్ ని తీసుకొని వెళ్ళమని చెప్పండి వద్దని మేము చెప్పట్లేము కాకపోతే ఇక్కడ రెండు పంటలకు నీళ్లు ఇచ్చాక వాళ్ళు తీసుకపోతే బాగుంటుంది డోర్నకల్ మండలంలో కూడా చాలామంది రైతులు బాగుపడతారు ఇది ఎవరిని ఉద్దేశించి పెట్టింది కాదు నేను చెప్పాలనుకున్నది ఎప్పటి నుంచో రైతులందరూ బాగుపడతారని నా ఆలోచన.

**-నంగునూరు ప్రవీణ్ కుమార్ శర్మ**

మున్నేరు పాలేరు లింక్ కెనాల్ రద్దు చేయాలని 98 జీవో రద్దు చేయాలని గార్ల మండల పరిసర ప్రాంత మండల రైతుల ప్రజల తాగు సాగు నీరు ప్రయోజనాల కోసం మున్నేరు ప్రాజెక్ట్ నిర్మించాలి ఈ ప్రాంతం సస్యశ్యామలం చేయాలని ఏదో ఒకటి కోరుతున్నాము. **- వల్లపుదాసు వెంకటేశ్వర్లు**

మున్నేరు-పాలేరు అనుసంధాన కాలువను మరియు 98వ జీ.ఓ.ను తక్షణమే రద్దు చేసి, గార్ల మండల రైతులకు నీటిని అందించాలి. **- డి. రాము**

దయచేసి మున్నేరు-పాలేరు అనుసంధాన కాలువ నిర్మాణాన్ని రద్దు చేసి, గార్ల మండలంలోని ముల్కనూర్ గ్రామం వద్ద గతంలో ప్రతిపాదించిన మున్నేరు ప్రాజెక్టును నిర్మించాలి. తద్వారా గార్ల మండల రైతులకు సాగునీరు అందించగలరు.

**- డి. రాజు**

మున్నేరు పాలేరు లింకు కెనాల్ రద్దు చేయాలి 98 జీవోను కూడా రద్దు చేయాలి మున్నేరు ప్రాజెక్టు కట్టి ఈ ప్రాంత ప్రజలకు సాగు తాగునీరు అందించాలి లేకపోతే పాలకులు తీవ్ర వ్యతిరేకతను చవిచూడాల్సి ఉంటుంది. **- గంగావతి కిషన్ నాయక్**

ఈ కెనాల్ తియ్యటం వల్ల మన ప్రాంతం, మన ఏరియా వాల్లకు నష్టం ఉండే అవకాశం ఉంది, కనుక రద్దు చేయాలి . **- బి.శ్రీను**

మునేరు-పాలేరు అనుసంధాన కాలువను తక్షణమే రద్దు చేయాలి; ప్రతిపాదిత మునేరు ప్రాజెక్టును నిర్మించి, గార్ల మండలానికి సాగునీటిని సరఫరా చేయాలి.

**- కె. రవీందర్, న్యాయవాది**

మున్నేరు నీటిని తరలించ వద్దు... ఈ ప్రాంతాన్ని ఎడారిగా మార్చి ఏజెన్సీ రైతన్నల పొట్ట కొట్టొద్దు. మున్నేరు పాలేరు లింకు కెనాల్ అసంబద్ధ ఉత్తర్వులు 98 తక్షణమే రద్దు చేయాలి... మున్నేరు ప్రాజెక్టు నిర్మించాలి.. అన్నదాతలకు సాగునీరు. ప్రజలకు తాగునీరు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలి. **-- బోయపోతుల జనార్ధన్**

స్వతంత్రం వచ్చిన కానుంచి గార్ల మండల ప్రాంతానికి నీటి సవతు లేక బయ్యారం చెరువు నిండి గార్లకు వస్తే గార్ల మండలం పంటలు పండే అవకాశం ఉంటుంది కలాపన నీళ్ళు ఉంచుకుని చాప దూపకేడిసినట్టుగా ఈ ప్రాంతం నుంచి ప్రవహించే మున్నేరు ప్రాంతాల్లో మున్నేరు ప్రాజెక్టు కట్టి ఈ ప్రాంత రైతాంగానికి గ్రావిటీ ద్వారా ఒక్క రూపాయి ఖర్చు మోటార్లకు పెట్టకుండా లిఫ్టులకు పెట్టకుండా గ్రావిటీ ద్వారా ఈ ప్రాంత రైతులకు రెండు పంటలకు పండే విధంగా నీరు లభ్యత ఉన్నా కూడా పాలకులు అధికారులు నిర్లక్ష్యంతో ఈ ప్రాంత రైతాంగం వర్షాలు పడి బయ్యారం నుండి వస్తే తప్ప పంట పండలేని పరిస్థితి కాబట్టి ఈ ప్రాంతంలో గత 60 సంవత్సరాల నుంచి మున్నేరు ప్రాజెక్టు నిర్మాణం చేయాలని ప్రభుత్వానికి విన్నవించిన ఎన్ని ప్రభుత్వాలు మారినా ఈ ప్రాంత రైతాంగం ప్రజలకు అన్యాయం చేసుకుంటూనే వస్తున్నాయి కిన్నెర ప్రాజెక్టు కట్టడం వల్ల ఈ గార్ల మండలం తో పాటు మరికొన్ని ప్రాంతాలు మండలాలు కూడా తాగునీరుకు సాగునీరుకు ఇబ్బంది లేకుండా ఉంటదని గత 60 సంవత్సరాల నుంచి ప్రజలు కోరుతున్నారు ఇప్పటికైనా ఈ ప్రభుత్వం స్పందించి గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఇచ్చిన 1076 జీవో ప్రకారం మున్నేరు ప్రాజెక్టు నిర్మాణం చేసి ఈ ప్రాంత రైతాంగానికి తాగునీరు సాగునీరు అందించాలని కోరుతున్నాం ఈ ప్రాంత రైతాంగానికి ప్రజలకు అన్యాయం చేసి ఎక్కడో ఉన్న పాలేరుకు నీళ్లు తీసుకుపోవాలని చూస్తున్న జీవో నెంబర్ 98ను తక్షణమే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం

**- మురళీ తారక రామారావు గిన్నారపు**

**(సర్వే ముగింపు 15 తర్వాత 16వ తేది సంచికలో మళ్లీ కలుద్దాం...)**

## షేక్ జమాల్ కుటుంబానికి న్యాయం చేయాలి

**- ఎన్‌హెచ్‌ఎం-జేఏసీ మహబూబాబాద్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, మే 07: ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగి షేక్ జమాల్ కుటుంబాన్ని ఆదుకోవాలని జిల్లా ఎన్‌హెచ్‌ఎం-జేఏసీ నాయకులు అన్నారు. జీతాలు సమయానికి రాక మిత్తికి తెచ్చిన అప్పు కట్టలేక, తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారాన్ని మోయలేక మనస్థాపానికి గురైన షేక్ జమాల్ గత నెల మార్చి నెలలో డోర్నకల్ పీహెచ్సిలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దుంగ్రోతు కుమార్ నాయక్ ఆధ్వర్యంలో షేక్ జమాల్ భార్య షేక్ సుల్తానా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనిల్ కుమార్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్‌ని కలిసి వినతిపత్రన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ డా.కందుల నాగరాజు, ఉపాధ్యక్షురాలు దార్ల జ్యోతి, ఆర్గనైజింగ్ జాయింట్ సెక్రటరీ మంద సువర్ణ, కన్వీనర్ నీలమ్మ, హరిత, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

## జూదంపై టాస్క్‌ఫోర్స్, పోలీసుల సంయుక్త దాడి

**- ఇద్దరు అరెస్ట్.. నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం**
**- మెదక్ ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, మే 07 : పావన్నపేట మండల పరిధిలోని అన్నారం గ్రామ శివారులోని ప్రకృతి వనం వెనుక పేకాట ఆడుతున్న వారిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. ఈసందర్భంగా ఇద్దరిని అదుపులోకి తీసుకుని నగదు, సెల్‌ఫోన్లు,పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అరెస్టైన వారిలో దర్శనం రాజు (32), దర్శనం వినోద్‌కుమార్ (29)లు ఉన్నట్లు తెలిపారు.వారి వద్ద నుంచి రూ.8,500 నగదు,రెండు సెల్‌ఫోన్లు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. జిల్లాలో జూదం,ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని ఎస్పీ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు,స్థానిక పోలీసులు సమన్వయంతో నిరంతరం దాడులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ప్రజలు తమ పరిసరాల్లో జరిగే అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరారు.



## పెబ్బేరు అయ్యప్ప భజన బృందానికి ఘన సన్మానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెబ్బేరు, మే 7 : జడ్చర్ల మండలం పెద్ద ఆదిరాల అయ్యప్ప స్వామి దేవాలయంలో నెల పూజా కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన భజనల్లో ప్రత్యేకంగా అలరించిన పెబ్బేరు అయ్యప్ప స్వామి భజన బృందాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అయ్యప్పస్వామి ప్రతిష్ట మహోత్సవం విజయవంతంగా పూర్తయిన అనంతరం ఆలయ ప్రాంగణంలో నెల పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు పెబ్బేరు భజన బృందం ఆలపించిన అయ్యప్ప భక్తి గీతాలు, నామసంకీర్తనలు భక్తులను ఆధ్యాత్మిక పరవశ్యంలో ముంచెత్తాయి.స్వామియే శరణం అయ్యప్ప నినాదా లతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.కార్యక్రమానికి అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి వ్యవస్థాపకులు రాజ్ దేశ్ పాండే గురుస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం పెద్ద ఆదిరాల అయ్యప్ప దేవాలయ కమిటీ సభ్యులు పెబ్బేరు భజన బృంద సభ్యులను శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెబ్బేరు భజన బృంద సభ్యులు, అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వీయ గణనకు మరో 3 రోజులే గడువు

**- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**
**- మే 10లోపు జనగణన వివరాలు**
**- నమోదు చేసుకోవాలని ప్రజలకు సూచన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సూర్యాపేట, మే 7 : స్వీయ గణన ప్రక్రియలో భాగంగా వివరాలు నమోదు చేసుకోవడానికి మరో మూడు రోజులే గడువు ఉందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. మే 10లోపు ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, యువత, మహిళా సంఘాలు, ఐటీ నిపుణులు సహా అన్ని వర్గాల ప్రజలు స్వీయ గణనలో పాల్గొనాలని సూచించారు. ఇంకా నమోదు చేసుకోని వారు వెంటనే తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని తెలిపారు. జనగణన మొదటి దశలో భాగంగా 'గృహ లెక్కింపు మరియు గృహ పరిస్థితుల లెక్కింపు' కోసం ప్రజలు స్వయంగా తమ వివరాలు నమోదు చేసుకునే అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పించినట్లు వివరించారు. జిల్లా ప్రజలు తమ ఇంటి, కుటుంబ వివరాలను అధికారిక వెబ్‌పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. మొబైల్ ఫోన్, కంప్యూటర్ లేదా ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న ఏ పరికరం ద్వారానైనా ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు.

# కుట్టుమిషన్ శిక్షణ శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, మే 7: కుట్టుమిషన్ శిక్షణ శిబిరాలను మహిళలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లాలోని రెబ్బెన మండలకేంద్రంలో మహిళా సాధికారత సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కుట్టు మిషన్ ఉచిత శిక్షణ శిబిరాన్ని జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కామ్డే అనిల్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుట్టుమిషన్ శిక్షణ ద్వారా మహిళలు జీవనోపాధిని పొందవచ్చని తెలిపారు. ప్రస్తుత సమాజంలో మహిళలు వస్త్రధారణ పై ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నందున, తదనగుణంగా ఎంబ్రాయిడరీ డిమాండ్ ఉన్నందున మహిళలు కుట్టుమిషన్ శిక్షణ తీసుకోవడం ద్వారా జీవనోపాధి పొందవచ్చని తెలిపారు. కుట్టుమిషన్ల శిక్షణను ఏకాగ్రతతో నేర్చుకోవాలని, శిక్షణలో అందిస్తున్న అంశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మహిళలకు శిక్షణ అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందని, శిక్షణ పొందిన మహిళలు నలుగురికి ఉపాధి కల్పించాలని తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికార దాసోసైటీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కుసుమ విజయ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, మే 07 : గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవల నిర్వహణలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ లో నిర్లక్ష్యం జరిగినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆసుపత్రిలో విధులు సక్రమంగా నిర్వహించని స్థానిక వైద్యులు,సంబంధిత సిబ్బందికి గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, విధుల పట్ల నిర్లక్ష్యం ఏ స్థాయిలోనైనా సహించబోమని డీఎంహెచ్ఓ స్పష్టం చేశారు.ఆసుపత్రులలో సమయపాలన, రోగులకు మర్యాదపూర్వక సేవలు, మందుల లభ్యత,పరిశుభ్రత వంటి అంశాలలో ఎటువంటి అలసత్వం ఉండరాదని సూచించారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని హెచ్చరించారు. విధి నిర్వహణలో అలక్ష్యం చేసిన సిబ్బందిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తుందని డాక్టర్ రవి రాథోడ్ తెలిపారు.

## అటవీ ప్రాంతంలో కరెంటు తీగలు వేస్తే కఠిన చర్యలు తప్పవు : రేంజ్ అధికారి స్వాతి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాటారం, మే 07 : కాటారం మండలంలో అటవీ ప్రాంతంలో కరెంటు తీగలు వేస్తే కఠిన చర్యలు తప్పవని ఫారెస్ట్ రేంజ్ అధికారి స్వాతి అన్నారు. ఆమె సిబ్బందితో కలిసి కాటారం, చిదినేపల్లి, ప్రతాపగిరి, గ్రామాలలో వన్య ప్రాణుల సంరక్షణలో భాగంగా కరెంటు తీగలు, ఉచ్చులు వేయకుండా ఉండాలని, ఒకవేళ ఎవరైనా కరెంటు తీగలు ఉచ్చులు వేస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. అదేవిధంగా తునికి (బీడీ) సేకరణ గురించి, అడవిలో అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు, అడవులను నరకకుండా వుండేందుకు అవగాహన కల్పించారు. అలాగే ఈ విషయాల పట్ల ప్రజలందరికీ బాధ్యత ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాటారం సెక్షన్ డిఆర్ఓ హెచ్.సురేందర్, యామన్‌పల్లి సెక్షన్ డిఆర్ఓ జె.శ్రీనివాస్, దామరకుంట సెక్షన్ ఎఫ్ఎస్ఓ పి.చంద్రశేఖర్, చింతకాని సెక్షన్ ఎఫ్ఎస్ఓ ఇ.అర్చన, కాటారం రేంజ్ అటవీ బీట్ అధికారులు, రాజేందర్, జయలక్ష్మి, రాజ్‌కుమార్, అశోక్, మొయినుద్దీన్, బి.హరీష, మోనా కౌసర్, ప్రతాప గిరి సర్పంచ్ వూర వెంకటేశ్వర రావు, చిదినేపల్లి సర్పంచ్ బాల్నే జగదీశ్వర్ రెడ్డితో పాటు బేస్ క్యాంప్ సిబ్బంది మల్లేష్, కాటారం రేంజ్ జీపు డ్రైవర్ మహమూద్, పలు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పోషణ్ పక్వాడలో అభివృద్ధి మైలురాళ్ళపై అవగాహన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, మే 07 : ఐసిడిఎస్ జగిత్యాల ప్రాజెక్టులోనీ మేడిపల్లి సెక్టార్, మేడిపల్లి గ్రామంలోనీ రైతు వేదికలో గురువారం సర్పంచ్ అధ్యక్షతన, సిడిపిఓ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాల పరిధిలో 08,వ పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మమత మేడం మాట్లాడుతూ..2018 లో కేంద్ర ప్రభుత్వం లాంచ్ చేసిన ఈ పోషణ పక్వాడ ప్రోగ్రాం భారతదేశ జనాభా ఆరోగ్యమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. పిల్లల అభివృద్ధి మైలురాళ్ళు (పుట్టిన గంటలోపు పాలు పట్టించుట నుండి తనకుతాను స్వంతంగా నడిచే వరకు, ప్రతి కదలికలు గమనించడమే ఉద్దేశ్యం.) అని అన్నారు. విహెచ్ ఎస్ఎన్డిలో పిల్లలు బరువులు ఎత్తులు చూసి లోప పోషణ, అతి తీవ్ర లోప పోషణ గురించి తెలపడం జరిగిందన్నారు. మొదటి 1,000 రోజులు (గర్భధారణ నుండి 02 సంవత్సరాలు) పిల్లల ఆరోగ్యం, మెదడు ఎదుగుదలకు చాలా కీలకం. పోషకాహార అలవాట్లలో మార్పు తీసుకురావడానికి సమతుల్య ఆహారం తీసుకోవడం ముఖ్యమని తెలిపారు. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ..ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. వార్డు మెంబర్స్ మాట్లాడుతూ పోషకాహారం తోనే దేశ ఆరోగ్యం అన్నారు. తరువాత శ్రీమంతం, అన్న ప్రసన్న చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మకిలి దాసు, ఏంఆర్ఓ మునీందర్, ఆర్ఐ ప్రవీణ్, ఐసిడిఎస్ సిడిపిఓ మమత మేడం, వార్డు మెంబర్స్, ఐకెపి సిసి శ్రీనివాస్, విఓఏ భార్గవి, గ్రామైక్య సంగ అధ్యక్షురాలు, కార్యదర్శి,కోశాధికారి, సూపర్వైజర్స్ షైనీమాథ్యూ, భాగ్యలక్ష్మి, అంగన్వాడీ టీచర్స్ ధన లక్ష్మి, శారద, నర్మద, స్వప్న, గీతారాణి, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయిలో మూడవ ర్యాంకు సాధించడం అభినందనీయం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, మే 7: శ్రీ సరస్వతి శిశు మందిర్ (ఆసిఫాబాద్) పూర్వ విద్యార్థిని, భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకుడు కాంద్రే విశాల్, దుర్గ కుమార్తె కాంద్రే కనిష్క కుమారి సాధించిన విజయం నిజంగా అభినందనీయం అని పలువురు అభిప్రాయపడ్డారు.పదో తరగతి ఫలితాల్లో జిల్లా స్థాయిలో మూడవ ర్యాంకు (టాప్-3) సాధించి, తన ప్రతిభతో పాఠశాలకు తల్లిదండ్రులకు ఎంతో గౌరవాన్ని తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కనిష్క కుమారిని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల ప్రబంధకారిణి అధ్యక్షులు చిలువేరు వెంకన్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సంచాలిత అధ్యక్షులు బోనగిరి సతీష్ బాబు, ఉపాధ్యక్షులు వేణుగోపాల్ , జాయింట్ సెక్రటరీ సంతోష్ , అభినందనలతో పాటు శాలువాతో సత్కరించి మిఠాయిలు తినిపించారు. అదేవిధంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కనిష్క కుమారిని శాలువాతో ఘనంగా సన్మానించి, స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నాంపల్లి శంకర్, లయన్స్ డిస్ట్రిక్ట్ డైరెక్టర్ ఉబెడ్ బిన్ యహ్యా, తారీక్, కోశాధికారి పుల్లూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు. హిందూ సమాజ్ బ్రాహ్మణవాడ ఆధ్వర్యంలో కూడా కనిష్క కుమారిని శాలువాతో సత్కరించి, మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ సమాజ్ బ్రాహ్మణవాడ కోశాధికారి ప్రదీప్ దేశ్ముఖ్ , ముఖ్య సలహాదారు వారణాసి శ్రీనివాస్ , యూత్ అధ్యక్షుడు ప్రవీణ్ దేశ్ముఖ్, సెక్రటరీ కన్నెపల్లి సురేష్, జాయింట్ సెక్రటరీ ప్రవీణ్ కుమార్, మహేష్ సాయి తదితరులు పాల్గొన్నారు. హిందూ సంఘ సభ్యులు కూడా కనిష్క కుమారిని ఘనంగా శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరాగడే సాయి, రాపర్తి నరేష్, రాపర్తి నవీన్, సదుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. భవిష్యత్తులో కనిష్క కుమారి మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, ఈ అద్భుతమైన విజయాన్ని సాధించిన ఆమెకు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఒలింపియాడ్ విజేత, టెన్త్ టాపర్లకు మణుగూరు జీఎం అభినందనలు

**ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని విద్యార్థులకు దిశానిర్దేశం**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, మే 7 : మణుగూరు పీవీ కాలనీలోని సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థులు సాధించిన అద్భుత విజయాలపై సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం తన కార్యాలయంలో జాతీయ స్థాయి సైన్స్ ఒలింపియాడ్ విజేతతో పాటు పదవ తరగతి టాపర్లను ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల జరిగిన జాతీయ స్థాయి సైన్స్ ఒలింపియాడ్‌లో సింగరేణి పాఠశాల తరఫున పాల్గొని ప్రథమ స్థానం సాధించి గోల్డ్ మెడల్, ల్యాప్‌టాప్ గెలుచుకున్న కేతన్ శశి సహదేవ్ కుమార్‌ను జీఎం అభినందించారు. అలాగే, ఈ విద్యా సంవత్సరం పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో సింగరేణి పాఠశాల 98 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల టాపర్లుగా నిలిచిన ఎస్. హంసనందిని (547 మార్కులు), జి. సంకీర్తన (545 మార్కులు), కె. శ్రీకృష్ణ కౌశిక్ (543 మార్కులు)తో పాటు 500కు పైగా మార్కులు సాధించిన ఇతర విద్యార్థులను ప్రశంసించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలంటే స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, పక్కా ప్రణాళికతో కృషి చేయాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ సింగరేణి సంస్థకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులను కూడా ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేష్, సింగరేణి హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఆర్. కల్యాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## మేడిపల్లి రైతు వేదికలో ఘనంగా రైతు వారోత్సవాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 07 : ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా 04 మే నుండి 09 మే వరకు జరుగుతున్న రైతు వారంలో భాగంగా గురువారం విద్యుత్ శాఖ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మేడిపల్లి రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్న వివిధ రకాల పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏడి రఘుపతి, ఏఈ అర్జున్ రైతులను కోరారు. రైతులు కేజీ వీల్స్ వాడి తమ పంటలను, రోడ్లను నష్టపరుచుకోవద్దని మేడిపల్లి ఎస్సై తెలిపారు. మార్కెట్ లో ఎక్కువ డిమాండ్ లో ఉన్న సన్న వడ్లను పండించి రైతులు అధిక దిగుబడి, క్వింటాలుకు 500 రూపాయలు బోనస్ పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి ఎండి షాహిద్ అలీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి మండల వివిధ గ్రామాల సర్పంచ్లు, ఉప సర్పంచ్ లు, ఏఈవోలు, విద్యుత్ శాఖ సిబ్బంది, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.




## వ్యవసాయంలో టెక్నాలజీ ఉపయోగించుకోవాలి

**జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 07 : వ్యవసాయంలో నూతన టెక్నాలజీని అంది పుచ్చుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ రైతులకు సూచించారు. గురువారం మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతన శెట్టిపల్లిలో జరిగిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రైతు వరము సమావేశంలో ముఖ్య అతి థిగా పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. మన దేశం వ్యవసాయ ఆధారిత దేశమని,రైతులు వ్యవసాయంలో నూతన టెక్నాలజీని అంది పుచ్చుకోవాలని పిలుని చ్చారు. నూతన వంగడాలు, పనిముట్లు,యంత్రాలను ఉపయోగించి పంటల ఉత్పత్తి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, స్థానిక తహసిల్దార్, అధికారులు పాల్గొన్నారు.



## దగ్ధమైన ఈత వనాన్ని పరిశీలించిన ప్రభుత్వ విప్ ఆది

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 07 : ఇటీవల జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం అంబర్ పేట గ్రామంలో ప్రమాదవశాత్తు తాటి చెట్లు, ఈత చెట్లు నిప్పు అంటుకొని దగ్ధం కాగా, గురువారం రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా గౌడ సంఘ సభ్యులను ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలో జరగడం బాధాకరమని విచారణ వ్యక్తం చేశారు. వెంటనే బోర్ మోటర్, పైపు లైన్ శాంక్షన్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సిద్ధార్థ హై స్కూల్ విద్యార్థుల జాతీయ స్థాయి క్రీడా కీర్తి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల ప్రతినిధి, మే 07 : భీమారం మండల కేంద్రంలోని సిద్ధార్థ హై స్కూల్ విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను జాతీయ స్థాయిలో నిరూపించారు. ఇటీవల జరిగిన 04,వ సబ్ జూనియర్ నేషనల్ సెప్టో బాల్ టోర్నమెంట్ లో సిద్ధార్థ హై స్కూల్ విద్యార్థులు హన్సిక, ఎగుర్ల చాణిక్య అద్భుత ఆట తీరు ప్రదర్శించి, పోటీలోని కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ కాంస్య పతకం (బ్రాంజ్ మెడల్) సాధించడం విశేషం.ఈ విజయం వారిలో ఉన్న పట్టుదల, కష్టపడే తత్వం, ధైర్యం మరియు జట్టు స్ఫూర్తికి ప్రతిబింబం సిద్ధార్థ హై స్కూల్ లో అందిస్తున్న సమగ్ర శిక్షణ, క్రీడలకు ఇచ్చే ప్రాధాన్యతకు నిదర్శనం. విద్యార్థులు తమ ప్రతిభతో ప్రత్యర్థి జట్లను ధైర్యంగా ఎదుర్కొని, చివరి వరకు పోరాడుతూ ఈ విజయాన్ని సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ, మన విద్యార్థులు కేవలం చదువులోనే కాదు, క్రీడలలో కూడా అగ్రగాములు కావాలని, మేము ఎప్పుడూ ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ విజయం పాఠశాల విలువలను మరింత ఎత్తుకు తీసుకెళ్లిందని, ఈ విజయానికి మార్గదర్శకత్వం వహించిన వ్యాయామ ఉపాధ్యాయుడు సాయినాథ్, ఉపాధ్యాయులకు, నిరంతరం ప్రోత్సహించిన తల్లిదండ్రులకు పాఠశాల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హన్సిక, చాణిక్యకు అభినందనలు తెలుపుతూ వారి ఈ విజయం భవిష్యత్తులో మరెన్నో ఉన్నత విజయాలకు తొలి మెట్టు కావాలని ఆకాంక్షించారు.





# హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది

**- కాంగ్రెస్ పాలనపై హరీష్‌రావు తీవ్ర విమర్శలు**

**- కోదాడలో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోదాడ, మే 7 : కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి. హరీష్ రావు ఆరోపించారు. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో టి.హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

రెండు లక్షల ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు నెలకు రూ.2500 వంటి హామీలను అమలు చేయకుండా నిరుద్యోగులు, విద్యార్థులు, మహిళలు, రిటైర్డ్ ఉద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. ముస్లిం మైనారిటీలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో అమలులో ఉన్న పథకాలను కూడా ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాటలు మాత్రమే ఎక్కువగా ఉన్నాయని, చేతల్లో మాత్రం ఫలితం కనిపించడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు సక్రమంగా విడుదల కావడం లేదని, కార్పొరేషన్ల ద్వారా లబ్ధిదారులకు ప్రయోజనాలు అందడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి సాగునీరు అందించామని, ఎస్సారెస్పీ ఫేజ్-2 పూర్తి చేసి రైతులకు మేలు చేశామని గుర్తు చేశారు. గతంలో మంత్రి అయిన ఉత్తమ్ కుమార్ రెడ్డి కోదాడకు గోదావరి జలాలు తీసుకురాలేదని అన్నారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఎన్నికల్లో ఓడిపోయినా ప్రజల్లోనే ఉంటున్నారని, ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే మాత్రం ప్రజలకు దూరంగా ఉన్నారని విమర్శించారు. రైతులు ఎరువులు, కరెంటు, సాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వడ్ల కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కరోనా సమయంలో కూడా కేసీఆర్ రైతుబంధు నిలిపివేయలేదని, రైతుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రైతులకు అండగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుంది

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్ - భూపాలపల్లి, మే 7 : రైతులకు అండగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులతో పాటు స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ రైతును రాజును చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అందుకోసమే రైతులకు రుణమాఫీ చేశామని, రైతులు పండించిన పంటలకు మద్దతు ధరతో పాటు సన్న ధాన్యానికి బోనస్ కూడా అందిస్తున్నామని, ఉచిత విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ విషయాలు తెలిసినా తెలియనట్టుగా ప్రతిపక్ష పార్టీల నాయకులు మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు. గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రైతులను పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే బి.ఆర్.ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా జిల్లాల కలెక్టర్లు, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రవెల్లి స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

# మతసామరస్యంతో బక్రీద్ నిర్వహించాలి

**- ఖురేషి కులస్తులు, హిందూ సంఘాలతో సమావేశం - మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు**






(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే 07 : మెదక్ జిల్లాలో బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో మతసామరస్యాన్ని కాపాడేలా నిర్వహించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు సూచించారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఖురేషి కులస్తులు, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, ఆర్ఎస్ఎస్, హిందూ వాహిని, శ్రీరామ్ సేన, హిందూ యువవాహిని సభ్యులతో వేర్వేరుగా అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సరైన అధికారిక అనుమతులు, పత్రాలు ఉన్న పశువులను మాత్రమే సంహరించాలని ఖురేషి కులస్తులకు సూచించారు. ఆవులను ఎట్టి పరిస్థితుల్లోనూ సంహరించవద్దని స్పష్టం చేశారు. పశువుల కొనుగోలు సమయంలో సంబంధిత పత్రాలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. మాంసం నిల్వ చేసే ప్రదేశాల్లో పరిశుభ్రత పాటించాలని, పక్షులు, కుక్కలు, కోతుల వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆవులు, దూడల అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం, వ్యక్తులపై దాడులకు పాల్పడడం నేరమని హెచ్చరించారు. అక్రమంగా పశువులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి రాత్రింబవళ్లు వాహనాల తనిఖీలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ అనుమానాస్పద వాహనాలపై నిఘా ఉంచుతున్నామని చెప్పారు. పశువుల అక్రమ రవాణా శిక్షార్హమైన నేరమని, మూగజీవాలపై క్రూరత్వానికి దారితీస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పశువుల రవాణా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెల్టీ టు యానిమల్స్ యాక్ట్, కౌస్లాటర్ యాక్ట్, భారతీయ న్యాయ సంహిత చట్టాల కింద కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. గోరక్షణ పేరుతో దాడులు, వాహనాల ధ్వంసం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, వాస్తవాలు నిర్ధారించకుండా వాటిని షేర్ చేయవద్దని ప్రజలకు సూచించారు. పశువుల అక్రమ రవాణాపై సమాచారం తెలిసిన వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మెదక్ డియస్పి ప్రసన్న కుమార్, సీఐ లు జార్జ్, సందీప్ రెడ్డి, వెటర్నరీ డాక్టర్ లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది, మత పెద్దలు, పాల్గొన్నారు.

# ప్రైవేట్ జూనియర్ కళాశాలల నుండి దరఖాస్తులు ఆహ్వానం

**- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు కార్పొరేట్ కాలేజీలలో అడ్మిషన్లు**

**- అత్యుత్తమ జూనియర్ కళాశాలల ఎంపికకు ఆన్ లైన్‌లో ధరఖాస్తులు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, మే 07 : 2026-27 సంవత్సరమునకు కార్పొరేట్ కళశాలల ప్రవేశ పథకములో భాగంగా ఉత్తమ కళాశాలలను ఎంపిక చేయడానికి, జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల నుండి దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుచున్నదని జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలోతెలిపారు. ఎంపిక చేసిన కళాశాలలకు విద్యార్థులను (విద్యార్థుల ఆప్షన్ ప్రకారము) ప్రతి సంవత్సరము కేటయించబడునని ఇందుకుగాను కార్పొరేట్ కళాశాలల పథకములలోని విద్యార్థులను ఫీజు, బుక్స్, హాస్టల్ వసతి, భోజన వసతి గాను, ఇతర అవసరములకు ప్రతి విద్యార్థికి రూ. 35,000/- చొప్పున చెల్లింపబడునని అన్నారు. పాకెట్ మనీ ప్రతి విద్యార్థికి రూ.3000/- చొప్పున చెల్లిస్తరని లా, ఎంసెట్ కోచింగ్ ఫ్రీగా అన్నారు. ప్రవేశాలకు దరఖాస్తు చేసే కళాశాలలకు ఈ క్రింది సౌకర్యాలు తప్పని సరిగా ఉండవలని, అన్ని ప్రాథమిక సౌకర్యాలతో కూడిన మంచి, సరిపడా నివాస వసతి. కళాశాల భవనం నిర్మాణపరంగా పటిష్టంగా ఉండాలన్నారు. అగ్నిమాపక భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. తరగతి గదులు, వసతి గృహం, హాస్టళ్లు, ఇండోర్, అవుట్‌డోర్ కార్యకలాపాలకు తగినన్ని మౌలిక సదుపాయాలు. గత కొన్నేళ్లుగా కనీసం 50% మార్కులతో ఫస్ట్ క్లాస్, డిస్టింక్షన్లు సాధించి, 90% కంటే ఎక్కువ ఉత్తీర్ణతతో నిలకడైన అకడమిక్ ట్రాక్ రికార్డ్ ఉండాలి . ఐఐటి, జెఇఇ, ఎఐఇఇఇ, ఎమ్‌సెట్ వంటి ప్రవేశ పరీక్షలలో నిలకడగా అధిక విజయ శాతం. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, సుసజ్జితమైన ల్యాబ్ మరియు లైబ్రరీ, అధ్యాపకుల సివిలను కమిటీ పరిశీలిస్తుందన్నారు. గుర్తించిన కళాశాలలు ఒకే జిల్లాలో ఉండవలసిన అవసరం లేదని ఈ పథకం కింద కళాశాల కొనసాగింపు అనేది విద్యార్థులు సాధించే ఫలితాలు, వారి నుండి వచ్చే ఫీడ్‌బ్యాక్‌పై కూడా ఆధారపడి ఉంటుందన్నారు. కళాశాలల దరఖాస్తులను epass.telangana.gov.in వెబ్ సైట్ అప్లయ్ చేసుకొనుటకు చివరి తేది: 11.05.2026 అని అధికారి పేర్కొన్నారు.

# నేల ఆరోగ్యంగా ఉంటేనే అధిక దిగుబడులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




రామగుండం, మే 7 : నేల ఆరోగ్యంగా ఉంటేనే పంటల అధిక దిగుబడులు వస్తాయని అందుకే రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలని పాలకుర్తి సర్పంచ్ పెద్దపల్లి తిరుమల కోరారు. గురువారం పాలకుర్తి మండలం పాలకుర్తి రైతు వేదికలో రాష్ట్ర ప్రభుత్వ "ప్రజా పాలన-ప్రగతిలో నిర్వహిస్తున్న రైతు వారం వ్యవసాయ వారోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూసార పరీక్షలతో భూమిలో ఉన్న పోషకాల లోపాలను గుర్తించి సమగ్ర పోషక యజమాన్యం పాటించవచ్చని సర్పంచ్ తిరుమల అన్నారు. అనంతరం మట్టి నమూనాలు సేకరించే విధానాన్ని క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మకంగా చూపించారు. గత నెల మట్టి నమూనాల ఫలితాల హెల్త్ కార్డులను రైతులకు అందించారు. ఈ సభకు హాజరైన ఏఈ (ఎలక్ట్రికల్) మానాల ప్రసాద్ మాట్లాడుతూ రైతులకు పగటిపూట నాణ్యమైన కరెంటు అందించేందుకు డిజిల్ పంపుల స్థానంలో సోలార్ పంపులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పీఎం కుసుమ పథకంలోని కాంపోనెంట్-బి కింద7.5 హెచ్‌పి వరకు సోలార్ పంపుకు 60శాతం సబ్సిడీ 30% కేంద్రం 30% రాష్ట్ర ప్రభుత్వాలు బరిస్తాయని ఏఈ మానాల ప్రసాద్ వివరించారు రైతు వాటా కేవలం 40 శాతం మాత్రమే నని అన్నారు కాంపోనెంట్-ఏ కింద 10 భూముల్లో 2 ఎం డబ్ల్యూ కొరకు సోలార్ ప్లాంట్ పెట్టి గ్రిడ్‌కు కరెంటు అమ్మి ఆదాయం పొందవచ్చని అన్నారు. మండల వ్యవసాయ అధికారి బండిప్రమోద్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ విద్యాలయం వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన సంఘటన రైతులు సాగు చేయాలని కోరారు. వాటికి ప్రభుత్వం క్వింటాలుకు 500 రూపాయల బోనస్‌తో పాటు మద్దతు ధర సకాలంలో అందిస్తుందని ప్రమోద్ కుమార్ స్పష్టం. చేశారు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ ధృవీకృత విత్తనాలనే కొనుగోలు చేయాలని ఆయన రైతులకు సూచించారు. ఈ సభలో ఏఈవోలు ఎం యోజన బి శశిధర్ ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ ఆఫీసర్ టి.ప్రశాంత్‌తో పాటు రైతులు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.




# అల్లూరి స్ఫూర్తితో మోడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, మే 7 : దేశ స్వాతంత్రం కోసం ఆనాడు అల్లూరి పోరాడి తెల్ల దొరల మెడల్ వంచి అసువులు బాసిన అతని ఆశయాల సాధనలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక మతోన్మాద ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాటమే అల్లూరికి మనమిచ్చే నివాళులు అని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు చంద్రయ్య పివైఎల్ రాష్ట్ర నాయకులు ఆరు ముళ్ళ తిరుపతి అన్నారు. గురువారం అంతర్గాం మండలం పెద్దంపేట రైల్వే గేట్ వద్ద అల్లూరి సీతారామరాజు 102 వ వర్ధంతి సభ సందర్భంగా అల్లూరికి పూలమాలవేసి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించిన అనంతరం మాట్లాడారు. కేంద్రంలో మోడీ బిజెపి ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చి ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి ఉపాధి కల్పించకుండా యువతను నిర్వీర్యం చేస్తుందని చంద్రయ్య తిరుపతి ఆరోపించారు. మతోన్మాద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మతోన్మాద పాపిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాటమే లక్ష్యంగా సాగుదామని చంద్రయ్య తిరుపతి అన్నారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి కొల్లూరి మల్లేష్, పైడిపల్లి రమేష్, పివైఎల్ మండల నాయకులు ఈదునూరి బాబు, వార్డు మెంబర్ ఆరుమూల సృజన్ కుమార్, గ్రామ నాయకులు సిహెచ్ రాజేందర్, తుళ్ల గట్టయ్య, కోడిపుంజుల చంద్రయ్య, పి.క్రాంతి, బండిశ్రావణ్, బి.వెంకటస్వామి బి.మల్లయ్య శ్రీనివాస్, సతీష్, సిబి.రాజం తదితరులు పాల్గొన్నారు.

# "ప్రజల ముంగిటకే పాలన.. సమస్యల పరిష్కారమే బాధ్యత"

**- 17వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ సుమలత శ్రీకాంత్ పర్యటన**

**- ఓడిఎఫ్ కాలనీ పార్కులో సమస్యల పరిష్కారానికి హామీ**

**- అధికారులకు చైర్‌పర్సన్ కీలక ఆదేశాలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పటాన్‌చేరు, మే 7 : ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే మున్సిపాలిటీ ప్రథమ కర్తవ్యమని ఇస్నాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుమలత శ్రీకాంత్ స్పష్టం చేశారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో కమిషనర్, వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులతో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించారు. గడప గడపకూ తిరుగుతూ స్థానికులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

వార్డు పర్యటనలో భాగంగా పారిశుధ్య నిర్వహణను ఆమె నిశితంగా పరిశీలించారు. ఎక్కడా చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడాలని, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పార్కులో లైటింగ్, బోర్ సమస్యలు పరిష్కరిస్తాం. ఓడిఎఫ్ కాలనీ పార్కులో నెలకొన్న సమస్యలను స్థానికులు చైర్‌పర్సన్ దృష్టికి తెచ్చారు. పార్కులో విద్యుత్ దీపాలు వెలగకపోవడం వల్ల రాత్రి వేళల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అలాగే బోర్ స్టార్టర్ పాడవ్వడం వల్ల నీటి సరఫరా నిలిచిపోయిందని వివరించారు. దీనిపై ఆమె తక్షణమే స్పందిస్తూ.. యుద్ధ ప్రాతిపదికన పార్కులో లైటింగ్ పునరుద్ధరించాలని, బోర్ స్టార్టర్ రిపేర్ చేయించి నీటి సమస్య లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మంచిర్యాల (హాజీపూర్), మే 7: రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు నగదు చెల్లింపు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోలు పూర్తి చేయాలని, జిల్లాలో మిల్లింగ్ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చే వరి తప్పనిసరిగా శుభ్రపరచి, నాణ్యత ప్రమాణాలుహొహొపాటించేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అంతరాయాలు రాకుండా, హమాలి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తమ బాధ్యత లను క్రమంగా నిర్వర్తిస్తూ, రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలును పారదర్శకంగా చేపట్టి సమయానికి పూర్తి చేయాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో తడిచిన ధాన్యాన్ని త్వరగా ఆరబెట్టి కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత తదితరులు అధికారులు

# రామచిలుకకు ప్రాణం పోసిన కోదాడ పశువైద్యులు

**- విరిగిన రెక్క ఎముకకు సూదితో శస్త్రచికిత్స - రాష్ట్ర సరిహద్దులు దాటి వైద్యం కోసం తరలింపు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోదాడ ప్రతినిధి, మే 7 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జగ్గయ్యపేటకు చెందిన ఓ కుటుంబం ప్రేమగా పెంచుకుంటున్న రామచిలుకకు ప్రమాదవశాత్తు రెక్క విరగడంతో మెరుగైన వైద్యం కోసం కోదాడకు తీసుకువచ్చారు. కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి. పెంటయ్య విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించి చిలుకకు ప్రాణం పోశారు. సమాచారం ప్రకారం ఇంట్లో ఎగురుతున్న సమయంలో సీలింగ్ ఫ్యాన్ తగిలి చిలుక రెక్క ఎముక పూర్తిగా విరిగిపోయింది. దీంతో ఆందోళన చెందిన యజమాని ముందుగా జగ్గయ్యపేట పశువైద్యశాలకు తీసుకెళ్లగా, అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కోదాడకు తరలించారు. చిలుక రెక్కలోని ఎముక చాలా సన్నగా ఉండటంతో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి. పెంటయ్య సమయస్ఫూర్తితో 22 నెంబర్ సూదిని రాడ్‌లా ఉపయోగించి విరిగిన ఎముకను అతికించారు. శస్త్రచికిత్స అనంతరం చిలుక రెక్క నిలబడటంతో తిరిగి ఎగరడం ప్రారంభించింది. చిలుకపై అపారమైన ప్రేమతో యజమాని వైద్యం జరుగుతున్నంతసేపు ఆందోళన చెందుతూ కన్నీళ్లు పెట్టుకోవడం అక్కడున్న వారిని కలచివేసింది. ఈ సందర్భంగా డాక్టర్ పి. పెంటయ్య మాట్లాడుతూ పక్షిపై ప్రేమే యజమానిని రాష్ట్ర సరిహద్దులు దాటి కోదాడకు వచ్చేలా చేసిందన్నారు. ఉదయం నుంచి ఆహారం కూడా తీసుకోకుండా పక్షి కోసం ఆందోళన చెందడం అభినందనీయమని తెలిపారు.





# మెదక్ పట్టణాభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## రూ.37.01 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, మే07 : పట్టణ ప్రాంత అవసరాలను గుర్తించి వారికి మౌలిక వసతులు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ అన్నారు. గురువారం రోజు మెదక్ పట్టణంలోని ఆయా వార్డుల్లో రూ.37.01 కోట్లతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రోహిత్ శంకుస్థాపన చేశారు.ఎఖఖీ×ణజ,వాదీవీ పథకాల కింద,మెదక్ పట్టణంలో రూ.37.01 కోట్ల రూపాయల వ్యయంతో మెదక్ మున్సిపాలిటీలోని వివిధ వార్డులలో సీసీ రోడ్లు,సీసీ డ్రైన్లు మరియు స్లాబ్‌ల నిర్మాణంకు పనులను శంఖుస్థాపన చేశారు. వార్డు నెం. 1-ఔరంగాబాద్ ప్రాంతం దీజ కమ్యూనిటీ హాల్ సమీపంలో జజ డ్రెయిన్‌లు, స్లాబ్‌లు మరియు రోడ్ల నిర్మాణంకు రూ.36 లక్షలు, వార్డు నెం. 2-అవుసులపల్లి మాధురి దేవయ్య ఇంటి సమీపంలో సీసీ రోడ్ల నిర్మాణం రూ.32 లక్షలు,వార్డు నెం.3లో సీసీ రోడ్డు,సైడ్ డ్రైనేజీల నిర్మాణం కోసం రూ.30 లక్షలు, వార్డ్ నెం.5-మిలిటరీ కాలనీ, జంబికుంట,ఇందిరాపురి కాలనీలు,ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ సమీపంలో అభివృద్ధి పనులు రూ.76 లక్షలు,వార్డు నెం 19- చర్చి ప్రాంతం 100 మంది సభ్యుల కోసం +ం3 వసతి గృహ నిర్మాణంకు రూ.14.77 లక్షలు,వార్డు నెం. 6 అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డుపై సీసీ రోడ్ల నిర్మాణంకు రూ.39.50 లక్షలు, వార్డు నెం. 7 ఖుత్‌బిష్లాం మసీదు రోడ్డుకు సమీపంలో, వాటర్ ప్లాంట్ దగ్గర సీసీ రోడ్ల నిర్మాణం రూ.35 లక్షలు,వార్డు నెం.28 కమ్యూనికాంత ఫోర్ట్ రోడ్డులో సిసి డ్రైనేజీలు మరియు రోడ్ల నిర్మాణం రూ.30 లక్షలు, వార్డు నెం.14- నవాపేట ప్రాంతంలో అభివృద్ధి పనులు రూ.30 లక్షలు,వార్డు నెం.12 2దీఎఖ ప్రెస్ కాలనీ ప్రధాన రహదారి ప్రవేశద్వారం వద్ద జజ డ్రెయిన్లు,స్లాబులు మరియు రోడ్ల నిర్మాణం రూ.160 లక్షలు,వార్డు నెం.13 రూ.15 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన మొత్తం రూ.37.01 కోట్ల రూపాయల విలువైన మొత్తం అభివృద్ధి పనులకు శంకు స్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ మెదక్ ప్రాంత ప్రజల అభివృద్ధి చేయాలని ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు.మెదక్ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు నిధులు మంజూరు చేస్తూ పనులు చేపడుతున్నామన్నారు. రాబోయే రోజుల్లో అరె నీ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు వస్తువులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 7 : జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ నుండి 21వ తేదీ వరకు జరగనున్న ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. పరీక్షల నిర్వహణ కొరకు జిల్లాలో 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రథమ సంవత్సరం ఒకేషనల్ కోర్సుతో కలిపి 1 వేయి 770 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 697 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షలను పూర్తి ప్రశాంత వాతావరణంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు త్రాగునీరు, వెలుతురు, ఫ్యాన్లు, సరిపడా ఫర్నిచర్, మూత్రశాలలు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేసవి దృష్ట్యా విద్యుత్ కోతలు



లేకుండా నిరంతర సరఫరా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని, ఆర్ టి సి అధికారులు విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా సమయానుసారంగా బస్సులు నడపాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని, వైద్య సిబ్బంది అవసరమైన మందులు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లతో అందుబాటులో ఉండాలని, అత్యవసర సేవల నిమిత్తం అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రశ్నా పత్రాలు, జవాబు పత్రాలు పూర్తి బందోబస్తు మధ్య తరలించాలని, పరీక్షల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్, సెట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించాలని తెలిపారు. పరీక్షలను అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాధ్యమిక విద్యాధికారి రామ్ దాస్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలి

## దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 7 : సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేసి, భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. గురువారం కాళేశ్వరం వద్ద జరుగుతున్న అంత్య పుష్కరాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సరస్వతి ఘాట్‌ను సందర్శించి, ఘాట్‌లో వేస్తున్న పార్కింగ్ టైల్స్ పనులు, సరస్వతి విగ్రహం వద్ద ఏర్పాటు చేసే ప్రహరీగోడాలు, చలువ పందిళ్ల ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఘాట్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ స్థలాలు, శాశ్వత ప్రాతిపదికన నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులు, మద్దులపల్లి, పూసుకుపల్లి, బలిజాపూర్ మరియు గోదావరి వంతెన వద్ద ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం మ్యూజియం పనులను పరిశీలించి, ఈ నెల 18వ తేదీ నాటికి విగ్రహాల ప్రతిష్టాపన వాస్తు ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. తదుపరి ఈఓ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఈనెల 21 నుండి జూన్ 1 వరకు నిర్వహించే సరస్వతి అంత్య పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని, గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ప్రైవేట్ వాహనాలు ఆర్టీసీ బస్సులకు వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేస్తూ, సుమారు 260 ఎకరాలలో 24 ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పార్కింగ్ ప్రాంతాల్లో త్రాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు, ట్రాఫిక్ అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రతి అర కిలోమీటరుకు ఒక చలివేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సరస్వతి ఘాట్ వద్ద పెద్దఎత్తున తాత్కాలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, పగోడాలు, షాపింగ్



స్టాల్స్, ప్లే జోన్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లా చిన్న పరిశ్రమల ఉత్పత్తులను ప్రోత్సహించే విధంగా సుమారు 50 షాపులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పిండప్రదాన కార్యక్రమాల కోసం గోదావరి తీరం వద్ద ప్రత్యేక చలువ పందిళ్లు ఏర్పాటు చేసి, అక్కడే పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పిండప్రదానం ప్రాంతంలో 20 పడకలతో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ నెల 21వ తేదీ ఉదయం 5:43 గంటలకు కంచి స్వామివారు త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించనున్నారని, అదేరోజు రాష్ట్ర గవర్నర్ కూడా పుణ్యస్నానం ఆచరించనున్నారని తెలిపారు. గతంలో ఆది పుష్కరాల్లో స్నానం చేయని భక్తులు అంత్య పుష్కరాలకు పెద్దఎత్తున తరలివస్తారని ఆమె పేర్కొన్నారు. అనంతరం కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఆలయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని క్యూ లైన్ల నిర్వహణపై దేవాదాయ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ధార్మిక సలహాదారు గోవింద హరి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఎఫ్‌వో నవీన్ రెడ్డి, ఈఓ మహేశ్ పలు శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో వేగంగా సాగుతున్న డిజిటల్ జనగణన ప్రక్రియ

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 07 : నిర్మల్ జిల్లాలో డిజిటల్ జనగణన-2027 ప్రక్రియ పకడ్బందీగా సాగుతోందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా వెల్లడించారు. గురువారం హైదరాబాద్ నుండి డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోలికేరి జనగణన - 2027 విధివిధానాలు, సంబంధిత అంశాలపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులకు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ విసి హాల్ నుండి ఆయన జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా నివేదికను వివరిస్తూ, జిల్లాలో ఇప్పటివరకు 93.844 శాతం స్వయం గణన పూర్తయిందని,ఇప్పటి వరకు 12897 విజయవంతంగా ముగిశాయని వివరించారు. జనగణన విధుల్లో పాల్గొనే సిబ్బంది శిక్షణపై ప్రత్యేక దృష్టి సారించి, జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 44 శిక్షణా బ్యాచ్‌లు వంద శాతం లక్ష్యాన్ని చేరుకున్నాయని వివరించారు. క్షేత్రస్థాయి నిర్వహణకు కీలకమైన 1551 హౌస్ లిస్టింగ్ బ్లాక్ డీమార్కేషన్ ప్రక్రియను ఆన్‌లైన్ పోర్టల్‌లలో వంద శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు అవసరమైన కిట్ల పంపిణీ వేగంగా జరుగుతోందనీ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, సి పి ఓ జీవరత్నం, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ పర్యటనకు ప్రధాని మోదీ

## - ఘన స్వాగతం పలుకుదాం
## - బీజేపీ నేత కాసిపేట శివాజీ పిలుపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 07 : నరేంద్ర మోదీ మూడవసారి ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా తెలంగాణ గడ్డపై అడుగుపెడుతున్న సందర్భంగా ఘన స్వాగతం పలుకుదామని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసిపేట శివాజీ పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి సోమారపు లావణ్యతో కలిసి ఆయన మాట్లాడుతూ ఈనెల 10న ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ రాష్ట్రానికి రానున్నారని, ఆరోజు సాయంత్రం వేల కోట్ల అభివృద్ధి పనులను వర్చువల్ పద్ధతిలో ప్రారంభించనున్నారని తెలిపారు. సాయత్రం 4 గంటలకు హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ లో భారీ బహిరంగ సభ ఉంటుందని, ఈ బహిరంగ సభకు ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. బహిరంగ సభకు వెళ్ళడానికి రామగుండం రైల్వే స్టేషన్ నుండి ఈనెల 10న ఉదయం 10 గంటలకు ప్రత్యేక ట్రైన్ ఉంటుందని వెల్లడించారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో బీజేపీ నాయకులు పిడుగు కృష్ణ, జక్కుల నరహరి, కొండపర్తి సంజీవ్, ఐత పవన్, బూడిద రాజేష్, నాగరాజు, శోభారాణి, సవిత, అన్వేష్, చుక్కల రాములు, శ్రీను, బుంగ మహేష్, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# కాంట్రాక్టు కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న సింగరేణి

- పెరిగిన వేతనాల జీఓ వెంటనే విడుదల చేయాలి
- వీడిఎ వేతనాలు చెల్లించాలి
- ప్రతినెల ఏడవ తేదీ లోపే నెలవారి జీతం ఇవ్వాలి
- సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు భూక్య రమేష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రికొత్తగూడెం, మే 7 : సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు 2026 సంవత్సరంలో పెరిగిన (విడిఏ) వేతనాలు వెంటనే చెల్లించాలని సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు భూక్యా రమేష్ డిమాండ్ చేశారు. గురువారం భద్రాద్రి జిల్లా కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని కాంట్రాక్టు కార్మికులు పని ప్రాంతాల్లో జరిగిన జనరల్ బాడీ మీటింగ్ లో భూక్య రమేష్ మాట్లాడుతూ అరకొర వేతనాలతో జీవనం సాగిస్తున్న సింగరేణి కాంట్రాక్టు కార్మికులు పెరిగిన విడిఏ ప్రభుత్వ ఉత్తర్వులు వెంటనే విడుదల చేసి వేతనాలు వెంటనే చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం సింగరేణి జిఎం పర్సనల్ నిర్లక్ష్యంగా వహిస్తున్నారని ఆయన విమర్శించారు. కార్మికుల వేతనాలు పెంచకపోగా, సెంట్రల్ చీఫ్ లేబర్ ఆఫీస్ నుండి పెరిగిన వేతనాల ను చెల్లించకుండా, ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో సమాధానం చెప్పాలని సింగరేణి అధికారులను ఆయన ప్రశ్నించారు. కాంట్రాక్టు కార్మికుల శ్రమతోటి లాభాలు అర్జిస్తున్న సింగరేణి యాజమాన్యం సంబంధిత అధికారులు వెంటనే దృష్టి సారించి పెరిగిన వీడియోను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు భాస్కర్, గుగులోతు సక్రాం,అనిల్, రమేష్ పాసి , తదితరులు పాల్గొన్నారు.



# ఖాళీ ప్లాట్లు శుభ్రం ఉంచాలి

## మేయర్ మహంకాళి స్వామి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), మే 7 : ఖాళీ ప్లాట్లు వాటి యజమానులు శుభ్రంగా ఉంచుకోవాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి కోరారు. వార్డు సందర్శనలో భాగంగా గురువారం 34 వ డివిజన్ కృష్ణా నగర్ లో స్థానిక కార్పొరేటర్ స్వప్న ప్రియ భరత్ గౌడ్ తో కలిసి పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖాళీ స్థలాల్లో పెద్ద ఎత్తున పిచ్చి చెట్లు , తుప్పలు , పొదలు పెరిగి పందులకు ఆవాసమై అపరిశుభ్రత నెలకొంటున్నదని అన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు గురువారం చేపట్టిన సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ లో కొన్ని స్థలాల్లో నగర పాలక సంస్థ ఆద్వర్యంలో పిచ్చి చెట్లు తొలగించి శుభ్రం చేయడం జరిగిందని అన్నారు. రోడ్ల మీదకు వచ్చిన కొమ్మలను తొలగించడం జరిగిందని అన్నారు. డివిజన్ లో ఉన్న ప్రదాన నాలాపై ఆక్రమణలు ఉండడంతో నీళ్ళు సాఫీగా ప్రవహించక ఇళ్లల్లోకి వర్షా కాలంలో వరద వస్తుందని అన్నారు. సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ లో యంత్రాలతో పాటు ఇరవై మంది మునిసిపల్ పారిశుద్ధ్య సిబ్బందితో కాలువల్లో పూడిక తొలగించడం జరిగిందని అన్నారు. ఆక్రమణలు కూడా తొలగించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడం జరిగిందని అన్నారు. డివిజన్ లలో ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించాలని రామగుండం శాసన సభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్ చేసిన సూచనల మేరకు సానిటేషన్ డ్రైవ్ నిరంతర ప్రక్రియ గా కొనసాగించడం జరుగుతుందని అన్నారు. మునిసిపల్ డ్రెయిన్ క్లీనర్లు చాలా బాగా పని చేస్తున్నారని అన్నారు. ప్రజలు కూడా సహకరించి రోడ్ల మీద , కాలువల్లో చెత్త వేయకుండా సహకరించాలని అన్నారు. రామగుండం నగరాన్ని అద్భుత నగరం గా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అన్నరు. కాగా ఈ సంధర్భంగా కృష్ణా నగర్ లో పట్టణ ప్రణాళికా విభాగం ఆద్వర్యంలో కాలువలపై నిర్మించిన పలు ఆక్రమణలను తొలగించారు.



# ధాన్యం కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్ కొనుగోలు కేంద్రంలో తనిఖీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సిరిసిల్ల, మే 07 : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్ మార్కెట్ కమిటీ ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం రాశులు పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు వేగంగా పూర్తి చేయాలని, మిల్లులకు తరలించాలని సూచించారు. మిల్లర్లు హమాలీల సంఖ్య ను పెంచి వెంట వెంటనే ధాన్యం అన్ లోడింగ్ చేయాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తనిఖీలో ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ నరసింహ, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, తహసీల్దార్ జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశోధక విద్యార్థి పల్లికొండ మహేష్ కు పీహెచ్‌డీ పట్టా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, మే 07 : జగిత్యాల జిల్లా భీమారం గ్రామానికి చెందిన పరిశోధక విద్యార్థి పల్లికొండ మహేష్ "క్లైమేట్ చేంజ్ అండ్ ఇట్స్ ఇంపాక్ట్ ఆన్ అగ్రికల్చర్ ఆఫ్ నార్తర్న్ తెలంగాణ" అనే అంశంపై విజయవంతంగా పరిశోధన పూర్తి చేసి పీహెచ్‌డీ పట్టా సాధించారు. ఈ పరిశోధనను ఆయన ప్రొఫెసర్ ఏవి.శశికళ పర్యవేక్షణలో పూర్తి చేశారు. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో వాతావరణ మార్పుల ప్రభావం వ్యవసాయ రం గంపై ఎలా పడుతోందో, పంటల ఉత్పత్తి, వర్షపాతం మార్పులు, ఉష్ణోగ్రతల పెరుగుదల వంటి అంశాలను పరిశోధనలో విశ్లేషించారు. ఈ పరిశోధన రైతులకు, వ్యవసాయ రంగ నిపుణులకు, విధాన నిర్ణేతలకు ఉపయోగకరంగా ఉంటుందని అధ్యాపకులు అభిప్రాయపడ్డారు. పల్లికొండ మహేష్ సాధించిన ఈ విజయం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, స్నేహితులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# పేదల గడప వద్దకే 'ప్రజాపాలన'

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు - మంత్రి పొంగులేటి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 7 : రాష్ట్రంలో పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం ప్రజాపాలనను నేరుగా ప్రజల గడప వద్దకే తీసుకువచ్చిందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం గ్రామంలో నిర్వహించిన 'ప్రజాపాలన-ప్రజాదర్బార్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీ రఘురాం రెడ్డి, కలెక్టర్ దివాకరతో కలిసి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గతంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శిస్తూ, ప్రస్తుతం ప్రతి గింజను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని, ఇప్పటికే రూ.21 వేల కోట్ల రుణమాఫీ ద్వారా 25 లక్షల మంది రైతులకు ఉపశమనం కల్పించామని చెప్పారు. రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు లేని నిరుపేదలకు గృహ కల్పన చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే పెద్ద ఎత్తున ఇళ్లు మంజూరు చేసినట్లు పేర్కొంటూ, మే నెలాఖరు నాటికి రెండో విడత ఇళ్ల మంజూరు చేపడతామని ప్రకటించారు. భూ సమస్యల పరిష్కారానికి 'భూ భారతి' కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులను వచ్చే 35 రోజుల్లో ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం, మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం వంటి పథకాలతో పేద కుటుంబాలకు తోడ్పడుతోందని తెలిపారు. ప్రజాదర్బార్‌లో అందిన ప్రతి అర్హమైన దరఖాస్తును గరిష్టంగా మూడు నెలల్లో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రాంప్రసాద్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# భూపాలపల్లి మున్సిపాలిటీలో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక

## - నూతన సభ్యులను అభినందించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భూపాలపల్లి, మే 7 : భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కో-ఆప్షన్ ఎన్నికల్లో వివిధ కేటగిరీలకు సభ్యులు ఎన్నికయ్యారు. జనరల్ కేటగిరీలో సజ్జనపు స్వామి, మహిళా కేటగిరీలో చల్లా రేణుక, మైనారిటీ జనరల్ కేటగిరీలో ఎం.డి అబ్దుల్ హాఫీజ్, మైనారిటీ మహిళా కేటగిరీలో ఎం.డి మిన్హాజ్ కో-ఆప్షన్ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరైన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నూతనంగా ఎన్నికైన సభ్యులకు అభినందనలు తెలిపారు. ప్రజలకు అంకితభావంతో, నిబద్ధతతో పని చేస్తూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# సొసైటీలు రాజకీయ పునరావాస కేంద్రాలు కావు

## - కాంగ్రెస్ ఓటమి భయంతోనే తెరపైకి నామినేటెడ్ ప్రస్తావన - రైతుల శ్రేయస్సు కోసం నిరంతరం పని చేస్తా - పీఏసీఎస్ ఛైర్మన్ యశ్వంత్ రెడ్డి





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేక్మాల్ మే 07 : సొసైటీలు రాజకీయ పునరావాస కేంద్రాలు కావని, నామినేటెడ్ పదవులు సొసైటీలో తగదని పీఏసీఎస్ ఛైర్మన్ యశ్వంత్ రెడ్డి పేర్కొన్నారు. 597జీవోపై రాష్ట్ర వ్యాప్తంగా హైకోర్టును ఆశ్రయించడంతో పాత పాలకవర్గాన్నే కొనసాగించాలని తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో జిల్లా సొసైటీ అధికారుల ఉత్తర్వుల మేరకు ఛైర్మన్ గా యశ్వంత్ రెడ్డి, పాలకవర్గం బాధ్యతలను స్వీకరించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీలు రాజకీయ పునరావాస కేంద్రాలు కావని, కేవలం రైతుల ప్రయోజనాల కోసమే పని చేయాలని అన్నారు. నామినేటెడ్ పద్ధతిలో పదవులను కట్టబెడితే సొసైటీలు నిర్వీర్యమవుతాయన్నారు. అవసరమైతే సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలి తప్ప నామినేటెడ్ పద్ధతి సరైంది కాదన్నారు. రైతుల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకత ఉన్న కారణంగా ఎన్నికలు నిర్వహిస్తే ఓడిపోతామనే భయంతోనే తెరపైకి నామినేటెడ్ ప్రస్తావనను తీసుకువచ్చిందన్నారు. రైతుల సభ్యత్వంతో కొనసాగుతున్న సొసైటీల్లో నామినేటెడ్ పదవులకు స్థానం లేదన్నారు. అధికారుల పాలనలో కనీసం రైతులు రుణాలు పొందడం కూడా కష్టంగా ఉంటుందన్నారు. వరి కోతల సీజన్ లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. తమ పాలకవర్గం సహకారంతో మరింత ముందుకెళ్తామన్నారు. పాలకవర్గం పూర్తి స్థాయిలో సహకరిస్తే గతంలో నిలిచిపోయిన సొసైటీ పెట్రోల్ పంపును మళ్లీ అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. సొసైటీ న్యాయం కోసం పోరాడిన అడ్వకేట్ బుచ్చిరెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు శ్రీశైలం, శ్రీరాములు, చందర్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు భక్తుల వీరప్ప, మాజీ జడ్పీటీసీ ముక్తార్, మాజీ ఎంపీటీసీ సిద్దయ్య, మాజీ సర్పంచ్ లు సత్యనారాయణ, సాయిలు, శ్రీనివాస్, నాయకులు అడివప్ప, సలీం, భాస్కర్, రమేష్ నాయక్, రవి, శ్రీనివాస్, సీఈవో వేణుగోపాల్, సాయిలు, రైతులు, తదితరులు ఉన్నారు.

# భూపాలపల్లిలో కోతుల బెడద తీవ్రం

## - ప్రాణ భయంతో ప్రజలు, అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, మే 7 : జయశంకర్-భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో కోతుల బెడద రోజురోజుకీ తీవ్రరూపం దాల్చి ప్రజల జీవనాన్ని సంక్షోభంలోకి నెడుతోంది. కోతుల దాడులతో ప్రజలు బయటికి రావడానికే భయపడే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఇటీవల జవహర్ కాలనీలో జరిగిన ఘటన ఈ సమస్య తీవ్రతను మరింత స్పష్టం చేసింది. ఐదు రోజుల క్రితం కోతుల దాడిలో హరికృష్ణ అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటన జరిగినప్పటికీ ఇప్పటివరకు సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం ప్రజల్లో ఆగ్రహానికి దారితీస్తోంది. ఈ నేపథ్యంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి ఆతుకూరి శ్రీధర్, ఏఐఎఫ్‌బీయు రాష్ట్ర నాయకులు చంద్రగిరి శంకర్ తీవ్రంగా స్పందించారు. ప్రజల ప్రాణాలు పోతున్నా అధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమని వారు మండిపడ్డారు. కోతుల సమస్యను అదుపులోకి తెచ్చేందుకు తక్షణమే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, కోతులను పట్టుకునే చర్యలు చేపట్టాలని, ప్రజల భద్రతకు హామీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే ప్రజా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రస్తుతం ప్రజలు "బయటికి వెళితే ప్రాణాలతో తిరిగి వస్తామా?" అనే భయంతో జీవిస్తున్నారని, ప్రభుత్వం మరియు అధికారులు వెంటనే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

# పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

## రెవెన్యూ శాఖపై కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




ఖమ్మం, మే 7 : రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, ప్రజలకు సమయానికి సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి భూ భారతీ, సాదా బైనామా, మీ సేవా, రెవెన్యూ సదస్సులు, ప్రభుత్వ భూములు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సాదా బైనామా దరఖాస్తులను మార్గదర్శకాల ప్రకారం పూర్తిగా క్లియర్ చేయాలని సూచించారు. 2014 జూన్ 2కు ముందు జరిగిన లావాదేవీలకే ప్రాధాన్యత ఇవ్వాలని, దరఖాస్తుదారులు భూమి స్వాధీనంలో ఉండాలని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఎట్టి పరిస్థితుల్లోనూ రెగ్యులరైజ్ చేయరాదని స్పష్టం చేశారు. ప్రతి దరఖాస్తుపై ఫీల్డ్ పరిశీలన, నోటీసులు, అర్హతలు తదితర వివరాలను నివేదికలో స్పష్టంగా చూపించాలని ఆదేశించారు. భూ భారతీ స్లాట్లపై సమీక్షిస్తూ, రిజిస్ట్రేషన్ ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని, నిర్దిష్ట సమయంలో పూర్తి చేయని స్లాట్లను రద్దు చేసే విషయాన్ని ముందస్తుగా తెలియజేయాలని సూచించారు. ప్రతి రోజు మండలాల నుంచి క్లియర్ చేసిన ఫైళ్లను జిల్లా స్థాయికి పంపిస్తూ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. మీ సేవా, రెవెన్యూ సదస్సుల దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని, పౌర సేవలకు సంబంధించిన దరఖాస్తుల్లో పెండెన్సీకి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఉండకూడదని హెచ్చరించారు. తదుపరి సమీక్ష నాటికి ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి మండలంలో లభ్యమయ్యే ప్రభుత్వ భూములపై సమగ్ర నివేదిక సమర్పించాలని, భూములను విభాగాలవారీగా వర్గీకరించి అభివృద్ధి కార్యక్రమాలకు అనుకూలత వివరించాలని ఆదేశించారు. అలాగే ఇసుక సరఫరాలో ఎలాంటి సమస్యలు లేకుండా 'మన ఇసుక వాహనం' విధానాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. ప్రజావాణి వినతులను 15 రోజుల్లో పరిష్కరించాలని, ప్రతి వినతిని ఆన్‌లైన్‌లో నమోదు చేసిచర్యల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. 15 రోజులు దాటిన వినతులపై బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్లు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఉపకరణాలతో ప్రభుత్వం అండ

## - 586 మందికి సహాయ పరికరాల పంపిణీ

## - భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి-భువనగిరి, మే 7 : జిల్లా మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులు, వృద్ధులకు సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ప్రభుత్వం దఫాలవారీగా దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు అందజేస్తోందని, ఇంకా అందని వారికి త్వరలోనే అందజేస్తామని తెలిపారు. పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని పేర్కొన్నారు. తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, రిజర్వేషన్లు, ఉపకరణాలు, ప్రోత్సాహక పథకాల ద్వారా వారికి అండగా నిలుస్తోందన్నారు. అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ, ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ద్వారా 68 మందికి, అలింకో ద్వారా 518 మందికి కలిపి మొత్తం 586 మందికి సహాయ ఉపకరణాలు పంపిణీ చేశారు. జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, గ్రంథాలయ సంస్థల చైర్మన్ ఆవేజ్ చిస్తీ, ఇతర అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# చట్టబద్ధంగా దత్తత అందజేసిన కలెక్టర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కరీంనగర్, మే 7:పిల్లలు లేని దంపతులకు రక్తసంబంధీకుల నుంచి చట్టబద్ధంగా దత్తతలను జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా బుధవారం అందజేశారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ-మిషన్ వాత్సల్య ఆధ్వర్యంలో కరీంనగర్‌కు చెందిన ఇద్దరు దంపతులు తమ రక్తసంబంధీకుల నుంచి పాప, బాబును చట్టబద్ధ ఉత్తర్వులతో దత్తతగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిత్ర మిశ్రా మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు తప్పనిసరిగా చట్టబద్ధ విధానంలోనే దత్తత తీసుకోవాలని సూచించారు. రక్తసంబంధీకుల నుంచి దత్తతకు ఆసక్తి ఉన్న వారు జిల్లా పరిషత్‌లోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డిసిపిఓ) దుర్దాన పర్వీన్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, లీగల్ కమ్ ప్రొబేషన్ ఆఫీసర్ రాజు, డేటా అనలిస్ట్ ఎం.రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తాం

## - రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ములుగు మే 7 : ములుగు జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో జిల్లా జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలోని నాయకులు భవన నిర్మాణం చేపట్టాలని, ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం కోసం 2024 శంకుస్థాపన చేసినప్పటికీ నేటికీ పనులు ప్రారంభించక పోవడం, భవన నిర్మాణ పనులలో జాప్యం జరుగుతున్నదని, ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరుగుతుందని అన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో జాక్ జిల్లా కన్వీనర్ గుర్రపు శ్రీధర్, గౌరవ అధ్యక్షులు జినుకల ప్రభాకర్, కో- కన్వీ నర్ ఎనగందుల కొమురయ్య, సంఘ రంజిత్, చల్ల గురుకుల రాజు వర్ధన్, పాల్గొన్నారు.

# కాటారం అంబేద్కర్ సెంటర్‌లో టీజేఎస్ ప్లీనరీ పోస్టర్ ఆవిష్కరణ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాటారం, మే 7 : స్వేచ్ఛ, సమానత్వం, స్వపరిపాలన లక్ష్యాలతో ప్రజాస్వామిక తెలంగాణ సాధన కోసం తెలంగాణ జనసమితి (టీజేఎస్) ప్రజల గొంతుకగా పని చేస్తోందని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య తెలిపారు. కాటారం అంబేద్కర్ సెంటర్‌లో వివిధ ప్రజా సంఘాల నాయకుల సమక్షంలో టీజేఎస్ రాష్ట్ర 4వ ప్లీనరీ సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ నెల 12న హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ జలవిహార్‌లో నిర్వహించనున్న ప్లీనరీ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన వారు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక మంది విద్యార్థులు తమ ప్రాణాలను అర్పించారని, వారు ఆశించిన ప్రజాస్వామిక తెలంగాణ ఇంకా పూర్తిగా సాకారం కాలేదని పేర్కొన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలపై తెలంగాణ ప్రజలకు హక్కులు కల్పించాలనే ఉద్యమ లక్ష్యాలు ఇంకా నెరవేరాల్సి ఉన్నాయని అన్నారు. కేవలం భౌగోళిక తెలంగాణ ఏర్పడిందే గానీ, ఉద్యమ ఆకాంక్షల సాధన ఇంకా మిగిలే ఉందని వారు అభిప్రాయపడ్డారు. అవినీతి రాజకీయాలను మార్పు చేయడం కోసం టీజేఎస్ పార్టీ కృషి చేస్తోందని, ఎన్నికలను డబ్బుతో ప్రభావితం చేస్తూ సామాన్యులను రాజకీయాల నుంచి దూరం చేస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామిక విలువలను కాపాడుతూ అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు టీజేఎస్ పార్టీ ప్రజల తరఫున నిలబడుతుందని కామెర గట్టయ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ భూపాలపల్లి జిల్లా కన్వీనర్ పీక కిరణ్, యూవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపన్న, మాల మహానాడు రాష్ట్ర నాయకుడు బోడ బాపు, ఇతర సంఘాల నాయకులు దాసరి జనార్ధన్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# జువ్వాడి నర్సింగరావుకు శుభాకాంక్షలు తెలిపిన చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 7 : తెలంగాణ రాష్ట్ర వెలమ సంక్షేమ శాఖ కార్పొరేషన్ చైర్మన్ గా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు బుధవారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ బుధవారం మెట్పల్లి పట్టణ జువ్వాడి భవన్ లో నర్సింగరావును మర్యాదపూర్వకంగా కలిసి, ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మెట్పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి మహేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్, శంకర్, జమున, అక్షయ్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# పదిలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు కలెక్టర్ అభినందన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కరీంనగర్, మే 7 : పదవ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన బాలసదనం విద్యార్థినులను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా బుధవారం సాయంత్రం తన క్యాంప్ కార్యాలయంలో అభినందించారు. తిమ్మాపూర్ కేజీబీవీలో చదువుతున్న కే.సాధన 536 మార్కులు సాధించి, స్కూల్లో టాపర్ గా నిలిచింది. ఇదే స్కూల్లో చదువుతున్న ఎం.హారిని 516 మార్కులు, ఆరేపల్లి జెడ్పిహెచ్ఎస్ స్కూల్లో చదువుతున్న కే.హారినీ 298 మార్కులు సాధించారు. ఈ ముగ్గురు విద్యార్థినులను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అభినందించారు. ఉన్నత చదువులు చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి చైర్ పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి యం.సరస్వతి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డిసిపిఓ) దుర్దాన పర్వీన్, శాంత, లీగల్ కమ్ ప్రొబేషన్ ఆఫీసర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# సినిమాలను తలపించిన కుస్తీ పోటీలు...

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



టేక్మాల్ మే 7 : మండల పరిధిలోని బొడ్మట్ పల్లి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అనే కమిటీ మరియు గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలను నిర్వహించారు. కొబ్బరికాయ కుస్తీ మొదలుకొని ఐదు తులాల వెండి కడెం కుస్తీ వరకు ఈ కుస్తీలు సినిమాలను తలపిస్తున్న విధంగా ఆలయ ప్రాంగణంలో కుస్తీ పోటీలను నిర్వహించారు. కుస్తీ పోటీలను తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హైదరాబాద్ బీదర్ మహారాష్ట్ర, కర్ణాటక, దేగ్లూర్, నిజామాబాద్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధులు, ఈ కుస్తీ పోటీల్లో తలపడ్డారు. చివరికి కుస్తీ మహారాష్ట్ర లోని ఉద్గిర్ కు చెందిన ధీరజ్ అనే మల్లయోధుడు గెలుపొందాడు. గెలుపొందిన మల్ల యోధునికి ఆరు తులాల వెండి కడియం ను గ్రామానికి చెందిన కంకర సంఘయ్య, గ్రామ సర్పంచ్ తలారి అవినాష్, ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్, వైస్ చైర్మన్ ఈశ్వరప్ప పూలమాలవేసి శాలువాతో సత్కరించి వెండి కడియాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గం సభ్యులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పంట అవశేషాలు కాల్చొద్దు - కలెక్టర్ దివాకర టిఎస్ హెచ్చరిక

## - పర్యావరణం, భూసారం పరిరక్షణపై దృష్టి పెట్టాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఖమ్మం, మే 7 : పంట అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణానికి, భూసారానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ హెచ్చరించారు. బుధవారం ఈ అంశంపై స్పందిస్తూ, రైతులు పంట అవశేషాలను దహనం చేయకుండా ప్రత్యామ్నాయ పద్ధతులు అనుసరించాలని సూచించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల మంటలు అదుపు తప్పి పక్కనున్న పంటలు, ఆస్తులు, విద్యుత్ లైన్లు దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. అలాగే పశువులకు, ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. అవశేషాల దహనం సమయంలో కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ వంటి హానికర వాయువులు విడుదలై గాలి కాలుష్యం పెరుగుతుందని, దీని వల్ల శ్వాసకోశ సమస్యలు అధికమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

# రోప్ వే పనులను గడువులోగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 7 : ఖమ్మం ఖిల్లా వద్ద రోప్ వే పనుల్లో వేగం పెంచి గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఖమ్మం ఖిల్లా వద్ద జరుగుతున్న రోప్ వే పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రస్తుతం లోయర్ స్టేషన్ పాయింట్ వద్ద పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పనుల వేగాన్ని పెంచి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వర్షాకాలంలో పనులు నిలిచిపోకుండా ఉండేందుకు అవసరమైన పనులను ఇప్పుడే చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే రోప్ వే కేబిన్ల తయారీ పనులు కోల్‌కతాలో సమాంతరంగా పూర్తి చేయాలని సూచించారు.

# ఆరోగ్యం



## బాబా రామ్‌దేవ్ చెప్పినట్లు చేస్తే..నెలలోనే కుండలాంటి పొట్ట కూడా కరిగి..నడుము నాజూగ్గా!

ఈ రోజుల్లో మనదేశంలో సగానికి పైగా ప్రజలను వేధిస్తున్న సమస్య ఊబకాయం. ముఖ్యంగా పొట్ట చుట్టూ పేరుకుపోయే కొవ్వు, ఒక పెద్ద సవాలుగా మారుతుంది. పొట్ట కొవ్వు కరిగించడం ఒక పెద్ద ప్రహసనంగా మారుతుంది. అయితే ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్ ఈ సమస్యకు అద్భుతమైన, సహజసిద్ధమైన పరిష్కారాలను తన యూట్యూబ్ ఛానెల్ ద్వారా సూచించారు. ఆయన సూచించిన పద్ధతులు ఆచరిస్తే,కుండలాంటి పొట్టను కరిగించి, నాజూకైన నడుమును సొంతం చేసుకోవడం ఖాయం.

ప్రాణాయామంతో కొవ్వుకు చెక్

బాబా రావ్‌దేవ్ చెప్పేదాని ప్రకారం పొట్ట కొవ్వును తరిమికొట్టడంలో ప్రాణాయామం ఒక శక్తివంతమైన ఆయుధం. ముఖ్యంగా కపాల్ భాతి ప్రాణాయామం దీనికి అమోఘంగా పనిచేస్తుంది. ఈ ఆసనాన్ని ఎలా వేయాలంటే..సుఖాసనంలో లేదా పద్మాసనంలో కూర్చుని కళ్ళు మూసుకుని, నెమ్మదిగా శ్వాస పీల్చుకుని, వేగంగా, శక్తివంతంగా శ్వాసను బయటకు వదలాలి. శ్వాసను బయటకు వదిలినప్పుడు, పొట్ట లోపలికి వెళ్ళాలి. ఇది ఒక లయబద్ధమైన ప్రక్రియ. ప్రతిరోజూ కనీసం 15 నుండి 30 నిమిషాల పాటు కపాల్‌భాతి సాధన చేయాలి. ఈ ప్రక్రియలో పొట్ట కండరాలు చురుకుగా కదలడం వల్ల అక్కడ పేరుకుపోయిన కొవ్వు వేగంగా కరగడం మొదలవుతుంది. అంతర్గత అవయవాలకు చక్కటి మసాజ్ అంది, జీర్ణక్రియ మెరుగుపడుతుంది. జీవక్రియ రేటు పెరిగి, శరీరం ఎక్కువ కేలరీలను ఖర్చు చేస్తుంది. ముఖంలో తేజస్సు కూడా పెరుగుతుంది.

అగ్నిసార్ క్రియ

పొట్ట తగ్గించడంలో బాబా రామ్‌దేవ్ సూచించిన మరో అద్భుతమైన యోగ క్రియ అగ్నిసార్ క్రియ. దీనిని ఎలా చేయాలంటే వజ్రాసనంలో లేదా నిలబడి కొద్దిగా ముందుకు వంగి, చేతులను మోకాళ్లపై ఉంచి, పూర్తిగా శ్వాసను బయటకు వదిలేయాలి. ఇప్పుడు,పొట్టను వేగంగా లోపలికి, బయటకు కదిలించాలి. శ్వాస తీసుకోకుండా వీలైనన్ని సార్లు ఈ కదలికను చేయాలి. ఆ తర్వాత నెమ్మదిగా శ్వాస తీసుకోవాలి. దీనిని ఉదయం ఖాళీ కడుపుతో చేయడం వల్ల ఉత్తమ ఫలితాలుంటాయి. ఇది శరీరంలో జీర్ణశక్తి అనే అగ్నిని ప్రజ్వరిల్లజేస్తుంది. ఉదర కండరాలు ఉత్తేజితమై, కొవ్వు కణాలు విచ్ఛిన్నమవుతాయి. శరీరం నుండి విషపదార్థాలు బయటకు పంపబడతాయి. మలబద్ధకం వంటి సమస్యలు కూడా దూరమవుతాయి.ఆసనాలతో ఆకర్షణీయమైన శరీరాకృతి

ప్రాణాయామంతో పాటు కొన్ని యోగాసనాలు కూడా పొట్టను తగ్గించి, శరీరాన్ని తీర్చిదిద్దడంలో సహాయపడతాయని బాబా రాందేవ్ సూచించారు.

త్రికోణాసనం..నడుము భాగంలోని కొవ్వును, ప్రక్కల పేరుకుపోయిన కొవ్వును తగ్గించడానికి అద్భుతంగా పనిచేస్తుంది. వెన్నెముకకు కూడా మేలు చేస్తుంది. నౌకాసనం..పడవ ఆకారంలో శరీరాన్ని ఉంచే ఈ ఆసనం, పొత్తికడుపు కండరాలను బలోపేతం చేస్తుంది. క్రమం తప్పకుండా చేస్తే,పొట్ట చదునుగా మారుతుంది.

ఆహార నియమాలు బాబా రామ్‌దేవ్ యోగా ఎంత ముఖ్యమో, ఆహార నియంత్రణ కూడా అంతే కీలకమని తెలిపారు. వేపుళ్లు, నూనె పదార్థాలు, స్వీట్లు, చక్కెర అధికంగా ఉండే పానీయాలు, మైదాతో చేసినవి, ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ వంటి వాటికి పూర్తిగా దూరంగా ఉండాలి. ఇవి కేవలం రుచిని మాత్రమే అందించి, శరీరానికి హానికరమైన కొవ్వులను, అనవసరమైన కేలరీలను అందిస్తాయి. వీటిని తినండి మొలకెత్తిన గింజలు, తాజా ఆకుకూరలు, పీచుపదార్థం ఎక్కువగా ఉండే కూరగాయలు బీన్స్, క్యారెట్, క్యాబేజీ వంటివి, జామ, బొప్పాయి, ఆపిల్ పండ్లు ఎక్కువగా తీసుకోవాలి. ఇవి జీర్ణక్రియను సులభతరం చేసి ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్న అనుభూతినిస్తాయి. యోగా, ఆహారంతో పాటు కొన్ని ఆయుర్వేద పదార్థాలు కూడా బరువు తగ్గడంలో సహకరిస్తాయని బాబా రామ్‌దేవ్ సూచిస్తారు. త్రిఫల చూర్ణం,తిప్పతీగ రసం,కలబంద రసం,ఉసిరి రసం,నిమ్మరసం–తేనె తీసుకోవడం మేలు చేస్తుందని తెలిపారు.

ఆరోగ్యకరమైన జీవనశైలి శరీర హార్మోన్లను అదుపులో ఉంచడానికి సమయానికి నిద్రపోవడం, మేల్కొనడం చాలా ముఖ్యం. ఒత్తిడి లేని జీవితం గడపడం వల్ల కూడా హార్మోన్ల సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుంది. యోగా, నిద్ర, మరియు ధ్యానం మానసిక ప్రశాంతతను అందిస్తాయి, ఇది బరువు తగ్గడానికి పరోక్షంగా సహాయపడుతుందని బాబా రాందేవ్ తెలిపారు. మీరు గనుక మీ కుండ బొడ్డును వదిలించుకోవాలనుకుంటే, కనీసం ఒక నెల పాటు ఈ పద్ధతులను నిరంతరం పాటించాలి.

## బలం, ఆరోగ్యం, రుచి.. ఒకే సున్నుండలో..ఇంట్లోనే ఈజీగా ఇలా చేసుకోండి



సున్నుండలు పేరు వింటేనే కొందరికి నోట్లో నీళ్లూరుతుంటాయి. తెలుగువారి సాంప్రదాయ పిండి వంటలలో సున్నుండలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా మినప సున్నుండలు కేవలం రుచికరమైనవే కాకుండా, ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. ఎన్నో ఏళ్లుగా మన పెద్దలు వీటిని పౌష్టికాహారంగా భావించి, పిల్లల ఎదుగుదలకు, బాలింతలకు, బలహీనంగా ఉన్నవారికి ఇచ్చేవారు. సున్నుండలను తయారుచేసుకోవడం చాలా ఈజీ. మీ ఇంట్లోనే సులభంగా మినప సున్నుండలు తయారుచేసుకోడానికి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి. కావలసిన పదార్థాలు –పొట్టు లేని మినపప్పు– 2 కప్పులు సుమారు 500 గ్రాములు –బెల్లం లేదా చక్కెర– 1.5 కప్పు –నెయ్యి – 1 కప్పు –యాలకుల పొడి – 1 టీస్పూన్ – జీడిపప్పు, బాదం పప్పు–2 టేబుల్ స్పూన్లు.

తయారీ విధానం –ముందుగా మినపప్పును ఒక మందపాటి గిన్నెలో లేదా కడాయిలో వేసి తక్కువ మంటపై బంగారు గోధుమ రంగులోకి మారే వరకు వేయించాలి. దీనికి సుమారు 10–15 నిమిషాలు పట్టవచ్చు. –వేయించిన మినపప్పును ఒక ప్లేట్‌లోకి తీసి పూర్తిగా చల్లారనివ్వాలి. –పూర్తిగా చల్లారిన మినపప్పును మిక్సీ గిన్నెలో వేసి మెత్తని పొడిలా చేసుకోవాలి. పిండి ఎంత మెత్తగా ఉంటే సున్నుండలు అంత రుచిగా ఉంటాయి. అవసరమైతే జల్లించుకోవచ్చు. –మిక్సీ పట్టిన మినపపిండిని ఒక పెద్ద గిన్నెలోకి తీసుకోవాలి. ఇప్పుడు ఈ పిండిలో బెల్లం పొడిని లేదా చక్కెరను కలపాలి. బెల్లం అయితే ముందే దాన్ని సన్నగా తురుముకోవాలి లేదా మిక్సీలో పొడి చేసుకోవాలి. ఇందులోనే యాలకుల పొడిని కూడా కలిపి అంతా బాగా కలిసేలా చేతితో కలపాలి.

తర్వాత కరిగించిన నెయ్యిని కొద్దికొద్దిగా పిండిలో పోస్తూ కలపాలి. ఒకేసారి మొత్తం నెయ్యి పోయకూడదు. –పిండిని సున్నుండలు కట్టడానికి వీలయ్యేలా నెయ్యి పోస్తూ కలపాలి. –జీడిపప్పు, బాదం పప్పు ముక్కలు వేయాలనుకుంటే వాటిని నెయ్యిలో కొద్దిగా వేయించి ఇప్పుడు పిండిలో కలుపుకోవచ్చు. –పిండి మిశ్రమం గోరువెచ్చగా ఉన్నప్పుడే సున్నుండలు చుట్టడం ప్రారంభించాలి. పూర్తిగా చల్లారిపోతే గట్టిపడి కట్టడం కష్టం అవుతుంది. –చిన్న చిన్న ఉండలుగా తీసుకుని గుండ్రంగా, గట్టిగా సున్నుండలు చుట్టాలి. మీకు నచ్చిన సైజులో చేసుకోవచ్చు. –తయారుచేసిన సున్నుండలను గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసుకోవాలి. ఇవి సుమారు 10–15 రోజుల వరకు ఫ్రెష్ గా ఉంటాయి.

## వందల ఏళ్ల నాటి చికెన్ రెసిపి..'దమ్ క ముర్గ్' ఒక్కసారి తింటే జన్మ ధన్యమే..ఎలా చేసుకోవాలంటే



భారతీయ వంటకాల గురించి మాట్లాడుకున్నప్పుడు ముఖ్యంగా మొఘలాయ్ వంటకాల గురించి ప్రస్తావన వచ్చినప్పుడు దమ్ ముర్గ్ పేరు వినిపించకుండా ఉండదు. ఈ వంటకం కేవలం ఒక ఆహార పదార్థం కాదు, అది చరిత్ర, సంస్కృతి, అద్భుతమైన రుచుల సమ్మేళనం.”దమ్” అంటే పదానికి నెమ్మదిగా ఉడికించడం అని అర్థం, “ముర్గ్” అంటే ‘కోడి’. పేరుకు తగ్గట్టే ఈ వంటకాన్ని చాలా తక్కువ మంటపై, గాలి చొరబడని పాత్రలో నెమ్మదిగా వండుతారు. ఈ పద్ధతి వల్ల కోడి మాంసం తన సహజ రసాలను నిలుపుకొని, సుగంధ ద్రవ్యాల రుచులను పూర్తిగా పీల్చుకుంటుంది. దీని ఫలితంగా కోడి మాంసం వెన్నలా మృదువుగా మారి ప్రతి ముక్కలోనూ సుగంధాల మత్తు నిండిపోతుంది.

దమ్ క ముర్గ్ తయారీకి కావాల్సిన పదార్థాలు –కోడి మాంసం: 1 కిలో –ఉల్లిపాయలు: 3–4 పెద్దవి –పెరుగు: 1 కప్పు –అల్లం–వెల్లుల్లి పేస్ట్: 2 టేబుల్ స్పూన్లు –పచ్చిమిర్చి: 3–4 –టమోటాలు: 2 –కొత్తిమీర: గుప్పెడు –పుదీనా: గుప్పెడు –నెయ్యి: 4–5 టేబుల్ స్పూన్లు –పసుపు: 1 టీస్పూన్ –కారం: 1–2 టీస్పూన్లు –ధనియాల పొడి: 2 టీస్పూన్లు –జీలకర్ర పొడి: 1 టీస్పూన్ –గరం మసాలా: 1 టీస్పూన్ –బిర్యానీ ఆకు: 2 –దాల్చిన చెక్క: 1 అంగుళం ముక్క –లవంగాలు: 4–5 –యాలకులు: 3–4 –నల్ల మిరియాలు: 1 టీస్పూన్ –జాజికాయ పొడి: 1/4 టీస్పూన్ –కుంకుమపువ్వు: కొన్ని –ఉప్పు: రుచికి సరిపడా.

దమ్ క ముర్గ్ తయారీ విధానం –చిన్న ముక్కలుగా కట్ చేసిన కోడి మాంసాన్ని శుభ్రం చేసి పెద్ద గిన్నెలో తీసుకోండి. దీనికి పెరుగు, అల్లం–వెల్లుల్లి పేస్ట్, పసుపు, కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, సగం గరం మసాలా, సగం తరిగిన కొత్తిమీర, పుదీనా, ఉప్పు వేసి బాగా కలపండి. కనీసం 1–2 గంటలు లేదా రాత్రంతా ఫ్రిజ్‌లో ఉంచండి. –ఒక మందపాటి అడుగున్న పాత్రలో నూనె లేదా నెయ్యి వేడి చేయండి. బిర్యానీ ఆకు, దాల్చిన చెక్క, లవంగాలు, యాలకులు వేసి సువాసన వచ్చేవరకు వేయించండి. తర్వాత సన్నగా తరిగిన ఉల్లిపాయలను వేసి, బంగారు రంగు వచ్చేవరకు బాగా వేయించండి. –వేగిన ఉల్లిపాయల్లో అల్లం వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిర్చి వేసి పచ్చి వాసన పోయే వరకు వేయించండి. కావాలనుకుంటే టమోటా పేస్ట్ వేసి ఆయిల్ పైకి తేలే వరకు ఉడికించండి. ఇప్పుడు మిగిలిన కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి వేసి కలిపి 2–3 నిమిషాలు వేయించండి. –మారినేట్ చేసిన కోడి మాంసాన్ని ఈ మసాలాలో వేసి మీడియం మంటపై 5–7 నిమిషాలు వేయించండి. మాంసం రంగు మారే వరకు వేయించాలి. –పాత్ర అడుగున మాడకుండా, అవసరమైతే కొద్దిగా నీరు పోయండి. సాధారణంగా పెరుగులోని నీరు సరిపోతుంది. –పాత్రపై మూత పెట్టి దాని చుట్టూ పిండితో సీల్ చేయండి. దీనివల్ల ఆవిరి బయటకు పోకుండా లోపలే ఉంటుంది. –మంటను పూర్తిగా తగ్గించి 30–45 నిమిషాలు దమ్ చేయండి. చివర్లో మూతతీసి వేడి పాలలో నానబెట్టిన కుంకుమపువ్వు, జాజికాయ పొడి, మిగిలిన గరం మసాలా, కొత్తిమీర, పుదీనా వేసి కలపండి. అంతే దీనిని వేడి వేడి దమ్ ముర్గ్ రెడీ. రోటీలు, నాన్, పరాఠా లేదా జీరా రైస్ తో కలిపి తింటే అదిరిపోతుంది.

## ఉదయాన్నే ఆరోగ్యంగా 'జొన్న ఇడ్లీ'...



జొన్న ఇడ్లీ తయారీకి కావల సిన పదార్థాలు జొన్నలు – 2 కప్పులు మినపప్పు–1 కప్పు అటు కులు (పల్చటివి) – 1/4 కప్పు (లేదా ఉడికించిన అన్నం – 1/4 కప్పు) మెంతులు – 1 టీస్పూన్ ఉప్పు – రుచికి సరిపడా నూనె – ఇడ్లీ ప్లేట్లకు అంటించడానికి జొన్న ఇడ్లీ తయారీ విధానం –జొన్న ఇడ్లీ తయారీ కోసం ముందుగా ఒక గిన్నెలో జొన్నలను శుభ్రంగా కడిగి, 4–6 గంటల పాటు లేదా రాత్రంతా నానబెట్టాలి. –మరో గిన్నెలో మినపప్పు, మెంతులను శుభ్రంగా కడిగి 4–6 గంటల పాటు లేదా రాత్రంతా నానబెట్టాలి. –అటుకులను విడిగా 15–20 నిమిషాలు నానబెట్టాలి. అటుకులకు బదులుగా ఉడికించిన అన్నం వాడుతున్నట్లయితే అన్నాన్ని నానబెట్టనవసరం లేదు. –నానబెట్టిన మినపప్పు, మెంతులను తగినంత నీటిని కలుపుతూ మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. పిండి మరీ గట్టిగా ఉండకూడదు, మరీ పల్చగా ఉండకూడదు. మధ్యస్థంగా ఉండాలి. రుబ్బిన పిండిని ఒక పెద్ద గిన్నెలోకి తీసుకోవాలి. –తర్వాత నానబెట్టిన జొన్నలను కొద్ది కొద్దిగా నీటిని కలుపుతూ రుబ్బాలి. జొన్న పిండి మినపప్పు పిండి అంత మెత్తగా రుబ్బనవసరం లేదు. కొద్దిగా రవ్వ రవ్వగా ఉన్నా పర్వాలేదు. –నానబెట్టిన అటుకులను లేదా ఉడికించిన అన్నాన్ని కూడా జొన్న పిండితో కలిపి రుబ్బవచ్చు లేదా విడిగా రుబ్బి కలుపుకోవచ్చు. –ఇప్పుడు రుబ్బిన జొన్న పిండి, మినపప్పు పిండి, అటుకుల పిండి (అన్నం పిండి) అన్నింటినీ ఒక పెద్ద గిన్నెలో వేసి బాగా కలపాలి. –కలిపిన పిండిని 8–12 గంటల పాటు లేదా రాత్రంతా వెచ్చని ప్రదేశంలో పులియబెట్టాలి. పిండి పులిసిన తర్వాత, అది కొద్దిగా ఉబ్బి, తేలికగా మారుతుంది. –పిండి పులిసిన తర్వాత రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలపాలి. ఉప్పును ముందుగానే వేయకూడదు. ఎందుకంటే అది పిండి పులియడాన్ని అడ్డుకోవచ్చు. –తర్వాత ఇడ్లీ స్టాండ్ ప్లేట్లను నూనెతో లేదా నెయ్యితో గ్రీజు చేయాలి. ఇడ్లీ స్టాండ్ పాత్రలో తగినంత నీరు పోసి వేడి చేయాలి. –ఇడ్లీ ప్లేట్లలో పిండిని స్పూన్‌తో వేయాలి. ప్లేట్లలో పిండిని మరీ నిండుగా వేయకూడదు, ఎందుకంటే అవి ఉడికేటప్పుడు ఉబ్బుతాయి. –పిండి నింపిన ఇడ్లీ ప్లేట్లను ఇడ్లీ స్టాండ్‌లో అమర్చి, స్టాండ్‌ను ఇడ్లీ పాత్రలోఉంచాలి.మూత పెట్టి మీడియం మంట మీద 10–15 నిమిషాలు ఆవిరిలో ఉడికించాలి. –ఇడ్లీలు ఉడికిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసి, 2–3 నిమిషాలు అలాగే ఉంచాలి. తర్వాత ఇడ్లీ స్టాండ్‌ను బయటకు తీసి ఒక స్పూన్ లేదా చాకు సహాయంతో ఇడ్లీలను జాగ్రత్తగా తీయాలి. –వేడి వేడి జొన్న ఇడ్లీలను పల్లి చట్నీ, కొబ్బరిచట్నీ,సాంబార్ లేదా మీకు ఇష్టమైన ఏదైనా చట్నీ లేదా కూరతో ఆస్వాదించవచ్చు.

# అతిపెద్ద పార్టీగా టివికెను ఆహ్వానించాలి

మొదటిపేజీ తరువాయి

చేయాలంటే ఉండాల్సిన సంఖ్యాబలంపై గవర్నర్.. విజయ్‌కు మార్గనిర్దేశర చేశారు. కేవలం అతిపెద్ద పార్టీగా ఉండటమే కాకుండా, సభలో తగినంత మంది ఎమ్మెల్యేల మద్దతు ఉన్నట్లు ఆధారాలు చూపాలని సూచించారు. మరోవైపు, అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకే అధినేత విజయ్‌కే ప్రభుత్వం ఏర్పాటు చేసే మొదటి అవకాశం ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి. శణ్ముగం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో పలు కీలక అంశాలను లేవనెత్తారు. 234 స్థానాలున్న అసెంబ్లీలో ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాలేదని, అయితే 108 మంది ఎమ్మెల్యేలతో టీవీకే అతిపెద్ద పార్టీగా నిలిచిందని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం విజయ్ మాత్రమే ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ముందుకు వచ్చారని, మరే ఇతర కూటమి హక్కు కోరనప్పుడు గవర్నర్ ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. గవర్నర్ వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం గవర్నర్ వ్యవస్థను వాడుకుంటోందని సీపీఎం తీవ్రంగా ఆరోపించింది. విజయ్‌కు కేవలం సీపీఎం మాత్రమే కాకుండా, ఇతర పార్టీల నుంచి కూడా మద్దతు లభిస్తోంది. సిపిఐ తదితర పార్టీలు కూడా ప్రజా తీర్పును గౌరవించి విజయ్‌కు అవకాశం ఇవ్వాలని కోరుతున్నాయి. కాంగ్రెస్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, తమిళనాడు ప్రజల తీర్పును గౌరవించాలని హితవు పలికింది. 118 సీట్ల మెజారిటీ మార్కును అందుకోవడానికి టీవీకేకు ఇంకా మరో 10 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ఒకవేళ కాంగ్రెస్ (5 సీట్లు), సీపీఎం, సీపీఐ, వీసీకే వంటి పార్టీలు అధికారికంగా మద్దతు లేఖలు అందజేస్తే విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు మార్గం సుగమం అవుతుంది. అప్పటి వరకు తమిళ రాజకీయాల్లో ఈ ఉత్కంఠ కొనసాగుతూనే ఉంటుంది.

# పదేళ్ల బిఆర్ఎస్ కన్నా రెండేళ్ల కాంగ్రెస్ బెటర్

మొదటిపేజీ తరువాయి

ఇచ్చారని ప్రస్తావించారు. యుద్ధం వల్ల యూరియా ఆగిపోయినా మన రైతులకు యూరియా అందించామని మంత్రి తుమ్మల తెలిపారు. యూరియాపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు. ఎన్ని కష్టాలు ఉన్నా రూ.లక్షకోట్లను రైతుల కోసం ఖర్చుపెట్టామని తెలిపారు. కేసీఆర్ హయాంలోని అవినీతి, అహంకారాన్ని రైతులు ఎప్పటికీ మరచిపోరని చెప్పుకొచ్చారు. కాకతీయుల గడ్డపై కేటీఆర్, తదితరులు చేసిన ప్రసంగాన్ని ప్రజలంతా అసహ్యించుకుంటున్నారని విమర్శించారు. మొక్కజొన్నలు కొనే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. ధాన్యం, మొక్కజొన్నలు వీలైనంత త్వరగా కొనుగోలు చేయాలని వేదికపైనే కలెక్టర్లను ఆదేశిస్తున్నానని అన్నారు. దేశంలో రైతులకు యూరియా అందించిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని మంత్రి తుమ్మల తెలిపారు. రైతులకు సంబంధించిన అంశంలో వెనకడుగు వేయబోమని అన్నారు. బీఆర్ఎస్ నేతలు కొంతమంది తనను అవమానపరచాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. అన్నదాతలు పంట మార్పిడి చేయాలని, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిశానిర్దేశర చేశారు. రైతుల ఖాతాల్లో కాంగ్రెస్ సర్కార్ రూ.21 వేల కోట్లను జమ చేసింది. రూ.లక్ష రుణమాఫీని కేసీఆర్ పదేళ్లలో ఏనాడూ పూర్తి చేయలేదు. రుణమాఫీకి బీఆర్ఎస్ ఐదేళ్ల సమయం తీసుకోవడంతో.. వాళ్లిచ్చింది వడ్డీలకు కూడా సరిపోలేదు. ఒక్క రైతుబంధు ఇచ్చి.. మిగతా పథకాలన్నింటినీ నిలిపివేశారు. బీఆర్ఎస్ అహంకార వైఖరిని ప్రజలు ఇంకా మర్చిపోలేదు. మళ్లీ ఆ పార్టీకి అధికారం ఇచ్చేందుకు రైతులు సిద్ధంగా లేరు. ఇవాళ రైతులకు అప్పులు తక్కువున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందుందని తుమ్మల తెలిపారు.

# వడ్డీలేని రుణాలు 5 నుంచి పది లక్షలకు పెంపు

మొదటిపేజీ తరువాయి

న్నతి.. తెలంగాణ ప్రగతి అన్న నినాదంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం యజ్ఞంలా తామంతా పని చేస్తున్నామని వివరించారు. మహిళలు పేదరికం నుంచి బయటపడినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అందుకే వడ్డీ లేని రుణాలు ఇప్పించి ఆర్థికంగా మహిళలను ఎదిగేలా చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో తాము పనిచేస్తున్నామని తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. 40 శాతం పంట కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పగించామని గుర్తు చేశారు. ఏడాది రూ. 26 వేల కోట్లకు పైగా మహిళలకు బ్యాంకు రుణాలుగా అందిస్తున్నట్లు మంత్రి సీతక్క వివరించారు. మహిళల ఆర్థిక సాధికారతలో ఇది ఒక మైలురాయి అని అభివర్ణించారు. ఇది లక్షలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. గతంలో మహిళలకు పట్టుమని రూ. పది వేల లోన్ ద్వారా లభించేవి కాదన్నారు. ఇప్పుడు అదే మహిళలకి బ్యాంకులు లక్షలాది రూపాయలు లోన్ రూపంలో అందిస్తున్నాయని వివరించారు. పేదరికం వల్లే తాను నక్సలైట్లలో చేరానని ఈ సందర్భంగా సీతక్క గుర్తు చేసుకున్నారు. వడ్డీ వ్యాపారుల దోపిడి కారణంగా సామాన్యులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి బాధ చూడ లేక తాను తుపాకీ పట్టానని వివరించారు. ఆ అనుభవంతోనే మహిళలకు వడ్డీ లేని రుణాలు కల్పించాలనే సంకల్పంతో తాము పని చేస్తున్నామని మహిళా స్వయం సహాయక బృందాలకు మంత్రి సీతక్క తెలిపారు. నిర్మల్ జిల్లా జీరో ఎన్‌పీఏ సాధించిందని మంత్రి సీతక్క గుర్తు చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ విజయలక్ష్మిని మంత్రి సీతక్క అభినందించారు. నిర్మల్ జిల్లా తరహాలోనే అన్ని జిల్లాలు వంద శాతం బ్యాంకులకు రీపేమెంట్ చేయాలని సూచించారు. బ్యాంకర్ల నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిలబెట్టాలని మహిళా సంఘాలకు మంత్రి స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు సరళమైన పద్ధతిలో లోన్లు ఇవ్వాలని ఈ సందర్భంగా బ్యాంకర్లకు మంత్రి సూచించారు. బ్యాంకులకు తాము గ్యారెంటీ ఇస్తున్నామని చెప్పారు. పూర్తిస్థాయిలో రీపేమెంట్ చేసే బాధ్యత తమదన్నారు. వ్యక్తులకు లోన్ ఇస్తే ఎగ్గొట్టే ప్రమాదం ఉంటుందని.. అదే మహిళా శక్తికి సహకరిస్తే మీ నగదుకు భద్రత లభిస్తుందని మంత్రి సీతక్క తెలిపారు.

# డ్రగ్స్ కట్టడి చేయడమే తొలి ప్రాధాన్యం

మొదటిపేజీ తరువాయి

యాక్ట్ తరహా చట్టాన్ని ఉపయోగిస్తామన్నారు. రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గురువారం తొలిసారిగా ఈగల్ ఫోర్స్‌పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలోని 35 విభాగాలపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. నార్కోటిక్స్‌పై అలర్ట్‌గా ఉన్నామని.. డ్రగ్స్ కట్టడి చేయడంలో మొదటి ప్రాధాన్యతతో ఉన్నామన్నారు. రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా జరిగిన ఆపరేషన్‌పై ఈ సమీక్షలో చర్చించామని వివరించారు.

# గంగుల కార్యాలయం, కౌశిక్ రెడ్డి కారుపై దాడి

మొదటిపేజీ తరువాయి

వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. దాడులను తీవ్రంగా ఖండించారు. పట్టపగలు గూండాల్లా వచ్చి వాహనాలు, ఆఫీసుపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఈ పిరికిపంద చర్యలకు ఉసిగొల్పుతున్నారంటూ బండి సంజయ్‌పై మాజీ మంత్రి ఫైర్ అయ్యారు. 'ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో పాటు కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ అనుచరుల హేయమైన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. దాడి జరిగిన వెంటనే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డితో మాట్లాడాం. పట్టపగలు గుండాల మాదిరిగా క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశించి వాహనాలను, ఆఫీసును ధ్వంసం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య. కళ్లముందే ఇంత అరాచకం సృష్టిస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తూ చోద్యం చూడటం సిగ్గుచేటు. సీఎం రేవంత్‌కు బీ–టీంగా మారిన బండి సంజయ్.. బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఈ పిరికిపంద చర్యలకు ఉసిగొలుపుతున్నారు. ప్రతిసారి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు కుప్పిగంతులు వేయడం తప్ప కరీంనగర్ ప్రజలకు బండి సంజయ్ చేసిందేమీ లేదు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉండి తన అనుచరులతోనే శాంతి భద్రతలను దెబ్బతీసేలా వ్యవహరించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. జై తెలంగాణ' అంటూ కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బండి సంజయ్ అనుచరుల దాడిని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. కరీంనగర్ పట్టణంలో బీజేపీ గుండాలు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై కర్రలు, రాడ్లతో దాడి చేసి కిటికీల అద్దాలు పగులగొట్టారని తెలిసిందే. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్ ముగిసిన 10 నిమిషాలకే బీజేపీ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడి కౌశిక్ రెడ్డి వాహనం ధ్వంసం చేశారు. కౌశిక్ రెడ్డిపై సైతం దాడికి యత్నించారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ ఎమ్మెల్యే పార్టీ కౌశిక్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి నాయకులు, కార్యకర్తల యోగక్షేమాల అడిగి తెలుసుకున్నారు. ఏకంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే, ఆయన అనుచరులు దాడి చేయడం అత్యంత దురదృష్టకరమని కేటీఆర్ అన్నారు. దాడులకు పాల్పడిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# విజయ్‌ను అడ్డుకుంటున్న కేంద్రం

మొదటిపేజీ తరువాయి

తమిళనాడులో వచ్చిన తీర్పు విజయ్ నాయకత్వానికి ప్రజల మద్దతును స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఠాగూర్ పేర్కొన్నారు. గవర్నర్ వెంటనే విజయ్‌ని ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఆహ్వానించాలని, సభలో తన మెజారిటీని నిరూపించుకోవడానికి అనుమతించాలని ఆయన డిమాండ్ చేశారు. 'తమిళనాడులో ప్రజలు మార్పు కోసం ఓటు వేశారని మనందరికీ తెలుసు.. ప్రజలు ఒక కొత్త నాయకుడి కోసం ఓటు వేశారు. ఆ పార్టీ నుంచి 108 మంది సభ్యులు ఎన్నికయ్యారు'. అని ఠాగూర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతుతో బలం 113కు చేరిందని, 234 మంది సభ్యులున్న అసెంబ్లీలో మెజారిటీ మార్కుకు కేవలం కొన్ని సీట్ల దూరంలోనే ఉందని ఆయన గుర్తుచేశారు.'గవర్నర్ బీజేపీకి చెందిన వ్యక్తి.. ఆయన గతంలో బీజేపీలో పనిచేశారు. ఆయనకు బీజేపీ మనస్తత్వం ఉందని మనందరికీ తెలుసు. విజయ్‌ను ముఖ్యమంత్రిని చేయకూడదన్నదే 'ఢిల్లీ' ఆలోచన'. అని ఆయన ఆరోపించారు. గవర్నర్‌పై బీజేపీ నాయకత్వం నుంచి ఒత్తిడి ఉందని ఠాగూర్ అన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో కేవలం ఒక్క ఎమ్మెల్యే మాత్రమే ఉన్నప్పటికీ, బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ప్రక్రియను ఆలస్యం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. రాజ్యాంగ సంప్రదాయాలు, ప్రజాస్వామ్య నిబంధనలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా విజయ్‌ను సభలో బలాన్ని నిరూపించుకునే అవకాశం కల్పించాలని కాంగ్రెస్ ఎంపీ సూచించారు. 'విజయ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి త్వరగా ఆహ్వానించాలని, సభలో బలాన్ని నిరూపించుకోవడానికి అనుమతించాలని భావిస్తున్నా.. అదే న్యాయం.' అని ఠాగూర్ అన్నారు.

# గవర్నర్ తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి

ఆందోళనలకు పిలుపునిచ్చింది. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ గవర్నర్ నిర్ణయాన్ని నిరసిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. నేడు చెన్నైలోని గవర్నర్ అధికారిక నివాసం లోక్ భవన్‌ను ముట్టడించాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చింది. కేవలం చెన్నైలోనే కాకుండా, రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో భారీ ఎత్తున ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రజలు ఇచ్చిన తీర్పును గవర్నర్ కాలరాస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కాంగ్రెస్ ఈ నిరసనలకు శ్రీకారం చుట్టింది. గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ తీరు కేవలం కాలయాపన చేయడమే నని కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. 108 సీట్లతో అతిపెద్ద పార్టీగా ఉన్న టివికెకి, కాంగ్రెస్ (5 సీట్లు) వామపక్షాల మద్దతు కలిపితే మెజారిటీకి చేరువలో ఉన్నామని, ఈ తరుణంలో ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించకపోవడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆరోపిస్తున్నారు. 'ప్రజలు మార్పును కోరుకున్నారు, కానీ గవర్నర్ మాత్రం ఢిల్లీ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు' అని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. కాంగ్రెస్ పిలుపుతో తమిళనాడులో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇప్పటికే టివికె కార్యకర్తలు ఆందోళనలో ఉండగా, ఇప్పుడు కాంగ్రెస్ కూడా తోడవడంతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. సీపీఎం, సీపీఐ పార్టీలు కూడా ఈ ఆందోళనలకు మద్దతు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. అతిపెద్ద పార్టీగా ఉన్న టీవీకే అధినేత విజయ్‌ను వెంటనే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించాలని కాంగ్రెస్, వామపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. గవర్నర్ వ్యవస్థను ఉపయోగించుకుని బీజేపీ రాష్ట్రంలో అస్థిరత సృష్టించాలని చూస్తోందని.. అందుకోసమే, నేటి ఉదయం నుంచే తమిళనాడులోని అన్ని ప్రధాన పట్టణాల్లో కాంగ్రెస్ శ్రేణులు రోడ్ల మీదకు రానున్నాయని కాంగ్రెస్ ప్రకటించింది.

# ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు

మొదటిపేజీ తరువాయి

తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం పేదల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. ఇల్లు, భూమి ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవానికి ప్రతీకని పేదవాడికి భద్రమైన భవిష్యత్తు కల్పించడమే ప్రభుత్వ సంకల్పం అని మంత్రి పేర్కొన్నారు. పేదల జీవితాల్లో గౌరవప్రదమైన మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రజాప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు అనే మహత్తర కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. పథకం కింద పేద కుటుంబాలకు వారి సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం కోసం ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. దాదాపు 4 లక్షల ఇళ్లను మంజూరు చేసి, రాష్ట్రవ్యాప్తంగా గృహ విప్లవానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. హౌసింగ్, రెవెన్యూ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో జరుపుతున్న సమీక్షలో భాగంగా గురువారం హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారాలతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నల్గొండ ఇన్ ఛార్జి మంత్రి ఎస్సీ ,ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్, వాకాటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ జి. చిన్నా రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు జితేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో క్షేత్ర స్థాయిలోని పరిస్థితులపై స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయంతో వ్యవహరించాలని, జిల్లా స్థాయిలో అధికారయంత్రాగమంతా సమన్వయంతో పనిచేస్తే అక్కడికక్కడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో అత్యధిక శాతం అధికారాలను కలెక్టర్లకే దఖలు పరిచామన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఒకసారి ప్రొసీడింగ్స్ ఇచ్చి, మొదటి బిల్లు వారి ఖాతాల్లో జమ అయిన లబ్దిదారులందరికీ తదుపరి విడతల బిల్లులన్నిటిని సకాలంలోనే విడుదలయ్యేలా చూడాలని మంత్రిగారు కలెక్టర్లను ఆదేశించారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఎటువంటి అక్రమాలకు తావివ్వకుండా, పూర్తి పారదర్శకంగా జవాబుదారీ తనంతో పనిచేస్తూ అర్హులైన వారికే ఫలాలు దక్కేలా చూడాలని ఈ విషయంలో ఎక్కడ పొరపాటు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం సేకరించి పూర్తి స్థాయిలో వినియోగించకుండా మిగిలి ఉన్న భూముల్లో అర్హులైన వారికి ఇండ్ల పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇల్లు మంజురైనా వివిధ కారాణలతో నిర్మాణాలను పూర్తి చేయని వారికి కూడా వెసులుబాటు కల్పించే యోచనలో ఉన్నామని తెలిపారు. ముఖ్యంగా జిల్లాల్లో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరక్టర్లు పూర్తి బాధ్యతాయుతంగా విధులను నిర్వహించాలని, లబ్దిదారులు, ఉన్నతాధికారుల మధ్య సమన్వయకర్తలుగా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని , ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అలాగే డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణపు పనులు ఏ స్థాయిలో ఉన్నా, ఈ నెల 20 వ తేదీలోగా లబ్దిదారుల ఎంపికను పూర్తి చేయాలని, ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు కూడా చొరవ చూపాలని మంత్రి పొంగులేటి సూచించారు. అర్హులైన పేదలనే లబ్దిదారులుగా ఎంపిక చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ కార్యాలయాలన్నింటిని ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశాల్లో నెలకొల్పేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అలాగే లక్షకు పైగా జనాభా ఉన్న మండలాల్లో, అవసరానికి అనుగుణంగా, అదనంగా మరో తహశీల్దార్‌ను నియమించనున్నామని మంత్రి తెలిపారు. ఇందుకు సంబంధించిన జిల్లా కలెక్టర్లు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. రెవెన్యూ, అటవీ తదితర శాఖల మధ్య ఉన్నభూ వివాదాల సమస్య కు శాశ్వత పరిష్కారం కోసం ఆయా విభాగాలు ఉమ్మడిగా సర్వే చేయడమే మార్గమన్నారు. ఈ దిశలో మరింత వేగవంతమైన చర్యలు తీసుకోవాలని అటవీ, రెవెన్యూ అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేనట్లుగా రెవెన్యూ విభాగంలో అనేక సంస్కరణలు తీసుకుని వచ్చి ఆర్డీవోలకు విస్తృతమైన అధికారాలు కల్పించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాకుండా, ఇతర ప్రయోజనాలకు వీటిని వినియోగిస్తే అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ పరిపాలనను బలోపేతం చేయడంలో భాగంగా సర్వే, సెటిల్మెంట్స్ మరియు భూ రికార్డుల శాఖ ద్వారా సమగ్ర సంస్కరణలు అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. భూ రికార్డుల్లో పారదర్శకత, ఖచ్చితత్వం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. పేదలకు న్యాయం జరిగేలా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు.

# కరీంనగర్‌లో దాడులతో ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి

చేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కార్యాలయంలోకి బీజేపీ శ్రేణులు చొచ్చుకెళ్లారు. ఇరు పార్టీలకు చెందిన కార్యకర్తలు పరస్పరం దాడులు చేసుకున్నారు. బీజేపీ కార్యకర్తలపై బీఆర్ఎస్ శ్రేణులు కర్రలతో దాడి చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు పరిస్థితిని అదుపు చేసేందుకు కార్యకర్తలపై లాఠీఛార్జ్ చేశారు. బీజేపీ శ్రేణులను అరెస్ట్ చేసి.. పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ కార్యకర్తలను క్యాంప్ కార్యాలయానికి తరలించి, గేట్లు మూసేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై కౌశిక్ రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో బీజేపీ శ్రేణులు ఆగ్రహానికి గురయ్యారు. గురువారం ఉదయం కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంతో పాటు పాడి కౌశిక్‌రెడ్డి కారు అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు.. బీజేపీ శ్రేణులను చెదరగొట్టారు. భారీ బందోబస్తు నడుమ కౌశిక్ రెడ్డిని కరీంనగర్ నుంచి హుజురాబాద్‌కు తరలించారు. హుజురాబాద్ క్యాంప్ కార్యాలయంలో కార్యకర్తలతో ఎమ్మెల్యే మాట్లాడుతున్న సమయంలో బీజేపీ శ్రేణులు ఒక్కసారిగా లోపలికి దూసుకొచ్చే ప్రయత్నం చేశారు. కౌశిక్ రెడ్డి క్యాంప్ కార్యాలయంపై దాడికి యత్నించారు. దీంతో వారిని బీఆర్ఎస్ కార్యకర్తలు, కౌశిక్ రెడ్డి అనుచరులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు ఉండగానే బీజేపీ శ్రేణులు చొచ్చుకురావడంతో కౌశిక్ రెడ్డి అనుచరులు వారిపై కర్రలతో దాడి చేశారు. దీంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

# రేవంత్‌తో బండి సంజయ్ మిలాఖత్

మొదటిపేజీ తరువాయి

ఎక్కడివని ఎమ్మెల్యే ప్రశ్నించారు. బండి సంజయ్‌కు రేవంత్ రెడ్డి డబ్బులు పంపిస్తు న్నారని ఆరోపించారు. కేటీఆర్‌ను విమర్శించే స్థాయి కేంద్ర మంత్రికి లేదన్నారు. బండి సంజయ్‌కు దమ్ముంటే కేటీఆర్‌తో చర్చకు రావాలని సవాల్ విసిరారు. కేటీఆర్‌ను ఇష్టం వచ్చినట్టు తిడితే ఊరుకునేది లేదన్నారు. బండి సంజయ్‌ను కూడా తాము తిట్టగలమని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# తమిళనాట కొనసాగుతున్న ఉత్కంఠ

మొదటిపేజీ తరువాయి

సహకరించే అవకాశంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఇద్దరేసి ఎమ్మెల్యేలున్న వీసీకే, సీపీఐ సానుకూలంగా స్పందించినా, ఇంకా అధికారికంగా చెప్పలేదు. టీవీకేకు తొలుత అవకాశం ఇవ్వాలనే అభిప్రాయాన్ని డీఎంకే కూడా వ్యక్తం చేసింది. ప్రొటోకాల్ ప్రకారం తమిళనాడు ముఖ్యమంత్రికి అందించే పోలీసు కాన్వాయ్‌ను విజయ్ నిరాకరించారు. ప్రమాణస్వీకారానికి ముందే ఆ ఏర్పాటు తనకు వద్దని విజయ్ చెప్పినట్లు టీవీకే వెల్లడించింది. తమిళనాడులో టీవీకే నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధం నెలకొనడంతో ఆయన కాన్వాయ్‌ను వెనక్కి తీసుకున్నారంటూ వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. గురువారం పార్టీ నుంచి వచ్చిన స్పందనను పోలీసు అధికారులు కూడా ధ్రువీకరించారు. తమిళనాడు ఎన్నికల ఫలితాల అనంతరం ప్రొటోకాల్ ప్రకారం అందించిన సీఎం కాన్వాయ్ వాహనాలను విజయ్ తిరిగి ఇచ్చేశారని, తాము ఉపసంహరించుకోలేదని పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. అలాగే ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. మే 4న ఫలితాల తర్వాత నాలుగు కాన్వాయ్ వాహనాలను పోలీసు శాఖ అందించింది.

# బెంగాల్ అసెంబ్లీ రద్దు

మొదటిపేజీ తరువాయి

నేతను ఎమ్మెల్యేలు ఎన్నుకోనున్నారు. అసెంబ్లీ రద్దుతో మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని గవర్నర్ రవి బర్తరఫ్ చేసినట్లు అయింది. రాజీనామా చేసేది లేదని ఇటీవల మమతా బెనర్జీ ప్రకటించారు. దీంతో ఈ చర్య అనివార్యమయ్యింది. లేకుంటే రాజ్యాంగ పరంగా చిక్కులు వచ్చేవి. 294 స్థానాలు ఉన్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి రెండు విడతలుగా ఎన్నికలు జరిగాయి. మే 4వ తేదీన ఈ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో అధికారాన్ని బీజేపీకి కట్టబెట్టారు. దీంతో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్పష్టమైన మెజార్టీ ఇచ్చారు. దీంతో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బీజేపీ అగ్రనేతలు ముహూర్తం ఖరారు చేశారు. మే 9వ తేదీ ఉదయం10 గంటలకు ప్రతిష్టాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని పశ్చిమ బెంగాల్ బీజేపీ చీఫ్ సమీక్ భట్టాచార్య ప్రకటించారు. మరోవైపు ముఖ్యమంత్రి అభ్యర్థిపై పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీపై ఘన విజయం సాధించిన సువేందు అధికారిని ముఖ్యమంత్రిగా నియమిస్తారనే ప్రచారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతోంది. ఇంకోవైపు ఈ ఎన్నికల్లో ఓటమి పాలవడంతో ఎన్నికల సంఘంపై మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. అసలు విలన్ ఈసీ అంటూ మండిపడ్డారు. ముఖ్యమంత్రి పదవికి తాను రాజీనామా చేసే ప్రసక్తే లేదంటూ ఆమె భీష్మించుకున్నారు. బెంగాల్ అసెంబ్లీ కాలపరిమితి గురువారంతో ముగిసింది. అయినా సీఎం పదవికి మమతా బెనర్జీ రాజీనామా చేయకపోవడంతో గత ప్రభుత్వాన్ని రద్దు చేస్తున్నట్లు గవర్నర్ ఆర్.ఎన్.రవి ప్రకటించారు.

# కొండా సురేఖ వ్యాఖ్యలు అభ్యంతరకరం

మొదటిపేజీ తరువాయి

ఏబీవీపీలో ఉన్నప్పుడు జై శ్రీరాం అన్నారని ప్రస్తావించారు. మరి ఇప్పుడు తన మంత్రికి జై శ్రీరాం గురించి నేర్పించలేదా..? అని నిలదీశారు. జై శ్రీరాం అంటే కొండంత బలం వస్తోందని...కానీ అనుచితంగా మాట్లాడితే మంత్రి పదవి పోతుందని ఆమెకు చెప్పాలని అన్నారు. తెలంగా ణలో దేవుడి భూముల అమ్మకాలు, కబ్జాలు ఎలా జరుగుతు న్నాయో చూస్తున్నామని అన్నారు. ఈ విషయంలో కొండా సురేఖ ఎలాంటి చర్యలు చేపట్టారు...? అని రాజాసింగ్ ప్రశ్నించారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీలో దేవుడి భూములను ఎంఐఎం నేతలు కబ్జా చేశారని ఆరోపించారు. దేవాదాయ శాఖ అధికారులు వారితో కుమ్మక్కై కమిషన్లు తీసుకుంటున్నారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కి దేవాలయాల అభివృద్ధి మీద ధ్యాస లేదని ఆగ్రహించారు. ఎంఐఎం నేతలిచ్చే కమిషన్ల మీదనే ఈ మంత్రికి ధ్యాస ఉందని ఎద్దేవా చేశారు. రాముడి నామాన్ని ఎదిరించడానికి సాహసించేవారు.. ఎవరైనా గాల్లో కొట్టుకుపో తారని విమర్శిం చారు. సీఎం రేవంత్‌రెడ్డి, దయచేసి మీ దేవాదాయ శాఖ మంత్రిని పిలిపించి రాజీనామా చేయించాలని హితవు పలికారు. లేకపోతే మీరు కూడా కేసీఆర్ లాగా మునిగిపోతారని రాజాసింగ్ విమర్శించారు.

# మోడీ సభను జయప్రదం చేయండి

## బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు పిలుపు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 7 : సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండులో ఈ నెల 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభను జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు బాణావత్ విజయ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సన్నాహక సమావే శానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాఘవరావు మాట్లాడుతూ, మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మోడీ తొలిసారిగా తెలంగాణకు రానుండటం విశేషమన్నారు. ఈ పర్యటనలో దాదాపు రూ.8 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు రెండు లక్షల మందికి పైగా ప్రజలు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో బీజేపీ విజయం సాధించడం ఆనందకరమని, ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో సాధించిన విజయాన్ని చారిత్రాత్మకమని అభివర్ణించారు. కేంద్ర నాయకత్వం తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించిందని, రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి రావడమే లక్ష్యంగా రాష్ట్ర నాయకత్వానికి మార్గదర్శనం చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో భారీ ఎత్తున జరుగుతున్న మోడీ బహిరంగ సభకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సుదర్శన్ మిశ్రా, మాజీ మండల అధ్యక్షుడు పాలకొల్లు శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శులు మంద శివ యాదవ్, నాగమౌనిక, సాయి యాదవ్, సుబ్రమణ్యం, అశోక్, పెద్ది రాజు, ఎస్‌కే రహీమ్ తుల్ల, మన్నేని నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# విపత్తుల నిర్వహణలో శాఖల సమన్వయం కీలకం...

## రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ కార్యదర్శి డి.హరిచందన



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, మే 7 : విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ కార్యదర్శి డి. హరిచందన సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా యంత్రాంగంతో కలిసి ఆమె మాట్లాడారు. మే 15న నిర్వహించనున్న టేబుల్‌టాప్ ఎక్సర్‌సైజ్, మే 18న రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న మాక్ డ్రిల్స్‌పై సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వరదలు, పారిశ్రామిక ప్రమాదాలు, అటవీ అగ్ని ప్రమాదాలు వంటి విపత్తులను ఎదుర్కొనేందుకు మాక్ డ్రిల్స్ ఎంతో కీలకమని తెలిపారు. 2025లో నిర్వహించిన మాక్ డ్రిల్స్ వల్ల శాఖల మధ్య సమన్వయం మెరుగుపడటంతో పాటు, విపత్తుల సమయంలో వేగవంతమైన ప్రతిస్పందన సాధ్యమైందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ఉన్న లోపాలను గుర్తించడమే కాకుండా, శాఖలు తమ ప్రణాళికలను మరింత పటిష్టం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ మాట్లాడుతూ, మే 18న నిర్వహించనున్న మాక్ డ్రిల్స్‌లో సుమారు 60 శాఖలు, కేంద్ర సంస్థలు పాల్గొంటాయని తెలిపారు. 2026లో వరదలపై 13 జిల్లాల్లో, పారిశ్రామిక ప్రమాదాలపై 5 జిల్లాల్లో, అటవీ అగ్ని ప్రమాదాలపై 4 జిల్లాల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అన్ని శాఖలు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. న్యూఢిల్లీ నుండి వర్చువల్‌గా పాల్గొన్న జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ సుధీర్ బేహల్ (రిటైర్డ్) విపత్తుల సమయంలో కేంద్ర, రాష్ట్ర సంస్థల బాధ్యతలపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. శాఖల మధ్య సమన్వయం, ఇన్సిడెంట్ రెస్పాన్స్ సిస్టమ్, ఉపశమన శిబిరాల ఏర్పాటు, ఆసుపత్రుల సిద్ధత, అటవీ అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై కీలక సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆర్డీఓ హరికృష్ణ, జిల్లా అగ్నిమాపక అధికారి సతీష్ కుమార్, ఏఎస్పీ నరేశ్ కుమార్, డీఈఓ రాజేందర్, ఏఎంవీఐ సుందర్, కలెక్టరేట్ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# పేదరికాన్ని జయించి 'డాక్టర్'గా నిలిచిన చైతన్య సాయి

## - డీసీఎం డ్రైవర్ కుమారుడి అద్భుత విజయం - ప్రభుత్వ పాఠశాల నుంచి మెడికల్ కాలేజ్ వరకూ ప్రస్థానం - తల్లిదండ్రుల త్యాగానికి ప్రతిఫలం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 7 : పేదరికం చదువుకు అడ్డంకి కాదని, కష్టపడి చదివే తపన ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని ఖమ్మం యువకుడు నామవరపు చైతన్య సాయి తన విజయంతో నిరూపించాడు. డీసీఎం డ్రైవర్ కుమారుడిగా సాధారణ కుటుంబంలో జన్మించిన ఈ యువకుడు పట్టుదలతో చదివి డాక్టర్‌గా అవతరించి అందరికీ స్ఫూర్తిగా నిలిచాడు. ఖమ్మం నగరంలోని జహీర్‌పుర, గుట్టల బజార్ ప్రాంతానికి చెందిన చైతన్య సాయి, కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం పరిధిలోని మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మెడిసిన్ పూర్తి చేసి బుధవారం డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. దీంతో తన తల్లిదండ్రుల కలను సాకారం చేశాడు. తల్లి రేణుక గృహిణిగా, తండ్రి కోటయ్య డీసీఎం డ్రైవర్‌గా కష్టపడుతూ కుమారుడి చదువుకోసం ఎన్నో త్యాగాలు చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తూ "చదువే భవిష్యత్తు" అనే నమ్మకంతో ముందుకు నడిపించారు. చిన్నప్పటి నుంచే మెరిట్ విద్యార్థిగా గుర్తింపు పొందిన చైతన్య సాయి, క్రమశిక్షణతో చదువుకుంటూ ప్రతి దశలోనూ ప్రతిభ కనబరిచాడు. దళిత కుటుంబానికి చెందిన అతను ఎన్నో సవాళ్లను ఎదుర్కొని మెడికల్ సీట్ సాధించడం విశేషం.



అనంతరం మెడిసిన్ పూర్తి చేసి డాక్టర్‌గా అవతరించడంతో కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. తన కుమారుడు డాక్టర్ కావడం చూసి తల్లిదండ్రులు భావోద్వేగానికి గురయ్యారు. గుట్టల బజార్ ప్రాంతంలోనూ సంబరాలు జరిగాయి. స్థానికులు, బంధువులు, స్నేహితులు చైతన్య సాయిని అభినందిస్తూ అతని విజయాన్ని కొనియాడారు. "పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు" అనే సందేశాన్ని చైతన్య సాయి తన జీవితంతో చాటి చెప్పాడు. నేటి యువతకు ఆయన ప్రయాణం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా నామవరపు సైదమ్మ, కొత్తపల్లి వీరమణి, కుక్కల వసంత, కొత్తపల్లి ప్రసాద్, కొత్తపల్లి మేఘన, కొత్తపల్లి సంధ్య, హనీ తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

# మొక్కజొన్న కొనుగోలు చేయాలని రోడ్డుపై బైఠాయించిన రైతులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, మే 7 : మొక్కజొన్నలను తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల కేంద్రంలో రైతులు గురువారం ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. కొనుగోలు కేంద్రాల్లో గత నాలుగు రోజులుగా మొక్కజొన్న కొనుగోళ్లు నిలిచిపోయాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తీవ్ర ఎండల మధ్య పంటను నిల్వ చేయలేక రైతులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టేకులపల్లిలో గోడౌన్ సౌకర్యం లేకపోవడంతో కొనుగోళ్లు నిలిపివేసి, కారేపల్లికి తరలించాలని సూచించడం వల్ల దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. దీంతో రవాణా భారంతో పాటు ఎండలో మరింత ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందని చెప్పారు. రోడ్డుపై ధర్నా చేపట్టడంతో కొత్తగూడెం–ఇల్లెందు ప్రధాన రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించినప్పటికీ రైతులు ఆందోళనను కొనసాగించారు. అనంతరం టేకులపల్లి ఎస్సై ఆలకుంట రాజేందర్ సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు. తర్వాత మార్కెట్ యార్డులో తహసీల్దార్ ఎల్. వీరభద్రం, వ్యవసాయ అధికారి అన్నపూర్ణ, బేతపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్ రైతులతో చర్చించారు. కొనుగోలు చేసిన మొక్కజొన్నను కారేపల్లి గోదాములో నిల్వ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లారీలు అందుబాటులో లేకపోవడంతో సమస్య తలెత్తిందని, రెండు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని అధికారులు హామీ ఇచ్చారు. అప్పటివరకు మార్కెట్‌కు వచ్చిన మొక్కజొన్నను కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.



# గ్రామాల అభివృద్ధిలో ఎంపీడీవోల పాత్ర కీలకం

## - క్షేత్రస్థాయిలో నిత్యం తనిఖీలు నిర్వహించాలి - జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 07 : గ్రామాల అభివృద్ధిలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారుల పాత్ర కీలకం అని, ప్రతిరోజు క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులు,సానిటేషన్, త్రాగునీరు సరఫరా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాల అమలు, పెన్షన్ పరిశీలన ఆమోదం,ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతి, ఓవర్ వాటర్ హెడ్ ట్యాంకర్, పరిశుభ్రత, మిషన్ భగీరథ నీరు సరఫరా, తదితర ప్రతి విభాగానికి సంబంధించిన పనులలో గ్రామపంచాయతీ కార్యదర్శులను భాగస్వాములను చేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని గురువారం సాయంత్రం కొలెక్టరెట్ లో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఎంపీడీవోలకు సూచించారు.ఇందిరమ్మ ఇండ్ల మంజూరును నిబంధన ప్రకారం కమిటీల ద్వారా మంజూరు చేసి అందించాలని,ఇప్పటికే మంజూరు చేసిన వాటి వివరాలను ఆన్లైన్లో నమోదు చేస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు.మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన నీరును ప్రజలకు అందించాలన్నారు.గ్రామస్థాయిలో ఉన్న ప్రతి ఓవర్ హెడ్ ట్యాంకులు క్లీన్ చేపిస్తూ ఉండాలని,శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని,లేబర్ టర్నోవర్ పెంచాలని తెలిపారు.అంతర్గత రోడ్ల, అభివృద్ధి పల్లె ప్రకృతి వనాలు,నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, తదితర సదుపాయాలను ప్రజలకు అందిస్తూ,పచ్చదనం పరిశుభ్రత పాటించాలని తడి చెత్త పొడి చెత్త వేరు చేసే విధంగా ప్రతిరోజు ఉదయం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.గ్రామాలు, పట్టణాల అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకంగా ఉండాలని,అంకిత భావంతో పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో, (హౌసింగ్ పీడీ) పురుషోత్తం, అన్ని మండలాల ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.



# ముగ్గురి ప్రాణాలు తీసిన ఈత సరదా

## హల్దీ వాగులో మునిగి ముగ్గురు యువకుల దుర్మరణం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సిద్దిపేట, మే 7 : సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సరదాగా ఈతకు వెళ్లిన ముగ్గురు యువకులు హల్దీ వాగులో మునిగి ప్రాణాలు కోల్పోయిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఒక శుభకార్యానికి హాజరై, ఆ సంతోషాన్ని పంచుకోవాల్సిన యువకులు విగతజీవులుగా మారడంతో వారి కుటుంబాల్లో తీరని శోకం మిగిలింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన ప్రశాంత్ (27), వికాస్ (27), ఆనంద్ రెడ్డి (27) అనే ముగ్గురు స్నేహితులు బుధవారం నాడు మెదక్ జిల్లా తూప్రాన్‌లో జరిగిన ఒక పెళ్లి వేడుకకు హాజరయ్యారు. వివాహ వేడుక అనంతరం, గురువారం ఉదయం తిరుగు ప్రయాణంలో సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం సమీపంలోని హల్దీ వాగు వద్దకు చేరుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో.. సరదాగా వాగులో ఈత కొట్టాలని నిర్ణయించు కున్నారు. వాగులోకి దిగిన ఈ ముగ్గురు స్నేహితులకు నీటి లోతుపై అవగాహన లేకపోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయారు. గల్లంతైన యువకుల కోసం స్థానికులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం పోలీసులు మరియు గజ ఈతగాళ్ల సహాయంతో గాలించగా.. ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతులంతా ఒకే వయసు వారు (27 ఏళ్లు) కావడంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఒకే ఊరికి చెందిన ముగ్గురు యువకులు, అందులోనూ ప్రాణ స్నేహితులు ఇలా ఒకేసారి మృతి చెందడంతో నర్సాపూర్‌లో విషాదం నెలకొంది.





# ఇండ్ల గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

## తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హోళ్లికేరి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 7 : జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా ఇండ్ల గణన కార్య క్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హోళ్లికేరి అన్నారు.గురువారం హైదరాబాద్ నుండి తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హోళ్లికేరి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు,మున్సిపల్ కమిషనర్లు,ముఖ్య ప్రణాళిక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర సంచాలకులు మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు నిర్వహించే ఇండ్ల గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు.అన్ని స్థాయిలలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ పూర్తి చేయాలని,10వ తేదీలోగా ఎన్యుమరేటర్లకు,సూపర్వైజర్లకు మెటీరియల్ కిట్ లు,గుర్తింపు కార్డులు అందజేయాలని తెలిపారు.స్వీయ గణనపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు.ఇండ్ల గణన శిక్షణకు బ్యాచ్స్ హాజరు, సి ఎం ఎం ఎస్ పోర్టల్ లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు.కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు,అదనపు కలెక్టర్ రెవిన్యూ సి. హెచ్.మహేందర్.జి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు నిర్వహించనున్న ఇండ్ల గణన ప్రక్రియ కొరకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఇండ్ల గణన ప్రక్రియలో విధులు నిర్వహించే వారికి అన్ని స్థాయిలలో శిక్షణ పూర్తి చేయడం జరిగిందని,స్వీయ గణనను చేసుకునేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వ హిస్తున్నామని, ప్రజలందరికీ తెలిసే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు స్వీయ గణనపై అవగాహన కల్పించి లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఓ ప్రకాష్, ఎస్ఓ లాల్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి సమ్మర్ క్రికెట్ కోచింగ్ ప్రారంభం

## జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు బి అజయ్ సారధి రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, మే 07 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ హెచ్‌సీఏ ఆధ్వర్యంలో వరంగల్ డిస్టిక్ క్రికెట్ అసోసియేషన్ డబ్ల్యూ డిసిఏ సహకారంతో మే 8 నుండి సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం అవుతుందని మహబూబాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.అజయ్ సారధి రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా క్రీడాకారులు సమ్మర్ క్రికెట్ కోచింగ్ లో పాల్గొని తమ యొక్క క్రీడా ప్రతిభను పెంచుకోవాలన్నారు ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం క్రికెట్ మెలుకువలు నేర్పుతున్నట్టు వెల్లడించారు.ఈ క్యాంపు ద్వారా క్రికెట్ మెలకువలు నేర్చుకొని భవిష్యత్తులో ఐపీఎల్,రంజి,జాతీయ జట్టుకు ఆడే విధంగా క్రీడాకారులు తమ ప్రతిభను మెరుగు పరచుకోవాలని అజయ్ సారధి రెడ్డి కోరారు.అసోసియేషన్ చీఫ్ కోచ్ మెతుకు కుమార్, బి.సాద్విత్ రెడ్డి సహాయకులు సంతోష్, వినయ్ లను పూర్తి సమాచారం కోసం సంప్రదించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాలకు మెతుకు కుమార్ 9885 267524, బి.సాద్విత్ రెడ్డి 9848338036 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



# బిఎంఎస్ మహాసభలను విజయవంతం చేయాలి

## బిఎంఎస్‌అధ్యక్షులు యాదగిరి సత్తయ్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), మే 7: గోదావరిఖని బిఎంఎస్ కేంద్ర కార్యాలయం లో సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బిఎంఎస్) అర్జీవన్ ఏరియా ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య మాట్లాడుతు జూన్ 7వ భూపాలపల్లి లో జరుగనున్న 29వ ద్వైవార్షిక మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.ఈ మహాసభలలో సింగరేణి పరిశ్రమ పరిరక్షణ కార్మిక హక్కుల సంరక్షణ రాష్ట్ర, దేశ ప్రగతిపై సుధీర్ఘంగా చర్చించి ప్రధాన సమస్యల పైన తీర్మానాలు చేయనున్నామని పేర్కొన్నారు. సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వ ఆధీనం నుండి వివిధ ప్రాంతాల నుండి రావలసిన విద్యుత్తు బొగ్గు బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాడ్ చేశారు.కోల్ ఇండియా మాదిరిగా అలవెన్స్ లపై ఆదాయ పన్ను రియంబర్స్ మెంటు సింగరేణిలో చెల్లించాలని తీర్మానం చేస్తామన్నారు.ప్రతి కార్మికునికి సొంత ఇంటి కల అమలు పరచుటకు చర్యలు తీసుకునే విధంగా తీర్మానించనున్నామని తెలిపారు. గతంలో సింగరేణి సంస్థ నిర్వహించిన కార్పొరేట్ మెడికల్ బోర్డు యధావిధిగా కొనసాగించుటకు తక్షణమే చర్యలు తీసుకోవాలని, సంవత్సరాల తరబడి కొనసాగుతున్న మారుపేర్ల మార్పిడి సమస్యపై పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని తీర్మానించున్నామని తెలిపినారు. సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కోలిండియా మాదిరిగా హాయ్ పవర్ కమిటీ వేతనాలు అమలు చేయుటకు చర్యలు తీసుకునే విధంగా ఆందోళన కార్యక్రమాలు రూపొందిస్తామని తెలిపినారు. ఈ సమావేశంలో నాయకులు కర్రావుల మహేష్, గంగిశెట్టి నరసింహులు మేడరామ్మూర్తి,బోడకుంట రాజేశం,పిట్ కార్యదర్శులు పల్లె శ్రీనివాస్,తాట్ల లక్ష్మయ్య, పెంచాల వెంకటస్వామి, వేల్పుల లక్ష్మణ్,తుమ్మ గట్టయ్య, పుప్పాల నాగేంద్రప్రసాద్, బొజ్జపల్లి నాగరాజు,మేడ అజయ్ కుమార్, పాల్గొన్నారు.

# తెలంగాణ ఫుడ్స్ దేశానికి ఆదర్శం"

## డా.బి.జనక్ ప్రసాద్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 7 : బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడం ఒక ముఖ్యమైన సామాజిక బాధ్యతగా భావిస్తూ, గత 50 ఏళ్లుగా నిరంతర సేవలందిస్తున్న తెలంగాణ ఫుడ్స్ సంస్థ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి ఛైర్మన్, తెలంగాణ ఫుడ్ యూనియన్ అధ్యక్షుడు డా. బి. జనక్ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ నాచారం ప్రాంతంలో తెలంగాణ ఫుడ్స్ నూతన క్యాంటీన్ భవన ప్రారంభోత్సవం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ ఎం.ఎ. ఫహీం, స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డా.జనక్ ప్రసాద్ మాట్లాడుతూ, కార్మిక సంక్షేమం, ఉద్యోగుల భద్రత, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ఫుడ్స్ ముందంజలో ఉందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాయని అన్నారు. కార్మికుల కృషి, ఉద్యోగుల అంకితభావం వల్లే సంస్థ ఈ స్థాయికి ఎదిగిందని పేర్కొంటూ, భవిష్యత్తులో తెలంగాణ ఫుడ్స్ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం తెలంగాణ ఫుడ్స్ నూతన ఐఎన్‌టీయూసీ యూనియన్ కార్యాలయాన్ని సంస్థ చైర్మన్, ఎండీతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అనిత రామచంద్రన్, ఇండస్ట్రియల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, సంస్థ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, యూనియన్ జనరల్ సెక్రటరీ దస్తగిరి, ఇతర అధికారులు, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com